UNIVERSAL LIBRARY
OU_204486
UNIVERSAL LIBRARY

OUP—391—29-4-72—10,000.

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T82/B357A Accession No.

Author

Title అరవింద

This book should be returned on or before the date last marked below

# అపనింద

★

రచన:

వాసిరెడ్డి భాస్కరరావు

సుంకర సత్యనారాయణ

★

విశాలాంధ్ర ప్రచురణాలయం

విజయవాడ-4

ప్రచురణ నెం. 464

వెల : రు. 1.50 న. పై

స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు
విజయవాడ - 4

# 1

## ప్లీడరుగారి మేడ

[ ఆఫీసు రూములో డ్రాయరు, కుర్చీలు, బెంచీలు ఉంటాయి. డ్రాయరు మీద ఒక షెల్ఫ్...అందులో కొన్ని 'లా' బుక్సు. ఒక కుర్చీలో ప్లీడరు రంగయ్యగారు కూర్చొని 'లా' బుక్కు తిరగేస్తూ వుంటాడు. వయసు 55 సం॥లు. తెల్లటి చొక్కా, తెల్లటి కట్టుపంచ. ఇంతలో నౌకరు రామన్న ప్రవేశించి హిందూ' పేపరు డ్రాయరుమీద పెట్టి లోపలికి వెళ్ళిపోతాడు. రామన్న వయసు 60 సం।లు. వంటిమీద చొక్కా వుండదు, తలగుడ్డ చుట్టుకొని వుంటాడు ]

రంగ : (గబగబా పేపరు తిప్పిచూచి సంతోషంగా) రామన్నా! రామన్నా!

రామ : (వింగులోపలనుంచే) ఆఁ వత్తన్నా బాబూ. (వచ్చి ప్లీడరు పక్కన నుంచుంటాడు.)

రంగ : బాబు ప్యాసయ్యాడు రామన్నా!

రామ : (సంతోషంగా) అయ్యాడూ! ఇయ్యాల పేపరులో వచ్చిందా బాబూ?

రంగ : (పేపరులో చూపెడుతూ) ఆఁ! ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు.

రామ : కాకపోతే, అబ్బాయి కిదొక లెక్కా? పిడుగు. (నవ్వుతూ) పులికడుపున మేకపిల్ల పుడతందా. (కొంచమాగి విచారంగా) పెద్దమ్మగారే ఉంటే...

రంగ : (జిజ్ఞాసతో) ఉంటే నాకీ చింతే లేకపోను.

రామ : ఏం చేస్తాంలే బాబూ! ఇంతకీ ఆ తల్లికి బూమిమీద నూకలు లేవు.

రంగ : (విచారంగా) అదిగాదు రామన్నా! అమ్మాయికా గతి పట్టింది.

రాము : ఆ చీకు ఎట్లాగూ బతికినంతకాలం ఉండేదే.
రంగ : వీడు ఉద్ధరిస్తా డంటావా ?
రాము : అబ్బాయికేంలే బాబూ, బంగారం.
రంగ : వీడికీ పుడుతున్నాయి పిచ్చిబుద్ధులు. ఈ వయసు కప్పుడే వీడికి మీటింగులు, ఉపన్యాసాలు, ఇవేనా బాగుపడే లక్షణాలు.
రాము : ఇంకా చిన్నతనంగాదు బాబు !
రంగ : చిన్నతనమని ఊరుకోబట్టే వాడి ఇష్టం వచ్చినట్లు తిరుగుతున్నాడు ఎప్పు డొస్తాడో, ఎప్పు డెల్తాడో కంటికి కనబడడమే దుర్లభం.
రాము : ఏదో సావాసాలు గదండీ. మీరు గనక అదేంట్రా అంటే ఇంకా అడుగు దాటతాడా.
రంగ : ఏం అననూ, (మూర్తిగారిని వింగులోనే చూచి) ఓహో ! మూర్తిగారా ! రండి, కూర్చోండి.

[మూర్తి ప్రవేశం. వయసు 50 సం॥లు. తెల్లటిపంచ, లాల్చీ, భుజాన కండువా.]

మూర్తి : మనవాడేడీ ? నేను ఎక్స్పెక్టు చేసినట్టే జరిగింది. తప్పకుండా క్లాసు వస్తుందనుకున్నాను.
రంగ : (చిరునవ్వుతో) వాడి మొహం. ఇంతకూ మీరు వేసిన ఫొండేషన్ అలాంటిది. రామన్నా ! కాఫీ తీసుకురా.

(రామన్న వెళ్ళిపోతాడు.)

మూర్తి : దేవుడు మేలుచేస్తే పై మెరుగు లెవరైనా పెట్టొచ్చు. అసలు పలుకు ఉండాలిగదండీ. వాడితోపాటు నాదగ్గర చదివిన స్టూడెంట్సు ఇంకా ఎందరు లేరు, స్కూల్ ఫైనల్ లోనే దండయాత్రలు కొడుతూ.

(ఇంతలో రామన్న కాఫీ తీసికొచ్చి టేబుల్ మీద పెడతాడు. ఇద్దరూ కాఫీ తాగుతూఉంటారు. మూర్తి ఒకగుక్క కాఫీతాగి కప్పు టేబులుమీద పెడుతూ) మనవాడికి బెనారస్ వెళ్ళి బి. ఎస్. సి. చదవాలని ఉన్నట్లుందే ?

రంగ : బెనారస్సా ! ఎందుకు ? మిడకను. ఆ చదివే దేమిటో ఇక్కడ చదవకూడదా ? అన్నీ పిచ్చివేషాలు, పిచ్చిబుద్ధులు.

మూర్తి : అక్కడ సైన్సుగ్రూపు బాగుంటుందని వాడి ఉద్దేశమనుకుంటాను.

రంగ : అలాగే ఉంటుంది. అక్కడ తయారైన రకాన్నంతా చూడడంలా ? ఏవో నాలుగు గాలికూతలు నేర్చుకోవడం. ఫాసిజం, ఇంపీరియలిజం, సోషలిజం అని గప్పాలు కొట్టుకుంటూ వేగబాండ్సులాగా తిరగటం.

మూర్తి : బాగా చెప్పారు. ఈ రాజకీయాల గాలి సోకినవాడెవ్వడు బాగుపడింది ?

రంగ : స్టూడెంట్సుకి అసలు ఈ గొడవలన్నీ ఎందుకండీ ?

మూర్తి : ఎందుకా ? చదువుకు స్వస్తిచెప్పి వూరేగడానికి.

[ ప్రసాద్ ప్రవేశం : పయస్సు 22 సం॥లు. హాఫ్‌హాండ్ షర్ట్. పాంట్. చక్కని వర్చస్సు. ]

ప్రసా : (సంతోషంగా) నమస్కారమండీ మాష్టరుగారూ !

మూర్తి : పేరు సిల్వావోయి, కూర్చో.

రంగ : ఎక్కడికి వెళ్ళావురా ?

ప్రసా : లైబ్రరీకి వెళ్ళొస్తున్నా. (కూర్చుంటాడు.)

మూర్తి : అదేమిటోయ్, మురహరికి పార్టు 'టు' లో పోవడమేమిటి ? తప్పకుండా ప్యాసవుతాడనుకున్నానే.

ప్రసా : నిజమేనండి, చాల ఆశ్చర్యంగా ఉంది. తెలుగు అంటే వాడికి మహా ఇంటరెస్టుకూడా.

రంగ : అతనికి పొలిటిక్సుగాలి సోకిఉంటుంది.

ప్రసా : అదేంలేదు. వాడు చాలా శ్రద్ధగా చదువుతాడు.

మూర్తి : నిజమే.... అన్‌ఫార్చునేట్ ... (లేస్తూ) వస్తానండి రంగయ్యగారూ.

రంగ : ఇవ్వాళ సాయంత్రం టీపార్టీ ఉంది. మీరూ, మాలతీ, భుజంగ రావుగారూ అయిదింటికి తప్పకుండా రావాలి.

మూర్తి : సందేహమా! అలాగే (అంటూ వెళ్ళుతూ ఉంటాడు. రంగయ్యగారుకూడా మర్యాదగా కుర్చీలోనుంచి కొంచెం లేచి మళ్ళీ కూర్చుంటాడు.)

ప్రసా : (మూర్తితోపాటు నాలుగడుగులు వేసి) మాష్టరుగారూ! తప్ప కుండా రావాలి.

మూర్తి : ఓ! స్ర్టెన్లి! నీవు పిలవడమూ, రాకపోవడమూనా ?
(వెళ్ళిపోతాడు.)

రంగ : ఏరా, బి. యస్‌సి.కి బెనారస్ వెళతానన్నావా ?

ప్రసా : ఔను! క్లాస్ మేట్సంతా బెనారసే వెళుతున్నారు.

రంగ : (అయిష్టంగా) ఎందుకు ?

ప్రసా : అక్కడ లేబరేటరి మంచిదని.

రంగ : ఆక్సుఫర్డ్ ఇంకా అంతకన్నా మంచిది. ఏం ? పోతావా ? ఇంటి దగ్గర భోంచేసి హాయిగా చదువుకోలేక ఎక్కడికో వెడతాడట. అక్కడ క్లైయిమేటు సూటు అవుతుందో లేదో! అదేం ఆలోచన లేదు. మంచీ చెడ్డా లేకుండా ఎవడే గంతెయ్యమంటే ఆ గంతెయ్యడమే.

ప్రసా : ఇందులో ఒకళ్ళు గంతు వేయమనడం ఏముంది ?

రంగ : (తీవ్రంగా) చాలు. తాతకు దగ్గులు నేర్పనవసరంలేదు. నీగ్రూపు నీ వ్యవహారం అంతా తెలుసుకుంటున్నా.

ప్రసా : (విస్మయంగా) ఇందులో వ్యవహారం ఏముంది ?

రంగ : (కోపంగా) కాక మరి ఏమిటి ? (అంటూ బల్లమీద ఉన్న ఆహ్వాన పత్రిక తీసి చేతికిస్తాడు. ప్రసాద్ చదువుకుంటూ ఉంటాడు )

రంగ : క్లబ్బులో మీటింగులు, స్త్రీకి స్వాతంత్ర్యమట! ఈ లీడరు పెద్ద ఉపన్యాసకుడట!

ప్రసా: ఇదేనా నా తప్పు.

రంగ: పైగా సిగ్గులేక నా కెదిరించి మాట్లాడుతున్నావా? వెధవ! ఇక్కడ స్త్రీ స్వాతంత్ర్యం వెలిగించావ్. ఇక ఇక్కడ రాజకీయాలు మండిస్తావ్. చదువుకుంటే బుద్ధిగలిగి సక్రమంగా చదువుకో. లేకపోతే నోరు మూసుకొని ఇంట్లోపడివుండు. ఇక్కడయితే ఆటలు సాగవని బెనారస్ ప్రయాణం కట్టావ్, పోకిరీమూకతో కలిసి.

ప్రసా: నన్ను లక్ష్మి అనండి. కాని...

రంగ: నోరుముయ్.

[పార్వతి ప్రవేశం. రంగయ్యగారి కుమార్తె. విధవరాలు. వయసు 25సం॥లు. గ్లాస్కో చీరె, సిల్కు రవికె]

పార్వ: ఏమిటిరా ప్రసాద్?

ప్రసా: ఏమిలేదు. చదువుకోడానికి కాశీకి వెడతానన్నాను.

పార్వ: ఎందుకురా అంతదూరం. ఆ చదివేదేదో ఇక్కడుండే చదవగూడదూ.

రంగ: ఇప్పుడు వాడికి ఇక్కడి చదువు పనికివచ్చేటట్లుందా?

పార్వ: నీ వొక్కడివి మళ్లీ కాశీ ఎందుకురా? అక్కడ నీళ్ళు పడతయి, పడవు. ఏ కాస్త జబ్బుచేసినా చూసేదెవరు?

[సుశీల ప్రవేశం. వయసు 20సం॥లు. సాదా దుస్తులు. నిరాడంబరంగా ఉంటుంది. కన్నుల్లోనుంచి శాంతం ఒలుకుతూ ఉంటుంది. కొంచెం పొడుగ్గా బక్కగా ఉన్నా, మంచి రూపసి.]

సుశీ: (రంగయ్యగారి వైపు చూచి) అబ్బాయిని ఇష్టమైనచోటికే వెళ్ళి చదువుకోమనండి. ఈ మాత్రానికే మీరలా కోప్పడతారెందుకు?

రంగ: వాడు కాశీకి వెళతానంటున్నాడు. పంపాలిసిందేనా?

సుశీ: పంపండి. కాకపోతే ఇంకా పది రూపాయల ఖర్చు. ఆఖరికి ఇదంతా ఎవరికోసం?

పార్వ : వాడు కాశీ పోతాడు. నేను నెత్తిన గుడ్డేసుకొని గంగలోనో, గయలోనో కలుస్తాను. నీకేం ?

(సుశీల బిక్క మొగంవైచి నుంచుంటుంది.)

ప్రసా : అక్కా ! అనవసరంగా పిన్ని నంటావెందుకు ? ఆమె ఏమంది. పాపం !

పార్వ : పాపం. పుణ్యం ! నీకేం తెలుసురా ?

ప్రసా : చాల్లే ఊరుకో.

పార్వ : అనండిరా, అందరు నన్నే అనండి. మీ అందరితో పడే రోజులుండపట్టే నాకీఖర్మ పట్టింది. నే నెవరిని లే ఈకొంపలో ?

(అంటూ వెళ్ళి పోతుంది)

రంగ : ఇంతకూ పొయ్యేకాలం వచ్చింది. ఊరకనే పుట్టాయా ఈ బుద్ధులు, చావండి.

(లోపలికి వెళ్ళి పోతాడు. ప్రసాద్ తల వంచుకొని విచారంగా కూర్చుంటాడు.)

సుశీ : లే నాయనా, భోంచేద్దువుగాని. ఒంటి గంటయింది.

ప్రసా : మీరు భోంచెయ్యండి పిన్నీ. నాకు ఆకలిగాలేదు. నేను తర్వాత భోంచేస్తాలే.

సుశీ : పోనీ ఆకలి అయినంకే భోంచేయి నాయనా. పెద్దవారు కోప్పడ్డారని భోజనమే మానుకుంటారా ?

ప్రసా : కాదులే పిన్నీ. మీరు వెళ్ళి భోంచెయ్యండి.

సుశీ : ఇక ఈ పాపపుబండి నామీదగానే పోతుంది కాబోలు. లేవవా బాబూ

ప్రసా : సరె వడ్డించు. (అంటూ లేస్తాడు)

(తెర)

# 2

## హాస్పిటల్

(ఒక బల్ల. బ్రాయరు నాలుగు కుర్చీలు, మందుల సీసాలు. డాక్టరు భుజంగరావు శేషగిరిరావుతో మాట్లాడుతూ ప్రవేశిస్తాడు భుజంగరావు : సూటు, రిస్టువాచి. కోటుజేబులో స్టెతస్కోపు, స్పెక్ట్స్. వయసు 25 సం॥లు. శేషగిరిరావు : మామూలు కట్టుపంచ, హాఫ్‌హ్యాండ్ షర్ట్, వయసు 28 సం॥లు.)

భుజం : డామ్, నాన్సెన్స్. అసలి ప్రజలకు తలకాయ అంటూ వుందిరా? అంతా పట్టి బ్రూట్స్.

శేష : గొర్రెలమంద. ఎటుబడితే అటే.

భుజం : ఆ యల్. యమ్. పి. గాడి విలువ చెయ్యకపోయె. ఎందుకురా మన యమ్. బి. బి. యస్? తగలెయ్యనా.

శేష : ఈ దిక్కుమాలిన దేశంలో నీ వాల్యూ ఎవడికి తెలుసు? యఫ్. ఆర్. సి యస్. ప్యాసయిన సర్జన్ జనరల్ మాత్రం నీ మాదిరిగా డయాగ్నైజ్ చేస్తాడురా?

భుజం : ఇంతకష్టపడి చదవడం, చివరకు బూడిదలో పోసిన పన్నీరయింది.

శేష : అసలు ఉన్నఊళ్ళో ప్రాక్టీసు పెట్టటమే తప్పురా.

భుజం : అవును, తెలిసినవాడు ఇచ్చేదీ లేదు. తెలియనివాడు వచ్చేదీ లేదు.

శేష : (నవ్వి) బాగా చెప్పావురా.

భుజం : అందుకే తొందరగా మేరేజ్ చేసుకొని జెండా పీకాలని చూస్తున్నా.

శేష : ఎక్కడికి?

భుజం : ఎక్కడికేమిటి నీ మొఖం. మెడ్రాస్.
శేష : అచ్ఛా! అయితే డిన్నరు ఎప్పుడురా ?
భుజం : ఆగరా, తొందరపడితే అవుతుందా ?
శేష : ఏం, అదేమిటి ?
భుజం : సంఘ సంస్కారమటు, సంస్కారం! దానికెప్పుడూ సంస్కారపు గోడవేగాని పెండ్లిగోడవే లేదురా.
శేష : అసలిదంతా ఆ ప్రసాద్‌గాడి తర్ఫీదురా.

[డాక్టరు కోపంగా తల పంకిస్తూ ఉంటాడు. మురహరి, గోపాలరావుల ప్రవేశం మురహరి వయసు 25 సం॥లు. పైజామా, లాల్చీ, భుజంమీద మఫ్లర్]

భుజం : (మురహరికి షేక్‌హాండ్ ఇస్తూ) సారీ, బ్రదర్! అసలు నీవు తప్పడమేమిటిరా ? వండర్!
శేష : నెవర్ మైండ్ బెటర్‌లక్ నెక్స్టుటైమ్.
గోపా : అసలు సంకురుమయ్యే మనవాడిమీదగానే పోయ్యాడురా ఈ ఏడు.
శేష : ఇంతకీ ఆ మమ్మీ ప్రసాదుగాడు ఎలా పాసయ్యాడురా ?
గోపా : ఏడ్చాడు మనకు తెలియదటురా వాడి సరుకు! వట్టి మట్టి బుర్ర. కాపీ గొట్టివుంటాడు.
ముర : కాదురా. చదువులో మాత్రం అశ్రద్ధచెయ్యడు. చాలాకష్టపడి చదువుతాడు.
గోపా : అసలు బ్రెయిన్ లేకపోయిన తర్వాత ఊరికే రుబ్బితే మాత్రం ఎక్కడనుండి వస్తుందిరా ? తెడ్డుకేం తెలుస్తుంది, పప్పురుచి ?
శేష : ఆఁ! దీనికి పెద్ద చర్చేమిటిరా ? లంచం మేపి వుంటాడు.
గోపా : ఏం, మనవాడుమాత్రం తక్కువ తిన్నాడా ? వీడూ మేపాడుగా!
భుజం : (మురహరివైపు జూచి) అదెప్పుడురోయ్ ?
ముర : (గోపాలరావువంక జూచి) ఛా, వాగబోకురా ఫూల్!

గోపా : (మురహారిని జూచి) పరీక్షకు పోతూ అణాకానీ ఖర్చుపెట్టి హనుమంతుడికి కొబ్బరికాయ కొట్టావుగదరా. ఇప్పుడే మరచి పోయావ్ ? (మురహారి తప్ప మిగతావాళ్లు నవ్వుతారు)

ముర : చచ్చిన పాము నేం చంపుతారులేరా. పోనివ్వండి గొడవ !

శేష : అరేయ్. ప్రసాద్ అప్పుడే బెనారస్ వెళ్ళడానికి ప్లాను వేస్తు న్నాడురోయ్.

భుజం : వాడా ? బెనారస్సా ? నేను నమ్మను.

ముర : వాడిప్పుడే నాకుకనపడి చెప్పాడు. ఇక్కడే ఉండి చదువుతాడట.

భుజం : అయిందీ ! నాకు తెలుసురా.

శేష : అడుగోరా, ప్రసాద్.

గోపా : ఇష్ !

[ ప్రసాద్ ప్రవేశం ]

భుజం : రారా బ్రదర్ ! కూర్చో.

ప్రసా : అందరూ ఒకేచోట దొరికారురా అనుకోకుండా.

ముర : ఎన్నింటికిరా బ్రదర్ టీపార్టీ ?

ప్రసా : ఐదింటికి. తప్పకుండా రావాలి మీరంతా.

భుజం : ఓ ! సర్టెన్లీ.

గోపా : మామూలేనా ? ఏమైనా మసాలావుందా ?

ప్రసా : మన మాష్టరుగారికి ఉల్లిపాయల వాసనే గిట్టదుగా !

గోపా : ఆ ముసలిమేళం ఎందుకురా మనలో ?

ముర : మాష్టరుగారిని పిలవకపోతే ఏం మర్యాదగా ఉంటుందిరా ?

భుజం : జోడు బాగా కుదిరిందిరా. మా మావకీ మీ నాన్నకీ.

ప్రసా : (విసుగ్గా) వెళ్తాను. పని ఉంది. టైముకు రండి. (ప్రసాదు వెళ్లుతూవుంటాడు. ప్రసాదును ఎగతాళిచేస్తూ వెనక నవ్వుతూ ఉంటారు.)

ముర : ఏడ్చినట్లేవుంది మీ సరసం. తీయరా పేక. తీయరా గోపాల్ ! (గోపాల్ పేకతీసి, కలిపి ముక్కలేస్తాడు. ముక్కలెత్తి అందరు చూస్తుంటారు.)

శేష : (పక్కకు తొంగిచూచి) అరే, మీ మామయ్య వస్తున్నాడురో.
మురః : ఎవరు ? మాష్టరుగారా ?
భుజం : ఈ శనిగ్రహం మనవెంట పడిందేమిట్రా ? (అంటూ గబగబా పేకతీసి జేబులో పెడుతూ) రారా, గోపాల్ ! రా, పడుకో, బల్లమీద. (గోపాల్ బల్లమీద పడుకొని రోగిలా నటిస్తూ ఉంటాడు. డాక్టరు స్టెతస్కోపుతో హార్ట్ పరీక్షచేస్తూ ఉంటాడు. తక్కినవాళ్లు చూస్తూ నుంచుంటారు. మూర్తి కూడా ప్రవేశించి ప్రక్కన నిలబడి చూస్తూ ఉంటాడు.)
భుజం : (గోపాల్‌తో) పక్కకు తిరుగు.
గోపా : అబ్బా ! (పక్కకు తిరుగుతాడు, డాక్టరు వీపుమీద స్టెతస్కోపు పెట్టి పరీక్షచేసి వ్రేళ్లు అడ్డంగా పెట్టి కొట్టి)
భుజం : లేచి కూర్చో, (గోపాల్ లేచి కూర్చుంటాడు) నోరు తెరువు. (గోపాల్ నోరు తెరుస్తాడు. డాక్టరు నోరు, కండ్లు పరీక్షచేసి స్టెతస్కోపు బల్లమీద పెట్టి) ఏమిటి కంప్లెంటు ? బాధ ఎక్కడ ?
గోపా : (ఆయాసంగా) బాధ ఒక చోటని ఏమి చెప్పను. నరాలన్నీ గుంజుతాయి. కడుపులో మంట. మాడు నొప్పి గుండెమీద బండ ఎత్తినట్టుంటుంది. తోచదు. ఆకలేస్తుంది. తింటే అరగదు. ఏంచెప్పను నా అవస్థ?
భుజం : (కొంతసేపాలోచించి) సరే (చీటీ రాసి ఇచ్చి) ఈ టానిక్ వాడు. పదిరోజుల్లో తగ్గిపోతుంది. (చీటీ ఇస్తాడు.)
గోపా : (చీటీ తీసుకొని) ఎలా వాడమంటారు ?
భుజం : భోజనం చేసిన తర్వాత వన్ స్పూన్ మెడిసిన్, టూ స్పూన్స్ వాటర్ కలిపి వాడు.
గోపా : అసలు జబ్బేమిటి ?
భుజం : ఏమీ లేదు. కాన్‌స్టిపేషన్ మీద వచ్చింది.
మూర్తి: ఎప్పటినుంచిరా గోపాల్, నీకీ కాన్‌స్టిపేషన్ ?
గోపా : రెండు మూడు నెలలు అయిందండీ. అదే పోతుందని నెగ్‌లెక్ట్‌చేశాను .(డాక్టరువైపు చూచి) డైట్ ఏమిటండీ ?

భుజం : ఏమీా లేదు. మామూలే. మళ్ళీ రేపు ఉదయం కనబడు.
గోపా : సరే.
శేష : వెళ్తామండీ మాష్టరుగారూ ! (నాలుగడుగులు వేస్తారు)
మూర్తి : అరే గోపాల్ ! మెడిసిన్ జాగ్రత్తగా తీసుకో. బాగా ఎండిపోయావ్. దేవుడు మేలుచేస్తే, త్వరలోనే తగ్గిపోతుంది లే. (ముగ్గురూ వెళ్ళిపోతారు.) (భుజంగంతో) మధ్యాహ్నం యెక్కడి కెళ్ళావురా హాస్పిటల్ కట్టేసి ?
భుజం : కొత్తపేటలో ఒక కేసుంటే చూడడానికి వెళ్ళా.
మూర్తి : ఎలా ఉంది ప్రాక్టీసు ? ఏమైనా అభివృద్ధి కనిపిస్తోందా ?
భుజం : నాకేమంత సంతృప్తిగా లేదు
మూర్తి : ఓపెన్ చేసి ఎన్నాళ్ళు అయిందిలే. దేవుడు మేలుచేస్తే, అదే ఇంప్రూవ్ అవుతుంది.
భుజం : ఏం ఇంప్రూవ్ అవుతుందో. ఈ రోజుల్లో మెరిట్ ఎవడికి కావాలి ? ఇందులో కూడ కులాలవారీ కాన్వాస్ జరుగుతూ ఉంటే !
మూర్తి : దేనికైనా కొన్నాళ్ళు ఓపికపట్టాలి. తొందరపడితే ఏంలాభం ?
భుజం : ఆఁ, ఎందుకొచ్చిన అవస్థ ఇదంతా ? మెడ్రాస్ జనరల్ హాస్పిటల్ లో ఒక వేకెన్సీ ఉందని తెలిసింది. ట్రై చేస్తున్నా.
మూర్తి : తొందరపడకు. అంతగా సాగనప్పుడు చూచుకోవచ్చు.
భుజం : తొందరేముంది ! ఇదివరకే అప్లయి చేశాను. ఆర్డర్సుకోసం వెయిట్ చేస్తున్నా. ఇవ్వాళో, రేపో ఆర్డర్సు రావచ్చు.
మూర్తి : ఎందుకురా మళ్ళీ నీవు ఒక్కడవే అక్కడ ?
భుజం : ఆఁ, ఎప్పుడూ అక్కడే ఎందుకుంటాను. కొన్నాళ్ళు అక్కడ ఉంటే ఎక్స్పీరియన్సు వస్తుంది. తరువాత మన ఇష్టంవచ్చిన చోట పెట్టుకోవచ్చు. వాల్యూకూడా ఉంటుంది.
మూర్తి : సరే, నీ ఇష్టంవచ్చినట్లు కానీయి.
(బోయ్ లెటర్ తీసికొస్తాడు. భుజంగరావు చదివి)
భుజం : మామయ్యా ! ఇదిగో ఆర్డర్ ! (మూర్తికి ఇస్తాడు.)

మూర్తి: ఏమిటీ? అర్థరొచ్చిందా? (అంటూ చదువుతాడు.)

భుజం: ఇంత తొందరగా వస్తుందనుకోలేదు. డిసెంబరు ఫస్టుకే వచ్చి జాయిన్ అవమన్నారు. (కొంచెం ఆలోచించి) ఆ సాంబారు తిండి నాకు అసలేపడదు ఇదివరకుకూడ ఒకసారి జబ్బుచేసింది. ఎలాగా అని ఆలోచిస్తున్నా.

మూర్తి: అక్కడికి వెళ్ళి నీవు ఒంటరిగా అవస్థపడడం ఎందుకు? ఇక్కడ వంద సంపాయించినా, అక్కడ మూడువందలు సంపాయించినా ఒకటే. మొన్న రంగయ్యగారితోకూడ మాట్లాడాను. దేవుడు మేలుచేస్తే, పల్లెటూళ్ళనుంచి వచ్చే వారి బంధువులు, పరిచయులు అంతా ఇక్కడికే వస్తూవుంటారు. ఉన్న ఊళ్లో ఇంత అవకాశం ఉంచుకొని, ఎక్కడికో పోవడం ఎందుకు?

భుజం: ఒక్క ఆర్థికమే కాదు నేను ఆలోచించేది. ముందు ఇంకా అభివృద్ధిలోకి రావాలంటే, కొన్నాళ్లు అక్కడ ఉండడం చాలా అవసరం.

మూర్తి: ఉన్న మీ ఇద్దరూ అక్కడికి వెళితే, నేను ఇక్కడ చేయి కాల్చుకోవాలి. అయినా, రెండు మూడు మాసాలలోపుగా లగ్నాలూ లేవు.

భుజం: అయితే వెళ్ళి జాయిన్ అయి, ఈ రెండు మాసాలకు మెడికల్ లీవు అప్లయి చేయమంటూరా?

మూర్తి: (కొంచెం ఆలోచించి) సరే! కానీయి. తరువాతమాట ఎలా ఉంటుందో. (టైమ్ చూచుకొని) టీపార్టీ టైం అయిందే. హాస్పిటల్ కష్టుయ్, వెళదాం.

భుజం: మీరు పదండి. నేను ఇప్పుడే వస్తాను.

(మూర్తి వెడతాడు)

(తెర)

# 3

## రంగయ్యగారి మేడ

[ సుశీల టేబుల్సు వగైరా సర్దుతూ టీపార్టీ ప్రయత్నంలో ఉంటుంది. ]

ప్రసా: మాలతి ఇంకా రాలేదా పిన్నీ ?

సుశీ : రాలేదు నాయనా! తొందరగా రమ్మని నేనూ కబురంపించాను, కాస్త సాయం చేస్తుందని.

ప్రసా: రావలసిందే యీపాటికి. మీరుకూడ కబురంపించారుగా, తప్పకుండా వస్తుంది.

సుశీ : చాల బుద్ధిమంతురాలు. అక్కా, అక్కా అంటూ కలిసి మెలిసి తిరుగుతూ వుంటుంది, మన ఇంట్లో. అగ్రకులంవాళ్ళమనే అతిశయం రవ్వంతకూడ లేదు.

[రామన్న ప్రవేశం]

ప్రసా: తాతా ! నాన్నగారు ఇంకా రాలేదా ?

రామ. రాలేదు బాబూ ! వచ్చే యాలయింది ...

ప్రసా: ఇప్పుడే వస్తాను. ఇక్కడ పని తొందరగా పూర్తిచేయండి. (వెళ్ళిపోతాడు.)

సుశీ : పని అంతా పూర్తిఅయిందిగా తాతా ?

రామ: ఆ ... అయిందమ్మా. వడ్డించటమే ఆలశం. బజారుకెళ్ళి తమలపాకులు తెత్తా.

సుశీ : త్వరగా రా తాతా !

(రామన్న వెళ్ళిపోతాడు. సుశీల టేబుల్సుమీద గుడ్డలువేసి పూల్‌దాన్‌లో సాంబ్రాణి కడ్డీలు వగైరా ఉంచుతూవుంటుంది. వెనుకగా మాలతి వచ్చి సుశీల కళ్లు మూస్తుంది.)

సుశీ : తెలుసుకున్నాలే నీవెంత జాగ్రత్తగా కళ్లు మూసినా. మా...ల...తి.

మాల: తొందరగా గ్రహించావు అక్కా! (అంటూ చేతులు తీస్తుంది.)

సుశీ : ఇంత స్వతంత్రంగా కళ్ళుమూసేది ఇంకెవరు నీవుగాక ?

మాల: (ఒయ్యారంగా) ప్లీ...డ...రు గారు !

సుశీ : నీ ఛలోక్తులన్నీ ఇప్పుడెందుకులే రేపు డాక్టరుగారి ఎదుట చూపెట్టాలి, దాచివుంచు. (మాలతి కొంచెం ముఖం చిట్లిస్తుంది) ముందు ఇవన్నీ ఎక్కడ సర్దాలో సర్దు.

మాల: ప్రసాదు ఎక్కడికి వెళ్ళాడు అక్కా ?

సుశీ : (చిరునవ్వుతో) ఇప్పటివరకు నీవు వస్తావని ఎదురు చూశాడు. ఇప్పుడే వస్తానని బజారు కెళ్ళాడు.

మాల: పార్వతమ్మగారేరీ ?

సుశీ : తలనొప్పిగా ఉందట, పడుకొంది.

మాల: (చిరునవ్వుతో) అందుకనేనా ఇంత నిశ్శబ్దంగా వుంది. అబ్బ! ఆమెతో ఎట్లా అవస్థపడుతున్నావో.

సుశీ : ఆమె దేముంది పాపం ? ఆమె పూజలేమో, ఆమేమో !

మాల: నాదగ్గ రేం దాస్తావులే అక్కా ?

సుశీ : (నిస్పృహతో) అదంతా ఇప్పుడెందుకు. పోనీయి.

మాల: సరేగాని అక్కా ! బీరువాలో అన్ని నగలున్నాయి. ఒక్క నాడైనా పెట్టుకోవేం ? ఇవ్వాళైనా పెట్టుకో.

సుశీ : (నిస్పృహగా) ఎందుకులే !

మాల: కాదు అవన్నీ కుదరవు. తే, తాళపుచెవులు (చేయి చాపుతుంది).

సుశీ : ఈ ఉన్న నగలు చాలు అవి నావి కావమ్మా !

మాల: మరి ఎవరివి ?

సుశీ : ప్రసాద్ తల్లివి.

మాల: అయితే ఇంకేం. నీవుగాక ఇంకెవరు పెట్టుకుంటారు ?

సుశీ : (ముద్దుగా చిరునవ్వుతో) రేపు నీవోటిపిల్ల ఎవరో కోడలుగా వస్తుందిగా.

మాల: వచ్చినప్పుడు చూద్దాంలే. రేపు ఎవళ్లో వస్తారని, ఇవ్వాళ మానుకుంటారా ఏం? ముందు తాళపు చెవులు తే. (అని చేయి జాచుతుంది).

సుశీ: (బుజ్జగింపుగా మాలతి చేయి పట్టుకొని) చెప్పితే వినవుగా. మళ్ళీ ఆ అమ్మాయికి కష్టంగా ఉంటుంది.

మాల: (ఆలోచనతో) ఓహో! అదా సంగతి! సరే, ఇలాంటి విషయాల్లోకూడ ప్లీడరుగారు కలుగజేసుకోరా?

సుశీ: (దీనంగా) ఎవ రేం జేస్తారులే నా కర్మకి.

మాల: (కొంచెం ఉద్రేకంతో) ఈ ఖర్మే మన్నింత అధోగతికి తీసుకొచ్చింది. డబ్బుంటే చాలు. ఇక ఇతర మేమీ చూడనక్కరలా. అమ్మాయి సుఖపడ్డట్టే. హ్హు... ఇందులో ఒకళ్ళని అనే దేముందిలే. ఉన్న పాపం అంతా సంఘంలోనే ఉంది.

[కిల్లీలతో రామన్న ప్రవేశం]

రామ: పెదబాబుగారు వత్తన్నారు.

సుశీ: వస్తున్నారా! (అంటూ రెండు అడుగులు ఎదురుగుండా వస్తుంది. రంగయ్యగారు ప్రవేశించి పూలదండలు సుశీలకు ఇస్తాడు. సుశీల ఒకదండ మాలతికి ఇచ్చి, రెండోదండ తల్లో పెట్టుకుంటూ) ఇంత ఆలశ్యంగా వచ్చారేం?

రంగ: ఇవ్వాళ కోర్టులో పని కొంచెం ఒత్తిడిగా ఉంది. ఇక్కడ పని అంతా పూర్తి అయిందా?

సుశీ: ఆ, మాలతి చాల సహాయంచేసింది.

రంగ: అవును. మాలతి పూనుకుంటే, ఇంకా పని పూర్తికాకుండా ఉంటుందా" (అంటూ లోపలికి వెళ్తాడు. సుశీల వెంట వెళ్తుంది. మాలతి, రామన్నలు టేబుల్సు వగైరాలు సర్దుతూ ఉంటారు. రంగయ్య కోటు, తలగుడ్డ తీసి, కాళ్లుచేతులు కడుక్కొని తుడుచుకుంటూ ప్రవేశిస్తాడు).

రామ: (వింగులో చూచి) అంతా వత్తన్నారండి (సుశీల ఒక పక్కగా తప్పుకుంటుంది).

రంగ: రండి మూర్తిగారు! కూర్చోండి.

(అందరూ కూర్చుంటారు. సుశీల రామన్నకు ప్లేట్సు అందిస్తూ ఉంటుంది. రామన్న తెచ్చి టేబుల్సుమీద ఉంచుతూ ఉంటాడు. అందరూ ఫలహారం చేస్తూ ఉంటారు.)

మూర్తి: ఏంరా ప్రసాద్! దేవుడు మేలుచేస్తే ఓ. యస్ సి. యే చదవాలని నిశ్చయించుకున్నావా?

ప్రసా: ఊఁ.

మూర్తి: ఎందుకోయ్ మళ్ళీ నీకీ సైన్సుగ్రూపు. మీ నాన్న వకీలున్నూ, నీవు సైంటిస్టువూనా!

మధు: మీరు మాష్టరుగారైతే, మీ మేనల్లుడు డాక్టరు అవలేదండీ?

గోపా: తనకంటె ఎక్కువ సంపాయించాలని చదివించారోయ్ మాష్టరుగారు.

శేష: నిజమే. మరి వీడు సైంటిష్టు అయి వాళ్ళ నాన్నగారికంటే ఎక్కువ సంపాయిస్తాడా?

రహీం: చదువంటే సంపాదనా ఏమిటోయ్?

గోపా: (వ్యంగ్యంగా) కాదోయ్. దేవుడు మేలుజేస్తే ఇంట్లోవున్న నాలుగు డబ్బులు వదిలించుకోవడం.

మధు: అందుకనేరా మన గోపాల్ ఒకే దండయాత్రతో స్కూల్ ఫైనల్‌కు సలాం గొట్టాడు.

రంగ: (మూర్తితో) ఇప్పుడు చెప్పాల్నా వీళ్ళ సంపాదన. చదువుకునవాళ్ళు నూటికి పదిమంది లేరు. అందులో తొమ్మండుగురికి నిరుద్యోగం.

మూర్తి: అందుకే 'లా' చదివితే మంచిదంటాను. దేవుడు మేలుచేస్తే మీ ఫైల్సు, మీ బుక్సు, మీ ఇన్‌ఫ్లూయన్సు అన్నీ ఉపయోగపడతాయి. చేతిలో వున్న ఇండిపెండెంటు జాబ్ వదలిపెట్టి ఏదో చదివి ఎవరినో ఆశ్రయించడం దేనికి?

గోపా : లాయర్సులో మాత్రం ఇంటి అద్దె చెల్లించుకోలేక బోర్డు తిరగేసిన వాళ్ళు లేరండి ?

రంగ : (మూర్తివైపు జూచి) ఇదీ వరస. వీళ్ళకు తెలియనూ తెలియదు. ఒకళ్ళు చెప్పింది విననూ వినరు. అది మన రోజుల్లో మాట.

మూర్తి : ఆ పూర్వపు రోజులు ... ఆ చదువులు ...

శేష : అసలు ఆ కాలమే వేరండీ.

గోపా : ఏం ? ఆ కాలంలో పొద్దు పడమరగా పొడిచేదా ? (నవ్వుతారు)

మూర్తి : నీ మొఖం మీదగా పొడిచేది. అది కాదురా. అప్పటి గురు కులాల్లు, అప్పటి శిక్షణ, అసలా విధానమే వేరు.

ప్రసా : అయితే ఆ విద్యా విధానమే ఇప్పుడు కూడా అమలు జరపాలంటారా ?

మూర్తి : దేవుడు మేలుచేసి, ప్రభుత్వమే నా చేతుల్లో ఉంటే ఏనాడో శాసనం చేసే వాణ్ణి.

గోపా : మళ్ళీ మా చెవుల్లో సీసం కరిగించి పోసేవారన్నమాట.

మూర్తి : ఏడ్చావు లేవోయ్. ఆర్ష సాంప్రదాయాలకు వంక బెట్టగల వాళ్ళమా మనం ?

భుజం : ఎన్ని జెప్పినా 'ఓల్డ్ ఈజ్ గోల్డు' అన్నారు.

ప్రసా : (మూర్తితో) పూర్వాచారాలన్నీ మంచివే నంటారా ?

మురః : అన్నిటిమాట అలావుంచు. అప్పటి విద్యావిధానం మంచి దంటావా కాదంటావా ?

ప్రసా : మంచో చెడో, ఇప్పుడుకూడా శూద్రులు చదువుకో గూడదంటే ...

గోపా : అండమాన్సుకు ఎగుమతి చేయాల్సిందే.

మధు : బి. ఎ. స్టూడెంటుకి నీకుకూడా ఈ పిచ్చి సందేహాలేమిత్రూ ? ప్రపంచం అంతా మారిపోతూ ఉంటే పరిస్థితులు మాత్రం మారకుండా ఎలా వుంటాయి ?

శేష : ఏమిటోయ్ ఆ మారింది ? లక్షకు అప్పుడూ రెండు అక్షరాలే. ఇప్పుడూ రెండు అక్షరాలే.

మధు : (నవ్వుతూ) అదిగాదురా బ్రదర్ ! తాటాకు పుస్తకాలుపోయి అచ్చుపుస్తకాలు వచ్చాయి.

గోపా : పిలకలూడాయ్; క్రాపులు మొలిచాయ్.

శేష : ఈ గొర్రెబొచ్చుకంటె ఆ పిలకే నయం.

రహీం : ఇంకేం, రేపు పొద్దున్నే గుండు కొట్టించి పిలక పెట్టించు.

గోపా : ఏరా బ్రదర్ ! ఇవ్వాళ మెయిలుకు వెళదామా ?

శేష : ఎక్కడికిరా ?

గోపా : తిరుపతి కొండకురా. గుండు కొట్టించడానికి. (నవ్వుతారు)

మూర్తి : చూచారా రంగయ్యగారూ ! పాశ్చాత్య వ్యామోహం ఎంత ప్రబలి పోయిందో – ఈ యంత్రాలన్నీ యూరోపియనులే కనిపెట్టారని వీళ్ళఉద్దేశం. మహర్షులు త్రికాలవేదులు–

రంగ : అవును. వాళ్ళెక్కడండి. మహాత్ములు !

మూర్తి : వాళ్ళ కీమాత్రం జ్ఞానం లేదుకాబోలు. మన అధర్వణ వేదంలో ఎన్ని మహత్తర విషయాలున్నాయో ఈ ఇంగ్లీషు చిలకలకేం తెలుసు ?

రంగ : ఆఁ...వాళ్ళమొఖం. అసలు సృష్టికి ఆదిగ్రంథాలు మన వేదాలే గదండీ !

మూర్తి : ఈనాడు జర్మనీవాడు ప్రపంచాన్నంతా ఊపేయగలిగాడంటే ఆ వేదాల మహత్తే. ఈ టాంకులు, విమానాలు అన్నీ మన అధర్వణవేదాన్ని బట్టి కనిపెట్టినవే. తెల్లవాళ్ళ మాత్రం సైన్సు తెలియకకాదు మన మహర్షులు ఊరుకుంది. ఈ దిక్కుమాలిన యంత్రాల ఫలితం ఏముంది, దేశమంతా నాశన మవడం తప్ప ?

శేష : అవునండి. యంత్రాలన్నీ బాయికాట్ చేయాల్సిందే.

మురః : అరే శేషూ ! నీవు బాయికాట్ చేస్తే చేశావుగాని, నీ సైకిలు మాత్రం నా కివ్వరా.

రహీం: నీకు కాదురా నాకు.

గోపా: నీవు డాక్టరుగారి సైకిలు తీసుకో.

మధు : మరి నీకో ?

గోపా: నాకు మాష్టరుగారి సైకిలు ఉందిలేరా.

మూర్తి: ఓరి శుంఠా! పిడుక్కి, బియ్యానికి ఒకటే మంత్రమటరా ?

భుజం: అది గాదురా మన పెద్దలు జెప్పేది, యంత్రాల వల్ల అనెంప్లాయ్‌మెంటు ఎక్కువవుతుందనిరా.

ప్రసా: అవును. ఏ కొద్దిమంది చేతుల్లోనో వుంటే అలాగే జరుగుతుంది.

శేష : కొద్దిమందికి గాక, అందరికీ యంత్రాలు యెక్కడినుండి వస్తాయిరా ?

ప్రసా: సంఘపరం చేస్తే సరి. అందరికీ అందుబాటులో వుంటాయి.

శేష : ఎలాగయినా పదిమంది పని ఒకే యంత్రం చేస్తుందిగా.

గోపా: తక్కిన తొమ్మండుగురూ నెత్తిన గుడ్డేసుకొని పోతారు.

ప్రసా: ఇవ్వాళ పదిగంటలు చేసేపని రేపు గంటేచేస్తారు.

మధు : తక్కిన తొమ్మిదిగంటలు విజ్ఞానాభివృద్ధికోసం ఉపయోగిస్తారు.

భుజం: అవును. విజ్ఞానం అభివృద్ధి అయింది. మారణ యంత్రాలు కనిపెట్టారు. దీని ఫలితం ?

గోపా: నేలమట్టం.

ప్రసా: అదిగాదురా బ్రదర్! యంత్రం ఒక వస్తువు. దాన్ని మంచికీ ఉపయోగించుకో వచ్చు, చెడుకీ ఉపయోగించుకో వచ్చు. ఆ లోపం ఉపయోగించే విధానంలో ఉందిగాని, యంత్రంలో లేదు.

మధు : ఎలెక్ట్రిసిటీతో పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు నడపొచ్చు. ప్రాణాలు తీయొచ్చు. కాబట్టి ఆ లోపం ఎలెక్ట్రిసిటీదా ?

మురః : అవును. చాకుతో దోసకాయ కోసుకోవచ్చు; మెడకాయ కోసుకోవచ్చు. కాబట్టి చాకే లేకుండా చేద్దామా ?

గోపా: అసలు చాకే లేకపోతే, మన డాక్టరు ఆపరేషన్ ఎలాచేస్తాడు?

రంగ : (వినుగ్గా) ఎందుకొచ్చిన కంఠశోష ఇది; పాడితే ఎవరైనా కమ్మగా రెండుపాటలు పాడండి.

మూర్తి: నిజమే, (ప్రసాద్వైపు చూచి) పాడరా ప్రసాద్.

రంగ : వాడి పాట కేం వచ్చెలెండి. అమ్మాయి బాగా పాడుతుందని విన్నాను. (మాలతివైపు జూచి) ఏదీ, ఒక పాట పాడమ్మా!

మూర్తి: పాడు అమ్మా కొత్తవాళ్లెవరున్నారు ? అంతా మనవాళ్లేగా.

(మాలతి పాడుతుంది)

రంగ : (సంతోషంతో) ఎక్స్లెంట్ గా పాడావు మాలతీ!

(మురహరి, భుజంగరావు వగైరాలు 'వెళ్ళొస్తాం' అంటూ లేస్తారు.)

గోపా: అరే ప్రసాద్! మళ్ళీ సరస్వతీలోకి 'మాలపిల్ల' వచ్చింది వెళదామా ?

ముర :
మధు : } ఓ యస్. తప్పకుండా.
రహీం:

ప్రసా: (డాక్టరువంక చూచి) ఏం బ్రదర్!

భుజం: (వినుగ్గా) మీరు వెళ్ళండి. నాకు కొంచెం తలనొప్పిగా వుంది.

మధు : నీవురా శేషూ ?

గోపా: వాడూ రాడులే.

శేష : అదేమిటిరా, నే నెందుకు రాను ?

గోపా: నీకు యంత్రాలు పనికిరావుగదరా ? సినిమామాత్రం యంత్రం గాదూ ?

(అందరూ నవ్వుతూ వెళ్ళిపోతారు. మూర్తి రంగయ్యగారితోను, మాలతి సుశీలతోను చెప్పి వెళ్ళిపోతారు.)

[ తెర ]

# 4

## మూర్తి ఇల్లు

[మాలతి తలదువ్వుకుంటూ హుషారుగా పాడుకుంటూ ఉంటుంది.
తీన్ తాల్ - పహిడ్ మిశ్ర.

సుందరమౌ యీ నందనవనమున
ముండ్లపొదలోయీ
మాలీ
ములచెను కనుమోయీ ॥మాలీ॥

ఈ కంటకముల నేరివేసి నీ
వికసించే ఈ విరికన్నియలను
కాపాడాలోయీ మాలీ
కళ రావాలోయీ
తోటకు
కళ రావాలోయీ ॥మాలీ॥

ఏ దరి తోచక ఈ చీకాకున
విసిగి విసిగి నీ ప్రేమప్రసూనము
వాడిపోవునేమో
మాలీ
వాడనీయకోయీ॥ మాలీ॥

[భుజంగరావు ప్రవేశం]

భుజం : (నవ్వుతూ) ఐ.సి. యస్. ఆఫీసరుగారికి ఇవ్వాళ అప్పుడే పని తెమలినట్లుందే.

మాల : ఏమి టీ వింతసంభాషణ ?

భుజం : ఏమీ లేదు. ఇవ్వాళ ఎక్సెలెంట్ పిక్చర్ "లైలామజ్నూ" వచ్చింది.

మాల : నేను రాను

భుజం : అలా అంటున్నావేం ? ఏమైనా సుస్తీగా ఉందా ? (అంటూ కోటుజేబులో ఉన్న స్టెతస్కోపు తీసుకొని, ముందుకు రెండడుగులు వేస్తాడు.)

మాల : (అయిష్టంగా) సుస్తీ ఏమీలేదు.

భుజం : (ఆగిపోతూ) మామయ్య లేడని సంకోచిస్తున్నావా రావడానికి ?

మాల : (వ్యంగ్యంగా) ఊఁ, అదే.

భుజం : ఓ ... పెండ్లి కాకపూర్వమే కలిసి సినిమాకు వెళ్ళిందనుకుంటారనా ?

మాల : (విసుగ్గా) ఏమి టీ లేనిపోనికబుర్లు. పిక్చర్ నే నిదివరకే చూశాను.

భుజం : చూస్తే మరి ఎలావుంది ?

మాల : చాల బాగుంది.

భుజం : ఏమిటి ?

మాల : దాని ఆదర్శం.

భుజం : ఏమిటి అంత గొప్ప ఆదర్శం ?

మాల : లైలా మజ్నూలు చిన్నప్పటినుంచి ఒకరినొకరు ప్రేమించుకున్నారు. సంఘం ఎన్నో బాధలు పెట్టింది. తమ ప్రాణాన్ని అయినా విడిచారుగాని, ఆదర్శాన్నిమాత్రం విడువలేదు.

భుజం : అయితే తప్పకుండా చూడాల్సిందే. అంత మంచి సినిమాకు నన్నొక్కణ్ణే వెళ్లమంటావా ?

మాల : అఁ....మరిచిపోయాను. నీకు యంత్రాలే గిట్టవుగా? సినిమాలు ఎలా పనికివస్తాయి ?

భుజం : (నవ్వుతూ) వాడనకోసం అలా మాట్లాడాను గాని యంత్రాలు లేకుండా మనకు క్షణం గడుస్తుందా ?

మాల : (వెక్కిరింతగా) అయితే మనం చెప్పే నీతులు పరులకన్న మాట.

భుజం : సరదాగా అన్నమాటల్ని నీవింత సీరియస్‌గా తీసుకున్నావా మాలతీ ? మనం యంత్రాలు వదులుకుంటే ఎలా ? రెండు మాసాల్లో మాంబళంలో కాపురం పెట్టబోతున్నాం గదా ! అక్కడ మనకొక కారు, బంగళా ! వెన్నెలరాత్రుల్లో బీచ్ షికార్లు ! రేడియోలు ! సినిమాలు ! ఓహో, ఎంత ఆనందంగా ఉంటుంది ఆ జీవితం !

మాల : అహ హ— హ— ఏమిటీ భావకవిత్వం ? కట్టి పెట్టు.

భుజం : (లాలనగా) మాలతి ! కోపం వచ్చిందా ? ఎలాగైనా త్వరలో దంపతులం కాబోతున్నాం కాబట్టి చనువుగా మాట్లాడాను.

మాల : ఎందుకీ అసందర్భ ప్రలాపం ?

(వెళ్ళిపోతూ ఉంటుంది.)

భుజం : మాలతీ ! ఒక్కమాట ... ... ... నేనంటే నీ కిష్టంలేదా ? నీ హృదయం విప్పిచెప్పు. నిన్ను నేనెంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలియందికాదు. చిన్నప్పటినుంచి ఒకచోట పెరిగాం. మాలతీ ! చెప్పు.

మాల : నిర్మొగమోటంగా అడిగావు గనుక చెబుతున్నా. నీవంటే నాకేమాత్రం ఇష్టంలేదు.

భుజం : (కోపంతో) ఆఁ... ఏమిటీ ! నిజమేనా ? మాలతీ ! నిజమేనా ?

మాల : ముమ్మాటికీ నిజమే.

భుజం : మాలతీ ! నామాటల్ని బట్టి నీ భావాలకు వ్యతిరేకమని భ్రమపడు తున్నావా ? స్త్రీ స్వాతంత్ర్యాన్ని నీ వెంతగా కోరుతున్నావో, నేనూ అంతగానే కోరుతున్నా. మామయ్యకు

కష్టంగా ఉంటుందేమో అని ఇన్నాళ్ళనుంచి నా భావాల్ని చంపుకున్నాను. ఈ పెండ్లికాస్తా అయిన తర్వాత ఇక మన ఇష్టం.

మాల : ఒక్క మామయ్యకు భయబడి నీ భావాల్ని చంపుకున్నవాడివి ఇంకా సంఘాన్ని ఏం ఎదిరిస్తావ్ ? అయినా నీ స్వభావం వేరు. నా స్వభావం వేరు. మన ఇద్దరికి పెళ్ళి జరగడం అసంభవం.

భుజం : ఇంతకు ముందేకదా నీవు లైలామజునూ కథ చెప్పింది. ఇక నా జీవితంకూడా మజునూలాగా నీ ప్రేమకు ఆహుతి కావల సిందేనా ? ఇదేనా నీవు పవిత్ర ప్రేమకు చూపే ఆదరణ ?

మాల : లైలా మజునూను ప్రేమించింది. మజునూ లైలాను ప్రేమిం చాడు. ఒకరి కోసం ఒకరు ప్రాణాలర్పించారు. అదీ పవిత్ర ప్రేమ. నేను నిన్ను ప్రేమించడంలేదు. అనవసరంగా వేధించకు.

భుజం : మాలతీ ! నా మాట వినవూ ? (అని చేయి పట్టుకుంటాడు)

మాల : (చేయి విదలించుకుంటూ) ఛీ ! నా చేయి వదలు. చదువు కున్నవాడివి, నీ కామాత్రం తెలియదూ ?

భుజం : (కోపంతో) మాలతీ ! జాగ్రత్త ! మరొకసారి ఆలోచించు.

మాల : జాగ్రత్తగా ఆలోచించే చెబుతున్నా.

భుజం : అవును. నీ ఆలోచన నాకు తెలుసు. ఇదంతా ఆ స్కౌండ్రల్ ప్రసాదు గాడి కుట్ర.

మాల : ప్రసాదు ఏం చేశాడు ? అతనిమీద అలా విరుచుకు పడతావ్ ?

భుజం : అవును. నీవు వాడిమీద మాట ఎందుకు పడనిస్తావ్. మీ నాటకం అంతా మొదటినుంచీ కనిపెడుతూనే ఉన్నా.

మాల : ఏమిటి నీవు కనిపెట్టింది. పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. (అంటూ లోనికి వెళుతుంది.)

భుజం : ఛీ, నోరుముయ్, జాగ్రత్త !

(తెర)

# 5

## రంగయ్యగారి మేడ

[పార్వతి మంచంమీద పడుకొని ఉంటుంది రెండు కుర్చీలు ఒక పడక కుర్చీ పక్కగా ఉంటాయి. మధ్యలో ఒక టేబుల్, దానిమీద ఫ్లవర్‌దాన్, మంచం క్రింద ఉమ్మి ఊసుకోవటానికి బేసిన్ ఉంటుంది. రామన్న మెడికల్ బ్యాగ్‌తో ముందు, డాక్టరు భుజంగరావు వెనుక ప్రవేశిస్తారు.]

భుజం : ఏమండీ! ఏంటి జబ్బు చేసిందట! (అంటూ ప్రవేశించి నాడి, టెంపరేచరు వగైరాలు చూస్తూవుంటాడు. డాక్టరు మాట విని సుశీల ప్రవేశించి, ప్రక్కగా నుంచొని)

సుశీ : జ్వరం ఎంత ఉందండీ ?

భుజం : జ్వరం అంత ఎక్కువగా లేదు. ఎప్పటినుంచి జ్వరం ?

సుశీ : నిన్నటినుంచి కొంచెం బద్ధకంగానే ఉంది. రాత్రి భోంచేయలా. కాసిని పాలుతాగి పడుకుంది.

భుజం : (పార్వతితో) ఈ పూట ఏమైనా ఆహారం తీసుకున్నారా ?

పార్వ : లేదు.

భుజం : అందుకనే ఇంత నీరసంగా ఉంది. (అంటూ చీటీ రాస్తూ ఉంటాడు. సుశీల లోపలికెళ్ళి పదిరూపాయల నోటు తీసుకొని వస్తుంది.)

రామ : నిత్రంగా ఉందండీ. మాట్లాడటా మాట్లాడటా పడిపోతుంది.

భుజం : (పార్వతితో) మీ నాన్నగారు ఎక్కడికి వెళ్ళారు ?

పార్వ : బజారుకెళ్ళి ఉంటారు.

భుజం : (మందుచీటీ రామన్నకిచ్చి,సుశీలతో) ఈ మందు తెప్పించండి.

సుశీ: తాతా! బజారుకెళ్ళి ఈ మందు తీసుకురా!

రామ: (వెళ్ళబోతూ, డాక్టర్ని జూచి) ఎంత అవుతుంది బాబూ!

భుజం: అయిదో, ఆరో ఉంటుంది.

(సుశీల రామన్న చేతికి డబ్బు ఇస్తుంది. రామన్న వెళ్ళిపోతాడు.)

సుశీ: ఇప్పుడు కొంచెం కాఫీ ఇవ్వమంటారా?

భుజం: ఇవ్వండి. (ఇంజక్షన్ సామాను బయటికి తీసి సర్దుతూ ఉంటాడు. సుశీల కాఫీకొరకు లోపలకు వెళ్తుంది.)

పార్వ: ఈ రోగం నయమయ్యేదీ చచ్చేదీ ఏం కనపడ్డంలా. ఊరికే సీసాలకు సీసాలు తాగటమే కాని.

భుజం: మనశ్శాంతి లేకపోతే, మందులు మాత్రం ఏం పనిచేస్తాయి?

పార్వ: ఈ జన్మలో నాకు ఆ గీతలేదు. ఇక నా బతుకు ఇట్లా తెల్లారాలిసిందే.

భుజం: ఇదే మనవాళ్ళల్లో ఉన్న పిచ్చి. మాటకుముందు గీత, రాత. ప్రయత్నంచేస్తే కానిపని అని ఒకటుందా?

పార్వ: ఏం చేయను. 'కృష్ణా, రామా' అంటూ ఒకమూల పడి ఉండాలిసిందేకాని.

భుజం: అదేమిటండీ, అలా అంటారు. అరవైఏండ్ల ముసలివాళ్ళకు లేని వైరాగ్యం మీకు పట్టుకుందేమిటి?

పార్వ: ఏమిటో, మీరు చెప్పింది నాకు అర్థం కావటంలా!

భుజం: (చిరునవ్వుతో) ఏముంది. పక్వానికి వచ్చిన పండును అనుభవించకపోతే ఏమౌతుంది?

పార్వ: (ఏమీ మాట్లాడకుండా ఉంటుంది.)

భుజం: కుళ్ళిపోతుంది. ఏదైనా అంతే.

పార్వ: అంతే?

భుజం: ఏదైనా తరుణం మించకముందే చేయాలి. చిన్నతనంలో ఆడుకోవాలి. ఏమంటారు?

పార్వ: అవును.

భుజం: అలాగే యుక్తవయస్సు వచ్చినప్పుడు పెండ్లి జేసుకోవాలి. (పార్వతి మౌనంగా ఉంటుంది.) లేకపోతే ఇలాగే ఎన్నో బాధలు పడాల్సి వస్తుంది. డాక్టర్ని కాబట్టి ఉన్న విషయాన్ని చెప్పడం నా ధర్మం. మరొక విధంగా అనుకోకండి.

పార్వ: అయితే ఈ జబ్బు కిక మందే లేదంటారా?

భుజం: మందులతో ఏమీ ప్రయోజనం లేదు. ఇది మానసిక వ్యాధి. ఋతుధర్మాన్ని అనుసరించి ప్రవర్తించాలి. ఇలాంటి కేసులు రెండు మూడు చూశాను. ఇక మందులతో లాభంలేదని పట్టు బట్టి పెండ్లి చేయించాను. ఇప్పుడు వాళ్ళ యిళ్ళకు వెళితే ఎంతో ఆనందంగా ఉంటుంది. కిలకిలలాడుతూ ఆ పిల్లలూ — వాళ్ళూ....

పార్వ: ఏదైనా లోకం మెచ్చదుగా.

భుజం: అరవై ఏళ్ళ నాన్నగారు పిల్లలుండగా రెండో పెళ్ళి చేసుకుంటే లేదుగాని, ఇరవై ఏళ్ళ కూతురు చేసుకుంటే తప్పొచ్చిందా?

పార్వ: మగవాళ్ళు ఏంచేసినా చెల్లుతుంది.

భుజం: సృష్టిలో అందరూ ఒకటే. స్వార్థపరులైన పురుషులు ఈ తప్పుడు ఆచారాల్ని కల్పించి స్త్రీలకు ఎంతో అన్యాయం చేశారు. ఈ అన్యాయాన్ని ఎదుర్కోడానికే మేం పనిచేస్తున్నాం.

పార్వ: మీబోటివారు తలుచుకుంటే ఏదైనా చేయగలరు.

భుజం: (నవ్వుతూ) మీ రందరూ తోడ్పడితేనే.

పార్వ: నాదేముంది లెండి. దిక్కులేని పక్షిని.

భుజం: అలా అనగూడదు. మీకోసం నేను ఎంత త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్నా. (ఇంతలో సుశీల కాఫీ తీసుకొచ్చి పార్వతికిస్తుంది. పార్వతి కాఫీ తాగుతూ ఉంటుంది. రామన్న ప్రవేశం).

భుజం: ఈ మాత్రలు మూడుపూటలు మూడు వేసుకోండి. (సుశీలతో) ఇక్కడ గాలిలేదు. మంచం అలా వరండాలో వేయిస్తే మంచిది.

రోగికి మంచి గాలికావాలి. నేను వస్తాను. (డాక్టరు వెళ్ళి పోతాడు).

సుశీ : లే అమ్మాయి! మంచం లోపలవేస్తాను. (పార్వతి లేచి లోపలికి వెళ్తుంది. సుశీల పక్క చుట్టు, రామన్న మంచం తీసి కొని లోపలికి వెళ్తారు. రంగయ్య ప్రవేశిస్తూ).

రంగ : సుశీ! సుశీ! (ఆఁ–అంటూ సుశీల వస్తుంది) డాక్టరు వచ్చాడా?

సుశీ : ఆ మందిచ్చి వెళ్ళారు.

రంగ : సరే (అంటూ చీరెల పాకెట్టు అందించి పడక కుర్చీలో కూర్చుంటాడు).

సుశీ : (పాకెట్ ఊడదీస్తూ) ఏమిటివి ?

రంగ : చూడరాదూ ?

సుశీ : (చీరెలు చూస్తూ) చాలా బాగున్నాయి.

రంగ : డిజైన్ బాగుందా ? ఇవ్వాళే కొత్తగా మార్కెట్టులోకి వచ్చాయి. నచ్చినాయా ?

సుశీ : నచ్చకేం. ఖరీదెంత ?

రంగ : ఆ ఎంత. రెండూ కలిసి ఒక వంద చిల్లర.

సుశీ : వందే! ఎందుకు ఇంత ఖరీదుపెట్టి ? ఇదివరకే కావలసినన్ని పెట్టెనిండా ఉంటే.

రంగ : ఏం ఉంటే ? ఈ రోజుల్లో కావాలన్నప్పుడు దొరుకుతాయా ఇలాంటి రకాలు ?

సుశీ : ఏం దొరక్కపోతే ? ఇప్పుడొచ్చిన తొందరేముంది ?

రంగ : ఆ–వచ్చేది చైత్రమాసం. పెళ్ళిళ్ళ తరుణమాయె. అందుకనే వస్తూ వస్తూ ఒక రవ్వల నెక్లెస్‌కుకూడా ఆర్డరిచ్చాను.

సుశీ : (భర్తవైపు దయాదృష్టితో చూస్తూ) ఎందుకు నాకోసం మీకింత శ్రమ ?

రంగ : శ్రమ ఏముంది ఇందులో ? నీవు సంతోషంగావుంటే నాకు అంతే చాలు.

సుశీ : నా కేం కొరతచేశారు, సంతోషంగా ఉండకపోవటానికి ?
రంగ : అదికాదు సుశీ!.........(సుశీల చీరెలు మడతపెడుతూ ఉంటుంది. మూర్తి ప్రవేశం)
రంగ : ఓ... మాష్టారుగారా! రండి.
(కుర్చీ చూపెడతాడు. మూర్తి సుశీల మడతపెట్టే చీరల వైపు చూస్తూ కుర్చీలో కూర్చుంటూఉంటాడు.)
రంగ : మీకు నాణ్యం బాగా తెలుసుగా, చూడండి ఎలా ఉన్నాయో చీరెలు.
మూర్తి : (నవ్వుతూ) నాణ్యానికేంలెండి.
(సుశీల మూర్తి చేతికి చీరెలందిస్తుంది. మూర్తి అటూ ఇటూ తిప్పి పరీక్ష చేస్తూ)
మూర్తి : చాలా బాగున్నాయి. డిజైన్ చాలా నాజూకుగా ఉంది. అసలీ రకాలు ఇప్పుడు దొరకడంలా. (సుశీలకు చీరెలందిస్తూ రంగయ్యవైపు చూస్తూ) మీరు సెలెక్ట్ చేస్తే ఇంకా వంక ఉంటుందా ?
రంగ : (నవ్వి) మా సుశీకి ఇంత ఖరీదుపెట్టి తేవటం ఇష్టం లేదు.
మూర్తి : ఎంతేమిటి ఖరీదు ?
రంగ : నూటపాతిక.
మూర్తి : మీబోటివారికి ఇదొక లెక్కా ? ఇలాంటి చీరెలు మీరు కొనకపోతే కొనే దెవరు యిక ? (సుశీలవైపు తిరిగి) ఏం అమ్మా!
(సుశీల నవ్వుతూ చీరెలు తీసుకొని వెళ్ళిపోతుంది. రంగయ్య సంతోషంగా సుశీలవైపు చూస్తూ ఉంటాడు.)
మూర్తి : నిజంగా మీరెంతో అదృష్టవంతులండీ రంగయ్యగారు!
రంగ : ఏం అదృష్టమయినా ... ఈ వయసులో—
మూర్తి : (కొంచెం ఆశ్చర్యంగా) ఏం ? ఈ వయసులో అదేంటండి అలా అంటారు ? ఉసూరుమియాల్లాగ ఉండే ఈనాటి కుర్ర కుంకలకంటే మీరు ఎన్నోరెట్లు మెరుగు. పట్టుమని పదిమైళ్ళు

నడవమనండి ఒక్క వెధవని. మీమాదిరి ఎముకపుష్టి ఉన్న వాణ్ణి ఒక్కణ్ణి చూపెట్టుండి ఈనాటి యువకుల్లో.

రంగ : ఏమున్నా... ఈ వయసులో పెళ్ళిచేసుకోవటం... నా అనుభవాన్నిబట్టి... అంత మంచిది కాదనుకుంటున్నా. ఈ అవస్థఅంతా లేకుండా, ముందే మీరు జాగ్రత్తపడ్డారు.

మూర్తి : ఇందులో మీరుపడే అవస్థ ఏముందండీ? నిజంగా సుశీల లాంటి యోగ్యురాలు భార్యగా లభించడం కేవలం పూర్వజన్మ సుకృతం.

రంగ : అది నిజమే అనుకోండి. కాని...

మూర్తి : నాకు చెప్పడానికి కూడా సందేహిస్తున్నారా?

రంగ : నో, నో, ఎన్ని చెప్పినా, నే నామె దయకు పాత్రుడనయ్యాను కాని...

మూర్తి : ఓహో! అదా మీ చింత. అదెంత భాగ్యం.

రంగ : ఏమిటంత తేలికగా మాట్లాడుతున్నారు? నేను వాడని ఔషధమంటూ లేదు.

మూర్తి : ఏమిటి మీరు వాడింది. ఈ వెధవ అల్లోపతీ, హోమియోపతీ మందులా?

(ఇంతలో సుశీల కాఫీ తెచ్చి ఇద్దరకూ ఇస్తుంది. తాగుతూ ఉంటారు.)

సుశీ : అమ్మాయి పెళ్ళి ఎప్పుడండీ మాష్టరుగారూ!

రంగ : స్నేహితురాలి పెళ్ళి త్వరగా చూడాలని ఉన్నట్లుందే మా సుశీకి. ఇంతకూ ఏమి చదివిస్తావ్?

సుశీ : (నవ్వి) ఇప్పుడు మీరు తెచ్చిన చీరల్లో ఒకటి.

మూర్తి : నీ కోరిక తొందరలోనే పూర్తిచేస్తానమ్మా! చైత్రమాసం మొదట్లో మంచి లగ్నంవుంది.

రంగ : అలాగే చెయ్యండి తప్పకుండా.

మూర్తి: మంచిది వెళ్ళివస్తాను.
రంగ : (లైం చూస్తూ) నేనూవస్తా పదండి. షికారుగా వెళదాం. సుశీ నా ఉత్తరీయం తీసుకురా. (వెళతారు)

[రామన్న బల్లమీద కప్పులు కిందబెట్టి డ్రాయరు తుడిచి పుస్తకాలు సర్దుతూ వుంటాడు]

సుశీ : తాతా! మాలతి ఏది?
రామ: వత్తా వుండాలమ్మా, ఇందాకే వత్తానంది
సుశీ : మాలతి పెళ్ళట తాతా?
రామ: (ఆశ్చర్యంగా) ఏంటీ? పెళ్ళా? ఎప్పుడమ్మా?
సుశీ : వచ్చే చైత్ర మాసంలో.
రామ: ఎవరు? ఆ డాక్టరేనా?
సుశీ : ఊఁ. ఆ డాక్టరే.
రాము: (అసంతృప్తి తెలియజేస్తూ ముఖం చిట్లిస్తాడు.) సరే, ఇంకేం?
సుశీ : అదేమిటీ తాతా! ఆయనగారు బాగానే ఉంటాడుగా?
రామ : అందానికేమొచ్చె. ఆ అమ్మాయి బుద్దెక్కడ; ఆయన బుద్దెక్కడ?

[మాలతి ప్రవేశిస్తుంది.]

రామ : ఇదిగో మాలతమ్మగారు వత్తానే వుంది.
సుశీ : (చిరునవ్వుతో) మాలతమ్మగారు కాదు తాతా! డాక్టరమ్మ గారని పిలువు.
రామ : అట్టాగా! దండాలండీ డాక్టరమ్మగారు.
మాల : (నవ్వుతూ) మీకు ఈ జబ్బు ఎన్నాళ్ళనుంచి? (అందరూ నవ్వుతారు.)
రామ : (నవ్వుతూ) డాక్టరమ్మగారివి ఎప్పుడయ్యావమ్మా? ఒకనా డింత పప్పన్నం అన్నా పెట్టకుండా.
సుశీ : ఇంకా కాలేదు తాతా! అయితే నీకు పప్పన్నం పెట్టకుండా ఉంటుందా? పదిరోజులు ఓపిక పట్టు.

మాల : ఈ వేళ తాతా మనుమరాలు మంచి హుషారుగా వున్నారు. ఏంటి కథ ?

సుశీ : ఎంత నంగనాచివమ్మా. ఏం తెలియనట్లు మాట్లాడతావు.

మాల: నిజంగా నాకేం తెలియదు. చెప్పరాదూ ఆ రహస్యమేమిటో.

సుశీ : నీ వెంత దాచిపెడితే మాత్రం తెలియకుండా వుంటుందా ? ఇందాక మాష్టరుగారు చెప్పలా.

మాల: (విసుగ్గా) ఏమిటి ?

సుశీ : ఏమిటి అలా తొందరపడతావు, కొద్ది రోజుల్లో గృహస్తురాలివి కాబోతూ. పది పదిహేనురోజుల్లో లగ్నం ఉందటగా ?

మాల: (ముఖం చిట్లించి) ఆ ఉంది. భలే లగ్నం. పెళ్ళికూతురు లేకుండా పెళ్ళి జరిగే లగ్నం.

సుశీ : అదేమిటి మాలతీ! (ఆశ్చర్యంగా) పెళ్ళికూతురు లేకపోతే పెళ్ళి చేసుకునే దెవరిని ?

మాల : ఎవరినా ? పురోహితుణ్ణి (నవ్వుతారు.)

రామ : అయితే సూడాల్సిన పెళ్ళే.

సుశీ : (వ్రేలు చూపెడుతూ) ఊం హూం! జ్ఞాపకముంచుకో. రేపు అప్పగింతలనాడు చెపుతా నీపని.

మాల : ఇంకా రేపుచెప్పేదేమిటి. ఆ అప్పగింతలన్నీ ఇదివరకే అయిపోయాయి.

రామ : (విస్తుపోతూ) అయితే మూడుముళ్లూ పడ్డయ్యాయేం ?

మాల : ఆ ... ఆ ... తెగిపోయినై కూడా.

సుశీ : (విస్మయంగా) మాలతీ ? ఏమిటిది ? నాకేం అర్థం కావటంలా.

మాల : నాకూ అర్థం కావటంలా. పెళ్ళికూతురు లేకుండా పెళ్ళి ఎలా జరుగుతుందో !

సుశీ : అయితే నీకీ సంబంధం ఇష్టంలేదా ?

మాల : లేదు.

రామ : నా నోట్లో కరక్కాయేనా !

మాల : ఏం ?

రామ : ఏంటేముంది. పప్పన్నం పోయిందిగా.

మాల : నేను పెట్టకపోతే ఏం ? మీ అబ్బాయిని పెట్టమనరాదూ !

రామ : ఇన్నాళ్లు ఆశపెట్టి నీవింత చేశావు. నీకంటె తక్కువ తిన్నాడా మా అబ్బాయి. రేపు ఆయ నేం చేత్తాడో !

సుశీ : నివు చాల తొందరపడుతున్నావు మాలతీ !

మాల : ఏమి టక్కా ! నీవుకూడ అలా మాట్లాడుతావు. మా ఇద్దరి మనసులే వేరయినప్పుడు, పెళ్లి ఎలా జరుగుతుంది ?

సుశీ : అవును. అన్నీ కుదిరితే బాగానే ఉంటుంది. కాని ఏం చేస్తాం. ధనం ఉంటే గుణం ఉండదు. గుణం ఉంటే రూపం ఉండదు. ఇవన్నీ ఉంటే కులం వేరవుతుంది.

మాల : పవిత్ర ప్రేమను బంధించేవి ఈ కులగోత్రాలా ?

రామ : అయితే పెళ్ళికి కులం, గోత్రం, మంచీ, చెడ్డా ఏమీ అక్కర లేదంటావ్.

[ప్రసాద్ ప్రవేశం]

ప్రసా : మంచీ చెడ్డా, ఎందుకు అక్కరలేదు తాతా ! మంచి ఏకులంలో ఉన్నా మంచే.

రామ : ఏమో బాబు ! ఈ కాలమే సిత్రంగా ఉంది. ఎన కెప్పుడైనా ఉండయ్యా యిట్టాంటియి.

ప్రసా : ఏం తాతా ! చిన్నప్పుడు నన్నెత్తుకొని వెన్నెల్లో అరుంధతీ నక్షత్రాన్ని జూపి కథజెప్పేవాడివి జ్ఞాపకం ఉందా ?

రామ : అదా బాబూ ! వసిట్టుడు అరంజోతమ్మను పెళ్ళి జేసుకున్నాడనా ! ఆరంటే మానుబావులు. ఏది చేసినా సెల్లింది. మనం జేత్తే పులినిజూసి నక్క వాత బెట్టుకున్నట్లే.

సుశీ : నిజమే తాతా ! వాళ్ళేది చేసినా చెల్లింది. మనబోటివాళ్ళు ఆపని జేస్తే సంఘం ఇంకా బతకనిస్తుందా ?

మాలతి : మనలోకూడా ఆ పవిత్రప్రేమ, ఆ పట్టుదల ఉండాలి గాని సంఘం ఏంచేస్తుంది. (సుశీలవైపు జూచి) మొన్న ఈ మధ్య మనం చండీదాసు ఫిలిం చూడలా అక్కా!

సుశీ : ఆc.

మాల : ఆ చాకలి అమ్మాయి, ఆ బ్రాహ్మణ చండీదాసుల ప్రేమ, హృదయాల్ని కదిలించి వేయలా? నీవుకూడా కంట నీరు పెడితివే. ఆ ప్రేమ ప్రవాహాన్ని ఏ సంఘం అరికట్టగలిగింది?

ప్రసా : ఆ మహాకవి చండీదాసు కీర్తికి ఏమన్నా కళంకం వచ్చిందా చాకలి అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడని?

సుశీ : అవును. ఇప్పటికీ ఆకథ కళ్ళకు కట్టినట్టు కనబడుతోంది. కాని ... ...

మాల : కాని... ....

సుశీ : కాని ఈ రోజుల్లోకూడా అలాంటి పెద్దలెవరైనా దారితీస్తే...

ప్రసా : మహాత్మా గాంధీ, రాజగోపాలచారికంటే పెద్దలెవరు పిన్నీ! వాళ్ళిద్దరూ వియ్యంకు లవలా?

సుశీ : (చిరునవ్వుతో) మీరు చెప్పేది బాగానే ఉంది గాని ఈ కులాల ఎక్కువతక్కువలతో చచ్చిపోతున్నాం. చూడు, ఇప్పుడు నేనూ, మాలతీ సయాం అక్కా చెల్లెళ్ళులాగా ఉంటున్నామా, చివరికి ఈ అమ్మాయి నాచేతి అన్నం తిన్నా ఈ దిక్కుమాలిన సంఘం ఊరుకోదాయె.

ప్రసా : సంఘం ఏర్పడింది ప్రజల అభివృద్ధికోసం గాని, పాడుచేయ టానికి కాదు.

మాల : అలా పాడుచేసే సంఘంతో సంబంధం ఉంచుకోనేదానికన్నా, తెంచుకోవడమే మంచిది.

రామ : సరే, ఇంకేం. అక్కయ్య అన్నం పెడుతుంది తిను.

మాల : అక్కయ్య చేతి అన్నం తినడానికేం? ఆప్యాయంగా తింటాను. అక్కా! పద, వడ్డించు.

సుశీ : (ప్రసాదును చూచి) రా, నాయనా ! నీవు కూడా రా !

ప్రసా : వస్తున్నా.

రామ : ఏమోలే అమ్మా ! మళ్లీ పంతులుగారు ఏమంటారో ?

మాల : ఏమైనా అనుకోనీ. మన మేమీ బానిసలంగాదు, ఒకళ్ళం టారని భయపడటానికి. పద అక్కా ! పద.

సుశీ : (మాలతి వైపు చూచి) ఈ పాడు కట్టుబాళ్లే లేకపోతే ....

రామ : అక్కవెందుకవుతావు ? అత్తవే అయ్యేదానివిగా.

[అందరూ లోపలికి వెళ్తారు.]

(తెర)

# 6

## మూర్తి ఇల్లు

[సిగరెట్లు కాలుస్తూ భుజంగరావు, శేషగిరిరావులు మాట్లాడుతూ ఉంటారు.]

శేష : అందాకా వచ్చిందీ వ్యవహారం!

భుజం : ఆ రోగ్ ముందు నేను గుడ్డిగవ్వ చేయనట.

శేష : ఏముంది. లవ్ ఈజ్ బ్లైండ్. కాకపోతే ఇంట్లోవున్న రత్నాన్ని వదులుకుని, గాజుపెంకుకోసం పరుగులెత్తడం ఏమిటిరా?

భుజం : ఇంట్లో ఉన్నానుగనుకనే, ఈ చిక్కు వచ్చింది.

శేష : అవునులే. అందుకే పెరటిచెట్టు మందుకు రాదన్నారు. నీ డిగ్రీ, నీ క్వాలిఫికేషన్, నీ పర్సనాలిటీ – నీ ముందు బలాదూరుకు పనికివస్తాడురా ఆ గబ్బిలాయి. ఏం అదిరిపడి చస్తున్నాడురా ఇంటరులో క్లాసు వచ్చిందని.

భుజం : వాడి అదిరిపాటెంత, వాడెంత? అది అలా ఉంచు. అసలు దీని కళ్ళు పొరలు వేసినాయి ఎందుకా అని!

శేష : అయితే ప్రమాదమే. వెంటనే ఆపరేట్ చేయి. చేతిలో పనేగా.

భుజం : చేయక అప్పుడే వదలిపెట్టాను దీని అంతు, వాడి అంతు కనుక్కోకుండా. టీపార్టీలు పోయి, డిన్నర్ పార్టీలదాకా వచ్చిందిగదా. కానీయి, ఇక చూస్తాను.

శేష : (ఆశ్చర్యంగా) ఏమిటి? డిన్నర్ పార్టీ! ఎక్కడ? ప్రసాదుగాడింటి దగ్గరేనా?

భుజం : కాక ఇంకెక్కడ.

శేష : నీకు ఎలా తెలిసిందిరా ?

భుజం : తెలియకపోవడ మేమిటిరా. ఉందిగా మనకు వైర్‌లైన్.

శేష : ఓ... అదా ! దట్ బ్యూటిఫుల్ యంగ్ విడో ! లవ్‌చేసినా అలా ఉండాలి.

భుజం : లవ్ గాదు మట్టి. మనం పాచికవేస్తే పనీ మనీ రెండూ కలిసి రావాలి.

(మురహరి, గోపాలరావుల ప్రవేశం)

మురః : ఏమిటిరా ? చెవులు కొరుక్కుంటున్నారు, ఏకాంతంగా కూర్చొని.

గోపా : ఏకాంత మంచిదా అని.

శేష : వారకాంత !

మురః దేహశుద్ధి జరగకుండా దివ్యమైనమార్గం ఆలోచించావురా అనుభవశాలివి.

గోపా : వాడికేం తెలుసురా వాడి మొఖం. వారకాంతకంటె జార కాంత నూరురెట్లు మెరుగు. కాదురా డాక్టర్ !

శేష : ఓయస్. నష్టంలేని బిజినెస్.

భుజం : ఏడ్చారులేవోయ్, ఏమి టీ హస్కు.

మురః : (పేపరు చూస్తూ) అరేయ్ భలేవార్త. రష్యన్సు మళ్ళీ వార్సా పట్టుకున్నార్రా.

శేష : ఇంతకీ రష్యాకి దైవబలం తోడయింది. లేకపోతే, ఆ హిట్లరు, గోరింగు, గోబెల్సు ఓడిపోవడమేమిటిరా ?

మురః : రష్యన్ కమాండర్సు మాత్రంసామాన్యులటరా; వొరోషిలోవ్, కొనివ్, ఝుకోవ్ ఎంత గొప్ప హీరోస్ జెయింట్సు.

శేష : వీళ్లేమిటిరా, వీళ్ళందర్నీ తలదన్నినవాడు లేడటరా ఖార్ట్లోవ్ (అందరూ నవ్వుతారు.)

మురః (నవ్వుతూ) ఓరి నీరాజకీయాలు తగలడ. ఎప్పుడన్నా పేపరు చదివి చస్తేనా. ఖార్షోవ్ మనిషిపేరు కాదురా ఇడియట్, అదొక పట్టణం పేరురా.

గోపాః తెలియనివాడివి నామాదిరిగా తెలియనట్టు పడి ఉండక, పోయి ఆ రొంపిలో పడ్డావెందుకురా ?

భుజంః అసలు పోలిటిక్సే మీనింగ్ లెస్. వాటిజోలికి పోవడమే బుద్ధితక్కువ. పనిలేని ప్లీడర్సుకు, లీడర్సుకుగాని, మన కెందుకురా పాడుపోలిటిక్సు.

గోపాః వీడికీ కొద్దిగా ఆ ప్రసాదుగాడి గాలిసోకింది, ఏరా మురహరీ ! నీవుకూడా ఒక లీడరువౌతావాయేం కొంపదీసి ?

శేషః ఏమి టీ హస్కు ! ఆ వాంటెడ్ కాలమ్సు చూడరా ఏమన్నా అపర్ట్యూనిటీ దొరుకుతుందేమో.

గోపాః నీబొంద, నీకూ నాకూ అపర్ట్యూనిటీ ఏమిటిరా, మిలిటరీలో రిక్రూట్ అయ్యేదానికి.

భుజంః ఎదుగూ బొదుగూలేని గొర్రెతోక ఉద్యోగాల్లో ఏముందిరా సంపాదన. చూడరా కాటన్ మార్కెట్టులో ఏమన్నా ఛాన్సు తగులుతుందేమో.

గోపాః ఈ ఛాన్సుకోసమే ఇప్పటికి నా జీవితంలో ముప్ఫై అరుసార్లు లాటరీ, వేశాను ఒక్కసారిఅన్నా ఛాన్సు దొరకదాఅని.

మురః ఇంతకంటె ఒక్కసారి కన్నంవేయకపోయావ్, ఎక్కడన్నా నమ్మకంగా దొరికేది.

గోపాః ఏం ? వాడి కాటన్‌మార్కెట్టుకంటే తీసిపోయిందా నా లాటరీ ? (అందరూ నవ్వుతుంటారు. మూర్తి ప్రవేశం)

శేష, ముర, గోపా } నమస్కారమండీ, మాష్టరుగారూ !

మూర్తిః (కూర్చుంటూ) కూర్చోండోయ్, కూర్చోండి.

(భుజంగరావు, తక్కినముగ్గుర్నీ బయటికి వెళ్లమని సైగచేస్తాడు.)

శేష : టైమయింది. క్లబ్బుకెళతాం. (ముగ్గురూ వెళ్తారు).

మూర్తి : ఏరా, ఇవ్వాళ భోజనంకూడా చేయలేదట్టే ?

భుజం : ఆఁ... ఏం భోజనమో.

మూర్తి : అలా అంటున్నావేం ? ఆరోగ్యం బాగుండలేదా ?

భుజం : ఏం చెప్పమంటారు. పెద్దలు, మీ పనేమిటో, మీరేమిటో !

మూర్తి : ఏమిటిరా అది ?

భుజం : మీరు కష్టపడి చదువు చెప్పించారు. దాని ఫలితం చివరి కిలా పరిణమించింది. మాలతి మీ పేరు నిలబెడుతుందనుకున్నాను.

మూర్తి : ఏం జరిగిందిరా, నీకింత కష్టం కలగడానికి ?

భుజం : స్వతహాగా మంచిదే అనుకోండి, కాని సహవాసదోషం వూరికే పోతుందా ?

మూర్తి : ఎప్పుడూ పొరుగిళ్ళకు కూడ పోదే, ఒక్క ఆ సుశీల ఇంటికి తప్ప. ఆమె చాలా యోగ్యురాలు.

భుజం : అక్కడే ఉన్నాడుగా.

మూర్తి : ఎవరు ? (కొంచెం ఆలోచించి) ప్రసాదా ? వాడు అలాంటి వాడు గాదే.

భుజం : ఏం, మీకు వంగివంగి సలాములు పెడుతున్నాడనా ? (పండ్లు బిగించి) గోముఖవ్యాఘ్రం.

మూర్తి : అర్థం లేకుండా మాట్లాడకు. వాడి సంగతి నీ కంటె నాకు బాగా తెలుసు.

భుజం : మీరు దబాయించి నా నోరు మూయగలరు గాని, లోకం నోరు మూస్తారా ? కాస్త ప్రజల్లోకి వెళ్ళండి. ఎంత రణగొణ ధ్వనిగా ఉందో.

మూర్తి : ఏముంది, నీ మొహం.

భుజం : ఏముంది. వాళ్ళతో కలిసి సరదాగా సినిమాలకు వెళ్లడం...

మూర్తి : (నవ్వుతూ) ఓరి పిచ్చిసన్యాసీ ! అదా నీ అనుమానం ? నన్నడిగే వెళ్ళింది 'సుశీల రమ్మంటూంది నాన్నా !' అని.

భుజం: ఓహో! అలాగా! వాళ్ళింట్లో భోంచేయడం కూడా మిమ్మల్ని అడిగే చేసింది కాబోలు.

మూర్తి: (ఆశ్చర్యంగా) ఏమిటి! వాళ్ళింట్లో భోజనం చేయడమే! నీ కెలా తెలిసింది?

భుజం: తెలియకుండా ఉంటుందా. నిన్న పార్వతికి జబ్బుచేస్తే వెళ్ళాను. అక్కడ తెలిసింది.

మూర్తి: ఇంతవర కొచ్చిందీ శ్రుతిమించి.

భుజం: ఇంతవకు మించలేదు. ఇప్పుడే మొదలు. ఇక మించుతుంది. ఇవ్వాళ సహపంక్తి భోజనాలు, రేపు సరిగంగస్నానాలు.

మూర్తి: ఆఁ ఏమిటీ!

భుజం: అవును. వాళ్లు మేరేజ్ చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. సందేహం ఉంటే మీ అమ్మాయి నోటిద్వారానే వినండి.

మూర్తి: (కోపంగా) ఉహుఁ... ఎంతపని!

భుజం: ఏమనుకున్నారు మరి ప్రసాదుగాడి ఇంద్రజాలం. ఈ మీటింగులు, ఈ ఉపన్యాసాలు వీటి ఫలితం వృధాగా పోతుందా?

మూర్తి: (తలపంకిస్తూ ఉంటాడు).

భుజం: పాపం మీబోటి పెద్దలకు ఈనాటి కుర్రాళ్ళ ఎత్తు లేం తెలుస్తాయి?

మూర్తి: ఏం తెలుస్తుంది, ఏ పుట్టలో ఏ పాముందో! ఇదివరకు ఆ వెధవంటే ఎంతమంచి ఇంప్రెషన్ ఉండేది.

భుజం: వాడి సంగతి మీరుతప్ప లోకమంతా ఎరుగుదురు. ఆపాపపు మాటలు నా నోటితో చెప్పగూడదుగాని, ఆ పినతల్లిని పెట్టుకొని వాడు ఆడే నాటకం ఇంతా అంతా!

మూర్తి: (కోపంగా) నీచుడు, ఎంత దుర్మార్గానికి ఒడిగట్టాడు.

భుజం: ఈ తంతు అంతా చూసినప్పటినుంచి నాకు అరికాలి మంట నెత్తికెక్కుతోంది. (విచారాన్ని నటిస్తూ) తల్లీ తండ్రీ లేని లోపం కనబడకుండా, చిన్నప్పటినుంచి నన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు, కష్టపడి చదువు చెప్పించారు. మీయందున్న గౌరవం

చేత, ఇంటికి రావడమే కాని, నిజంగా నాకు చెడ్డ అసహ్యం వేసిపోయింది మామయ్యా!

మూర్తి: (కోపాన్ని మింగుతూ) దానిదేముందిరా, ఇంకా చిన్నతనం. రేపటినుంచి చెవులుపిండి ఇంట్లో కూర్చోబెట్టనూ. చూస్తా, ఇంకెక్కడికి పోతుందో.

భుజం: చిన్నతనమనే మీతో చెప్పకుండా ఓపికపట్టాను. ఇప్పటికే మన పరువు ప్రతిష్ఠలు మట్టిపాలయ్యాయి. ఇంకా ఉపేక్షిస్తే తల ఎత్తుకునే ప్రాప్తం ఉందా?

మూర్తి: ఇంకానా? ఈ వారంలోనే మీ వివాహం చేసివేస్తా. ఆ ప్రసాదుగా దేగంగలో కలిస్తేమనకేం. పద. ముందు భోంచేయి. (భుజంగరావు వెళుతూ ఉంటాడు.)

[ రంగయ్యగారు ప్రవేశిస్తూ ]

రంగ: ఏమిటి? మామా అల్లుడూ చర్చిస్తున్నారు?

మూర్తి: ఓ, రంగయ్యగారా! దయచేయండి. (అంటూ లేచి కుర్చీ చూపెడతాడు.)

ఆఁ ఏముంది. మొన్న మీతో చెప్పితినే, అదే విషయం...

రంగ: (కూర్చుంటూ) ఓహో! అదా, అమ్మాయి పెండ్లి విషయం. ఎప్పుడు?

మూర్తి: ఈ అమావాస్య వెళ్ళగానే మంచి లగ్నాలున్నాయి. వెంటనే చేసివేస్తాను. మనవాడికికూడా చాలా మంచి సంబంధాలు వస్తున్నాయిగా—మీరుకూడా...

రంగ: నేనూ అదే ఆలోచిస్తున్నాను.

మూర్తి: మొన్నవచ్చిన తెనాలిసంబంధం చాలా మంచిదే అనుకుంటాను.

రంగ: మీకుకూడా అదే నచ్చినట్టుందే!

మూర్తి: నచ్చకేం? దివ్యమైన సంబంధం. కట్నంకూడా మనవాడికి తగినట్టే ఇస్తామన్నారు. అందులో వాళ్ళూ తొందర పడుతున్నారు. శుభస్య శీఘ్రం.

రంగ : సరే ఆలోచిద్దాం. (లేస్తూ) క్లబ్బుకు వెడదాం రారూ ?

(భుజంగరావు చేతులు తుడుచుకుంటూ ప్రవేశం.)

మూర్తి : ఏమిటి విశేషం ఇవాళ క్లబ్బులో ?
రంగ : నాటకం ఉందిగా సారంగధర.
భుజం : అఁ, ఏమి సారంగధరో.
రంగ : ఏం, బాగుండదా ?
భుజం : బాగూ ఓగులకేం లెండి.
మూర్తి : (కొంచెం కోపంగా) ఏమిటీ గొడవ ?
రంగ : (భుజంగంతో) ఏమిటి అలా అఁటున్నారు ?
భుజం : ఏముంది, ఇంటింటా సారంగధర నాటకాలే. (అంటూ వెళ్ళి పోతాడు.)
రంగ : ఏమిటి మీవాడు అనేది ?
మూర్తి : ఏదో పోనివ్వండి. లోకులు కాకులు. అనేకం అనుకుంటారు.
రంగ : ఏమనుకుంటున్నారు ?
మూర్తి : ఏదో నోటికొచ్చినట్లల్లా. అదిగో పులి అంటే ఇదిగో తోక అంటారు.
రంగ : నాతో చెప్పడానికికూడా సందేహిస్తున్నారా ?
మూర్తి : అబ్బే, మనలో మనకు దాపరికం ఏముంది? కీడెంచి మేలెంచ మన్నారు. ఏది ఎలాగున్నా ప్రసాదు పెళ్ళి త్వరగా చేయడం మంచిది.

(రంగయ్య ఏదో ఆలోచిస్తూ చెప్పులు తొడుక్కుంటూ ఉంటాడు.)

మూర్తి : ఇంకా టైం ఉందిగా. వెళదాం కూర్చోండి.
రంగ : కొంచెం పని ఉంది. వస్తాను. (అంటూ బయలుదేరతాడు-మూర్తికూడా లేచి రెండడుగులు వేస్తాడు.)

[ తెర ]

# 7

## రంగయ్యగారి మేడ

[పార్వతి పడకకుర్చీలో కూర్చొని ఆపసోపాలు పడుతూ ఉంటుంది. లోపల పనిచేస్తూఉన్న సుశీలను ఉద్దేశించి బిగ్గరగా మాట్లాడుతుంది.]

పార్వ : దిక్కారిపోయిందికొంపలో. మంచినీళ్లన్నా ఇచ్చే గతిలేదు. ఇక కాఫీ ఏం తెస్తుంది ? (లేచి కూర్చొని తల చేత్తో పట్టుకొని) అబ్బ ! తల పగిలిపోతూ ఉంది. ఈ బాధపడేకంటే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటే మేలు.

(సుశీల కాఫీ తీసికొస్తూ ఈ మాటలు విని కలిగిన భయవిచారాల్ని బయటికి కనబడకుండా కప్పిపుచ్చి)

సుశీ : కాఫీ తీసుకో అమ్మాయి !

పార్వ : తెచ్చావులే రెండు జాములకి.

సుశీ : (కాఫీ తిరగబోస్తూ) ఇప్పుడేగా నీవు చెప్పింది కాఫీ కాయమని? కాచి తెస్తూనే ఉంటిని.

పార్వ : (సుశీలవైపు తీక్షణంగా చూస్తూ) ఇంకా కాసేపు ఊరుకోక పోయావ్ ? మీ పీడా నా పీడా వదలిపొయ్యేది. (తల పట్టుకొని) ఇష్, అబ్బ ! నాయనా ! (సుశీల కాఫీ ఇస్తుంది. అందుకొని ఒక గుక్క తాగి) నీ కాఫీ తగలడ. పానకం తయారు చేసుకొచ్చింది. ఏం ? కాస్త మిరియాల పొడికూడా వేయక పోయావా సరిపోయేది ?

సుశీ : పొద్దున కాఫీ ఇస్తే కటికవిషమంటివి. సరేలెమ్మని ఇంకాస్త పంచదారేస్తే పానకమంటివి.

పార్వ : ఆహాహా! పట్టుకొచ్చారురా నాయనా! భద్రాచలం కొండల్లో. ఏనాడైనా తాగేడ్చిన మొఖం అయితేగా.

సుశీ : ఎంత లేనివాళ్లమైనా ఈమాత్రం కాఫీకి మొఖం వాచి చావలా అక్కడ.

[ప్రసాదు ప్రవేశం]

పార్వ : (ప్రసాదును చూడకుండానే) అహ్హాహా! కనబడతానే ఉందిగా! నీవు తెచ్చిన కప్పుల్లోనే మేము తాగేది. కట్టుకొచ్చావుగా బండమీద గదులు పట్టుకుండా.

ప్రసా : బయలుదేరావులే పెద్ద ఆస్తిపరురాలివి ఈనాటికి, దేశాన్నంతా నీవే పోషిస్తున్నావు- హ్హు. ఇరవైనాలుగు గంటలు ఇంటిలో ఏదో ఒకగోల ఉండాలి.

పార్వ : నే నేమన్నా మీకు గోలగానే కనపడుతుంది. మెత్తగా అంటించి ఊరుకునే పత్తిత్తులెవరికీ కనపడరు. నోట్లో నాలుకుందా ? అంటేపడుతూందిపాపం.

ప్రసా : రోజూ జబ్బులని ఆపసోపాలు పడుతూ కూర్చుంటే చాకిరీ చేసేది చాలక, పైగా నీ నోటికొచ్చినట్టల్లా వాగుతుంటే, పడటానికి దాసీ దనుకున్నావా ?

పార్వ : దాసీ దెందుకౌతుంది. దొరసానై పెత్తనం చేస్తూవుంటే.

ప్రసా : అదేగా నీ యేడుపు. మళ్ళీ నీ పెత్తనమే మండించు.

పార్వ : నా బొంద. ఇంకా నే నేమి మండిస్తాను. మీరు మండిస్తున్నారుగా.

ప్రసా : పిచ్చి పిచ్చిగా వాగకు. ఎందు కలా గద్దరితనం వెళ్ళబోసుకుంటావు ?

సుశీ : ఊరుకో అబ్బాయి. లేనిపోని తగాదా. నీ పని నీవు చూసుకో. వెళ్లు నాయనా!

పార్వ : అబ్బ! మహా ఇల్లాలు బయలుదేరింది సర్దటానికి. ఇన్నాళ్ళు చదువుచెప్పి ఎంత బాగా తయారుచేశాడే నిన్ను! (సుశీల విచారంగా లోపలికి వెళ్ళిపోతూ ఉంటుంది.)

ప్రసా: నోరుమూస్తావా? అలాగే వాగుతావా? ఇతరు లేమను కుంటారో అని ఎగ్గూ సిగ్గూ లేకపోతే సరి.

పార్వ: ఎగ్గూ సిగ్గూ మీ ఇద్దరికీ వుండాలి. (అని చర చరా లోనికి పోతుంది.)

(సుశీల ఉలిక్కిపడి చూసి వెళ్ళిపోతుంది)

[రంగయ్య, రామన్నల ప్రవేశం. ప్రసాద్ వెళ్ళబోతూ ఉంటాడు.]

రంగ : ఎక్కడికిరా? కూర్చో. (ప్రసాద్ కూర్చుంటాడు) రామన్నా! అబ్బాయికి మంచి సంబంధాలు వస్తున్నాయి. ఏమిటి మరి? చేసేద్దామా?

రామ: (సంతోషంగా) ముసలిముండాకొడుకుని, బాబుపెళ్ళి కళ్లతో జూసి సద్దామనుంది. ఏ ఊరినుంచి బాబూ?

రంగ : ఒక ఊరేమిటి! చాలచోట్లనుంచి వస్తున్నాయి. కాని అన్నిట్లో తెనాలి సంబంధం చాల బాగుంది.

రామ: కట్నం మన దర్జాకు తగినట్టుండాలి బాబు!

రంగ : కట్నానికేం? ముప్ఫైవేలు యిస్తామన్నారు. పిల్ల కూడా మంచిదేనట. ఇంగ్లీషు చదువుకొంటూ వుంది.

ప్రసా: ఇప్పుడేమంత తొందరొచ్చిందిలే నాన్నా!

రంగ : కలిసొచ్చినప్పుడు చేసుకోవడం మంచిది. యెప్పుడయినా ఉందేగా? ఏం రామన్నా?

రామ: నిజమే బాబూ!

ప్రసా: చదువు పూర్తిగానిదే నే చేసుకోదలచుకోలా.

రంగ : చదువుకంతేమిట్రా? అయినా మనం కావాలన్నప్పుడు మళ్ళీ ఈలాంటి సంబంధం, ఇంత కట్నం ఇచ్చేవాళ్ళు దొరకొద్దూ?

ప్రసా: డబ్బే ప్రధానమా?

రంగ : (కొంచెం తీవ్రంగా) కష్టపడి సంపాదించేవాళ్లుంటే కూచుని కబుర్లు చెప్పడానికేం?

రామ: (ప్రసాదుతో)ఎందుకీరద్దీ? నాయనగారు చెప్పినట్లు వినుబాబు!

రంగ : వినకపోతే అడుక్కుతింటూ పోతాడు. అన్నీ సెటిల్ అయినాయి. ఎల్లుండి లగ్నపత్రికొస్తుంది.

ప్రసా: ఏమైనా గానివ్వండి. నే నా సంబంధం మాత్రం చేసుకోను. (వెళ్ళబోతూంటాడు.)

రామ: (అడ్డంవెళ్ళి) ఉండు బాబు, ఉండు. తొందరపడబాక.

ప్రసా: తొందరగాదు తాతా! ఈ విషయం నేను ఇదివరకే నిర్ణయం జేసుకున్నాను.

రంగ : ఏమిటీ ? ఇదివరకే నిర్ణయించుకున్నావా ?

ప్రసా: ఊఁ!

రంగ : ఎవరిని ?

ప్రసా : మాలతిని. (రామన్న ప్లీడరువంక జూస్తూ వుంటాడు)

రంగ : (కోపంగా) ఎవరు ? ఆ బడిపంతులు కూతురా ? రాస్కెల్ ! తల ఏమైనా తిరుగుతోందా ?

ప్రసా: నా పెళ్ళివిషయంలోకూడ నాకామాత్రం స్వాతంత్ర్యం లేదా?

[సుశీల ప్రవేశించి చూస్తూ వుంటుంది.]

రంగ : నోరుముయ్. స్వతంత్రమట! స్వతంత్రం! నీతి జాతిలేకుండా అడ్డమైన గడ్డి కరవడమా స్వతంత్రం ?

ప్రసా : ఎందు కనవసరంగా ఆ మాటలన్నీ?

రంగ : అప్పుడే నన్ను ఎదిరించే వాడివయ్యావ్. వెధవ! ఉంటేచెప్పి నట్లు పడిఉండు, లేదా నడువు నా ఇంట్లోనుంచి, నీతాతముల్లె ఏమీా లేదిక్కడ.

రామ : బాబూ! బాబూ! అంతమాటే ?

సుశీ : ఎందుకండీ అంత బలవంత పెట్టడం ?

రంగ : నోరుముయ్.

రామ : మనకున్నది చాల్దా బాబూ! ఎవరుతినను, కట్నంకోసం బిడ్డను ఎళ్ళగొట్టుకుంటారా ?

రంగ : నా పరువు కాస్తా పోయినతర్వాత వీడుంటే ఏం? చస్తేఏం ? (ప్రసాదువైపు చూచి) పో. నా కంట్లెదుటనుంచి, స్టుపిడ్. (ప్రసాదు రెండడుగులు వేస్తాడు.)

సుశీ : నాయనా ప్రసాద్! ప్రసాద్! (అంటూ ప్రసాదువైపు రాబోతుంది.)

రంగ : ఛీ! ఛడవా. చావు ఇంట్లోకి. (చేయిబట్టి రంగయ్య సుశీలను వెనక్కి నెడతాడు. సుశీల పడిపోతుంది.)

రామ : బాబూ! బాబూ! (అంటూ గబగబా పోయి తిరిగివస్తాడు. సుశీల నెమ్మదిగా లేచి లోపలి కెళ్ళిపోతుంది.)

రామ : బాబూ! బాబూ! నా మాటినండి. పెద్దాణ్ణి. అబ్బాయి దసలే పెంవ్లాదమతం. మీరు పిలవందే రాడు. బంగారంవంటి ఆ ఒక్క బిడ్డ చెయిజారిపోతన్నాడు.

రంగ : ఛీ! వాడి పేరు నాదగ్గర తలవకు. నా కొడుకు ఎప్పుడో చచ్చాడు.

రామ : ఆ మాతల్లి తులిశమ్మగారు సచ్చి యే లోకానుందో ఆ తల్లి పోయేటప్పుడు అబ్బాయిని పిల్చి మీ ఒళ్లో కూచోబెట్టి కళ్లంట నీళ్లెట్టుకుంది. మీ రేమన్నారప్పుడు? "నా ప్రాణంకంటె ఎక్కువగా చూసుకుంటా" ననలా? మరిసిపోయారా? మీరు మరిసిపోయినా నేను మరిసిపోలేను. (రంగయ్య కుర్చీలో చతికిలబడి వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంటాడు) బాబూ! లే. ఈ కోపంలో ఏమైపోతాడో బిడ్డ! కుర్రతనం. తరవాత ఇశారపడి సేసేదేముంది? రండి బాబూ! రండి. (అని చేయిబట్టుకొని లేవదీస్తాడు)

రంగ : (రెండడుగులువేసి అయిష్టంగా తల ఊపుతూ) రామన్నా! (అంటూ తిరిగివచ్చి కుర్చీలో కూలబడతాడు)

రామ : సిన్నప్పటినుంచి బుజాలు కాయలుకాసేటట్టు మోసి, కుడిసెయ్యి, ఎడమసెయ్యి, అనే బేదంలేకుండా పెంచుకున్నా. "తాతా! బిడ్డనెట్టా పెంచుతావో" అంది ఆ మాతల్లి. కన్నతండ్రివి మీరు గుండె రాయి జేసుకున్నా, పెంచిన నేను చేసుకోలేను. నా బిడ్డను సూడకుండా ఉండలేను. పోతాను.

రంగ : (నిశ్చేష్టుడై, దుఃఖంతో లేచి) రామన్నా! రామన్నా! (అని పిలుస్తూ ఏడుస్తూ ఉంటాడు)

[తెర]

# 8

## పార్కు

[రేడియోలో పాట వినబడుతూ ఉంటుంది. ప్రసాద్ విచారంగా ప్రవేశం.]

లేరా ముందుకు పోపోరా
ఘోరారణ్యము దాటవలెను నీ
వీరత్వము జూపుమురా॥ లేరా॥

కష్టసముద్రము నీది జాతిని
కాపాడుటె నీ పనిరా॥ లేరా॥

మారువేషమున క్రూరమృగంబులు
దారి కడ్డమున్నవిరా – ఆ
క్రూరమృగంబుల కడతేర్చుచు ఈ
కారడవిని దాటుమురా లేరా॥

(ప్రసాద్ కూర్చుంటాడు. మధు, రహీంలు ప్రవేశం)

మధు : (అటూ ఇటూ చూచి) రహీం ఇదుగోరా ప్రసాద్! (ప్రసాద్ దగ్గిరకు వస్తారు)

రహీం : ఎంత ఘోరం చేశాడురా మీ నాన్న!

(మధు, రహీంలు కూర్చుంటారు)

మధు : ఏముందిరా, ఓల్డ్ ఏజ్ లో ఉన్న మతికూడా పోతుంది. (ప్రసాదును చూచి) ఎక్కడ తిరిగావురా? పొద్దుటినుంచి ఊరంతా గాలించినా కనపడలేదు.

ప్రసా : (విచారంగా) ఎక్కడో తిరిగాను.

రహీం : పాపం మీ రామన్న ఏం తిరుగుతున్నాడురా నీకోసం. మా ఇంటికి నాలుగుసార్లు వచ్చాడట్రా ఇవ్వాళ.

మధు : నీ వంతే ఎంత ప్రేమరా మీ నౌకరుకి ?

ప్రసా : నౌకరు కాదు మధూ ! మా అమ్మ పోయిన నాటినుంచి ఆ లోపం కనబడకుండా కంటికి రెప్పలా కాపాడాడు.

రహీం : ఇదంతా ఆ భుజంగంగాడి ప్లాను. యమ్. బి. బి. యస్. ఏడ్చాడనేగాని వాడు వట్టి బ్రూట్.

మధు : అసలు ముసలాడికికూడా డబ్బు పిచ్చి ఎక్కువైంది లేరా.

రహీం : కాదురా భాయి ! అయనపుర్రెకు పుట్టిన బుద్ధి కాదురా ఇది.

ప్రసా : ఏమిటి రహీం ?

రహీం : ఏముంది. ఆ గాడిదలు నోటికొచ్చినట్లల్లా వాగేస్తున్నారు.

మధు : ఏమని ?

రహీం : ఈ బటాచోరు ముఠా అంతా క్లబ్బుకు చేరతారుగా. అక్కడకూడా వెధవ శ్కాండల్స్.

మధు : అడుగోరా ప్రసాద్ ! మీ రామన్న.

[ పసాదు తలయెత్తి రామన్నవంక చూస్తాడు. దుఃఖం పొర్లి వస్తుంది.]

రామ : బాబూ ! బాబూ ! (అంటూ ప్రసాదుని కౌగిలించుకొని ఏడుస్తాడు.)

ప్రసా : ఊరుకో తాతా !

రహీం : అప్పటినుంచి తిరుగుతూనేవున్నావా తాతా? ఇప్పుడే మాకు ఇక్కడ కనిపించాడు.

రామ : (ప్రసాదు ముఖం తుడుస్తూ) ఎక్క డెక్కడ తిరిగావ్ ఎండనుబడి ? సూడు, మొకం ఎట్టా కందిపోయిందో పోదాం, రా ! బాబూ !

ప్రసా : ఎక్కడికి ?

రామ : ఎక్కడికేంటి నాయనా ! యింటికి.

ప్రసా : ఇక నే నా గడప తొక్కదలచుకో లేదు.

రహీం : అదేమిట్రా ! అలా అంటావు ?

రామ : ఏదో అయింది; పోయింది. దానికి యింత పట్టుదల ఎందుకు బాబూ! నువ్వు గడప దాటినకాడనుంచి ఆయనా కుమిలి పోతానే వుండాడు. ఆయనకిమట్టుకి ఇంకెవరుండారు నువ్వు గాక. వచ్చినకోపం యెల్లకాలం ఉంటుందా? ఆయనకూడా తిరుగుతానే వుండాలి; కాలుకాలిన పిల్లెల్లె.

మధు : ముందు తొందరపడడం. తరువాత పశ్చాత్తాప పడడం. అడుసు తొక్కడం ఎందుకు? కాళ్లు కడుక్కోవడం ఎందుకు?

రహీం : అంత ఆలోచనే ఉంటే ఇందాకా ఎందుకు వస్తుంది. అరే ప్రసాద్! పాపం పెద్దవాడు, తాత బతిమాలుతున్నాడు, లేరా!

ప్రసా : నీకు తెలియదు రహీం! ఈ పరిస్థితుల్లో నే నక్కడికి వెళ్లడం ఎవరికీ క్షేమంగాదు.

మధు : అలాగయితే మాయింటి కెళదాం. ఏం మునిగిపోయింది.

రామ : పోనీలే! అక్కడన్నా ఉండుబాబూ, రొణ్ణాళ్ళపాటు.

ప్రసా : ఎక్కడా ఉండను.

రహీం : ఎక్కడా ఉండక ఎగిరిపోతావా ఆకాశానికి?

ప్రసా : ఏమో, నా కీ జీవితంమీదే విరక్తి పుట్టింది.

మధు : చాల్లే సంతోషించారు. ఏమి టా పిచ్చిమాటలు!

ప్రసా : నిజం మధూ! ఇలా జరుగుతుందని కల్లోకూడ అనుకోలేదు.

రామ : (ఏడుస్తూ, ప్రసాదు కన్నీరు తుడుస్తూ) నాలుగురోజులు ఓపికబట్టు నాయనా! ఇంత పాపానికి ఒడిగట్టిం దెవరో నాకు తెలుసు. నిదానంమీద నిజం అదే బయట పడద్ది.

రహీం : తెలిసినవాడివి నీవే ఇలా అంటే ఎలా భాయి!

మధు : ఏమిటిరా? ఇలాటి వెన్ని ఈ సమాజంలో నిత్యం మనం చూసేవి. ప్రతి పనిలో మాకు దారి జూపుతూవున్న సమర్థుడివి. ఇంత మాత్రానికే అధైర్యపడితే... ప్రసాద్! నీ సంగతి తెలిసినవాడు ఇది నిజమని నమ్ముతాడా? నీబోటి మంచివాణ్ణి చూస్తే అనేకమందికి అసూయ. ఏమీ చేయలేక ఈలాంటి అప వాదు లెన్నో వేస్తారు. ఇంతమాత్రానికే అధైర్యపడితే ఎలా?

కష్టాల్లోనే మనిషి గొప్పతనం బయట పడుతుంది. పుత్తడో, ఇత్తడో పుటంబెట్టినప్పుడే తేలేది.

ప్రసా: కష్టాలకు వెరచికాదు మధూ! లోకులనే సూటీ పోటీమాటలు శూలాల్లాగా గుచ్చుకుంటున్నాయి. మనసు మనసులో లేదు.

రామ: దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమనే ముచ్చు డబ్బె అనుకుంటారు.

మధు: (కొంచెం నవ్వి) మంచిమాట చెప్పావ్ తాతా! అలాంటి చెత్తాకాని రకం వాగే వాగుడికి విలువేమిటి?

ప్రసా: మీరెన్ని చెప్పినా నేను ఇక్కడ తలఎత్తుకు తిరగలేను.

రహీం: మమ్మల్నందర్నీ విడచిపెట్టి ఎక్కడికి పోతావ్!

మధు: ఎక్కడికో పోయి చేసేదేముంది?

ప్రసా: ఏదో ఒకటి.

మధు: అది ఇక్కడుండే చేయొచ్చుగా?

రహీం: అవును ఇక్కడుండే వాళ్ళను సాధించాలి.

ప్రసా: ఇక్కడ ఎక్కడ ఉండను?

మధు: ఇదీ ఒక పెద్దసమస్యేనా? రా వెళదాం, మా ఇంటికి. నాతో పాటు నీవూ.

ప్రసా: నిజమే అనుకో బ్రదర్! మనలో మనకు ఏ భేదం లేదు. కాని నీవుకూడా అస్వతంత్రుడవే. అయినా ఈ స్థితిలో నేను ఎవరింటికి రాదలచుకోలేదు మధూ! మరోవిధంగా అనుకోకు.

రహీం: దీనికో పెద్ద ఆలోచనెందుకు? రెండు రూపాయలు పారేసి ఒక రూం తీసుకుంటే సరి.

రామ: (ఆశతో) దానికేంటిలే బాబూ! పదో పరకో సేతిలో ఉండయి. దేవుడిచ్చిన కాలూసెయ్యీ సల్లగా ఉండాలిగాని ఎక్కడో పది డబ్బులు సంపాయించుకోలేకపోతామా. (అని ప్రసాదును ఎగాదిగా చూచి వెళుతూ వుంటాడు.)

రహీం: ఎక్కడికి తాతా?

రామ: ఇక్కడే ఉండండి నాయనా! ఇప్పుడే వత్తా. (వెళ్తాడు)

మధు : అయినా నీకేంరా ప్రసాద్! బాగా చదువుకున్న వాడివి? ఎక్కడ ట్యూషన్ చెప్పుకున్నా, పదిరూపాయలు సంపాయించుకోవచ్చు.

రహీం: కాకపోతే మేమంతా చచ్చామా ఏమిటిరా! నీవు ముందు నుంచొని కాస్త దారిచూపుతూ ఉండాలి గాని, వాడెంత? వాడి బ్రతుకెంత? ఆ భుజంగంగాడి మురాని తలెత్తనిస్తామా!

మధు : మనవాడు తలుచుకుంటే మసి. ఏఁరా?

రహీం: ఓ యస్. ఢంకామీద దెబ్బకొట్టి ఆ బ్లడీరోగ్సును గుంటకు గుక్కెడు నీళ్లు తాగించనురా? చూడు నా తడాఖా.

[పళ్లు తీసుకొని రామన్న ప్రవేశం]

ప్రసా: ఇదేమిటి తాతా! ఇందుకా నీవు వెళ్ళింది.

రామ: (పండ్లన్నీ సిమెంటు బెంచీమీద పెట్టి అరటికాయ ఒల్చి ప్రసాదుచేతి కందిస్తూ) తీసుకో బాబు!

రహీం: (ఆశ్చర్యంగా ప్రసాదువైపు చూచి) అరే భాయి! గొడవలో బడి మరచిపోయాం. అసలు తిండి తిన్నావా?

రామ: తిండి తింటే అట్టా ఉండకేం. ఇంటిదగ్గరే పిల్చి పెట్టాలి. నాకు తెలవదూ!

ప్రసా: (మధు, రహీంలకు చెరి ఒక కాయనిస్తూ) తీసుకోండిరా, చూస్తారేం?

రహీం: పొట్టనిండా మెక్కివచ్చినవాళ్ళకి మా కేం తొందర్రా. ముందు నీవు తిందూ.

ప్రసా: (రామన్న కొక కాయనిస్తూ) తీసుకో తాతా!

రామ: నా తిండి కేంటిలే బాబూ! నువ్వు తిను.

ప్రసా: నే నెరగనా తాతా! నీవు తిన్నదీ లేందీ, తీసుకో తాతా!

రామ: (తీసుకుంటూ) నా కో పూట వుంటేం, లేకపోతేం బాబూ! ఇట్టాంటి రోజులెన్ని గడిసినియ్యో... ...

[అందరూ తింటూ వుంటారు.]

# 9

## మూర్తి ఇల్లు

(హుషారుగా డాక్టరు భుజంగరావు కూనిరాగాలు తీస్తూవుంటాడు. శేషగిరి, గోపాలరావుల ప్రవేశం.)

శేష : ఏరా బ్రదర్ ! వ్యవహారం జోరుగా ఉంది.

గోపా. జోరేమిటిరా, జోరున్నర. చూడరా ఎలా ముస్తాబయ్యాడో.

శేష : ఔనురా కొత్త పెళ్ళికొడుకు కాదూ. ఏరా బ్రదర్, ఎప్పుడు ?

భుజం : ఆగండిరా తొందరపడతారేం ? ట్రెయిన్ ఇప్పుడేగా లైన్ మీదికి వచ్చింది.

గోపా : అయితే ఇంకా ఆలస్యం ఎందుకు సిగ్నలివ్వక ?

శేష : నీదిరా బుర్ర అంటే. ఏం మేజిక్ చేశావురా.

గోపా : మేజిక్ ఏమిటిరా దెబ్బకి ప్లీడరు ఎగిరి బోల్తాకొట్టాడు. ఇస్తే అలాంటి డోసే యివ్వాలి.

భుజం : ఔను. మనం ప్లానువేస్తే అంతే. ఇమీడియెట్ ఎఫెక్ట్.

గోపా : ఏమయ్యాడురా. ఆ మంకీబ్రాండ్ ప్రసాద్ ?

భుజం : ఏమయ్యాడా, శంకరగిరిమాన్యాలు పట్టాడు.

శేష : డాక్టరంటె నీవురా కీలెరిగి వాతబెట్టావు, భలే ముద్రపడింది.

గోపా : చచ్చినా పోదురా, వాడికి ఆ మచ్చ ?

ముర : (ప్రవేశిస్తూ) ఎవరికిరా మచ్చ ?

గోపా : యోగీశ్వరులు ఇప్పుడే సమాధినుంచి లేచివచ్చారు.

శేష : నీ కెందుకురా ఈ కబుర్లు ఫిలాసఫీ స్టూడెంటుకి ? ఇదంతా మాయాప్రపంచం.

గోపా : ఓరి నీబతుకు తగలెయ్య. నీవుకూడా వంక బెట్టబోయావురా ? నీ ఖార్కోవ్ రాజకీయాలమీద పెట్టలేదురా వాడి ఫిలాసఫీ ?

[అందరూ నవ్వుతారు]

మురః : మళ్లీ ఆ రొంపిలో ఎందుకు దిగుతారుగాని, విషయ మేమిటో చెప్పి చావండిరా. ఎవడికి మచ్చ.

గోపా : ఎవడికా ? వాడే. లేడూ మన రసికశిఖామణి.

మురః : ఛా. అర్థం లేకుండా వాగకు. మహా చూచి వచ్చినట్టు.

శేష : ఇంకా చూసేదేమిటి. ముంజేతి కంకణానికి కూడా అద్దం కావాలా ? స్పష్టంగా కన్పడుతూంటే.

భుజం : ఏమీ లేందే ఎందు కెళ్లగొట్టారురా ఇంట్లోనుంచి వాళ్లనాన్న ? ఇక ప్రతిదీ చూడాలా ఏంటి ? పొగ ఉంటే అగ్ని ఉన్నట్టే.

మురః : ఒక్కొకసారి పొగమంచును జూచి కూడా పొగ అను కుంటాం. ఇదంతా వట్టి మిథ్యా ప్రచారం. నేను మాత్రం నమ్మను.

శేష : వేదాంతికి అంతా మిథ్యే. నీవూ మిథ్యే. నేనూ మిథ్యే. అస లీ ప్రపంచమే మిథ్య (మురహరి తప్ప అందరూ నవ్వుతారు)

మురః : మీరెన్ని అనుకుంటే ఏముందిరా. అగ్నికి చెదలంటుతుందా ?

భుజం : అగ్ని కాబట్టే తండ్రి కొంప తగలెట్టాడు.

గోపా : ఇవ్వాళ తండ్రికొంప తగలెట్టాడు. రేపు నీ కొంప తగలె డ్తాడు. ఎల్లుండి నా కొంప, ఏంరా డాక్టర్ !

మురః : అనవసరం మీతో వాదన. ఎందుకీ వెధవ సోది వెళ్తాను. (లేస్తాడు.)

గోపా : అప్పుడే వెళ్తావేంరా ఒక ఆటయినా ఆడకుండా ? (డాక్టరు వైపుజూచి) వేయరా పేక.

భుజం : ఛా. ఇప్పుడొద్దు. మామయ్య వచ్చే వేళయింది.

మురః ఏమిటిరా మన వీరాధివీరుడికి మామయ్యపేరు చెబితే ఇంత హడలు ?

గోపాః ఏముందిరా మరి. ప్రాక్టీసా, పాడా? మూర్తిగారి మనవ ర్తి డారేగా !

భుజంః ఏడ్చారు లేవోయి.

శేషః (మురహరితో) వెళ్లరా మహాత్మా! నీతో చావొచ్చింది. (మురహరి వెళుతూ ఉంటాడు. మూర్తి ఎదురౌతాడు.)

మూర్తిః వెళ్తున్నావేమోయ్ మురహరి ! వెళ్ళొచ్చులే రా.

శేష } నమస్కారమండీ మాష్టరుగారూ !
గోపా } (అంటూ అంతా నుంచుంటారు)

మూర్తిః (కూర్చుంటూ) కూర్చోండి. ఏమయ్యాడురా ప్రసాదు ? ఎక్కడా కనపడలేదట.

శేషః ఎక్కడికి పోయాడో తలదాచుకోడానికి.

మురః ఎక్కడికీ పోలేదు మా పేటలోనే ఒకయిల్లు అద్దెకు తీసుకున్నాడు.

భుజంః ఈ రోజుల్లో వాడికి ఎవడిచ్చి చచ్చాడురా ఇల్లు ?

మురః అదేరా. ఆ జనార్దనరావుగారిది. పాడుబడ్డ యిల్లు. గోరీల దొడ్డి ప్రక్కన లేదురా ?

శేషః ఏదీ ? ఆ దయ్యాలకొంపా ?

గోపాః అయితే ఇక దయ్యాలతో,భూతాలతో కుస్తీపడతాడన్నమాట.

మురః నీ దయ్యాలు, భూతాలు వాణ్ణేం చేస్తాయిరా.

భుజంః అవునులే. దయ్యానికీ, దైవానికీ భయపడేవాడైతే ఇంతపని ఎలా చేస్తాడు ?

మూర్తిః ఏం జేయాలని వాడి ఉద్దేశం, ఇల్లు అద్దెకు తీసుకొని?

శేషః ఏం చేస్తాడు. ఎక్కడన్నా గుమస్తాగిరి మిడుకుతాడేమో.

మురః కాదు ట్యూషన్స్ కోసం ట్రై చేస్తున్నాడు. నన్నుకూడా చూడమన్నాడు. ఎక్కడన్నా కుదురుతయ్యేమో.

భుజంః ఎవడురా వాణ్ణి కొంపకు జేరనిచ్చేది ?

గోపా : ఏ రకానికి ఆ రకమే ఉంటుంది, ఇసుక తక్కెడ గాడికి పేడ తక్కెడగాడు దొరికినట్లు.

భుజం : టైమయింది. వెళ్తాను డిస్పెన్సరీకి. (బయలుదేరతాడు) (మూర్తి తప్ప మిగతా ముగ్గురూ అతనితోపాటు లేస్తారు).

శేష : వస్తామండీ మాష్టరుగారూ!

(అంతా వెళతారు)

మూర్తి : మాలతీ! అమ్మాయి! మాలతీ!

మాల : (లోపలనుంచి 'ఆ' అంటూ ప్రవేశిస్తుంది)

మూర్తి : ఏమమ్మా! ఏం చేస్తున్నావు లోపల?

మాల : ఏమీలేదు నాన్నగారూ! ఏవో చదువుకుంటూ ఉన్నా.

మూర్తి : నిన్నటి నుంచి మహా పట్టుదలగా చదువుతున్నావు ఏమిటమ్మా అది?

మాల : వీరేశలింగంగారి రాజశేఖరచరిత్ర. అయిపోవచ్చింది.

మూర్తి : (తన అసమ్మతిని కప్పిపుచ్చి లాలనగా) అహర్నిశలూ ఒకటే చదువటమ్మా. రాత్రి పన్నెండయ్యేదాకా చదువుతూనే ఉంటివి. చూడు కళ్ళు ఎలా ఎర్రబడ్డాయో. మధ్యాహ్నపూటైనా కాస్త విశ్రాంతి తీసుకోరాదూ?

మాల : పుస్తకం చాల బాగుంది నాన్నగారూ! పూర్తి అయ్యేవరకు విడిచిపెట్ట బుద్ధిగాలా.

మూర్తి : (జాలిగా) అవును. నీకు చిన్నప్పటినుంచి చదువంటే అంత ప్రేమ? అందిస్తే అల్లుకు పోయేదానివి. నాకూ పూర్తిగా చెప్పించాలనే ఉంది. ఏంచేస్తాను. ఇంతకూ దైవానుగ్రహం లేదు. నీ చదువు సాగే యోగమేఉంటే ఈ వయసుకే ఇంటి భారం నీమీద పడుతుందా?

మాల : ఇందులో పెద్దగా నేను మోస్తూఉన్న భారం ఏముంది నాన్నగారు? కష్టపడి మీరు సంపాయిస్తూ ఉంటే వేళకింత వండి పెట్టడమేగా? ఇదేనా పెద్దపని?

మూర్తి : ఏం చేయనమ్మా, వాణ్ణి చదివించేటప్పటికే తల ప్రాణం

తోకకు వచ్చింది. ఇంట్లో ఒక పనిమనిషిని పెడదామన్నా చేతగాలేదు. గత్యంతరంలేక చివరికి నీ చదువుకూడ ఆపు చేయాలిసొచ్చింది.

మాల : ఇంతవరకు చదివించారంటేనే ఎంతో సంతోషం. పట్టుదల ఉంటే దీనిమీద ఎంతైనా అభివృద్ధి చేసుకోవచ్చు.

మూర్తి : అవునమ్మా, నీవు తప్పకుండా అభివృద్ధి చేసుకుంటావు. నా కష్టం వృధాగా పోనివ్వవని నే నెరుగుదును. దేవుడు మేలు చేస్తే కావలసినంత అవకాశం, మెద్రాసులో నీకు చదువు కోడానికి.

మాల : (ముఖం చిట్లించుకొని) మెద్రాస్ ఏమిటి ?

మూర్తి : సెలవు అయిపోగానే వాడు వెళతాడుగా ఉద్యోగానికి.

మాల : ఏమిటి మీ ఉద్దేశం ? నా కర్థం కావడంలా.

మూర్తి : ఆ ఏముంది. రేపు సప్తమీగురువారము మంచి ముహూర్తం ఉంది. అదే నిర్ణయించాను.

మాల : (కోపంగా) మీబోటి పండితులు కూడా ఇంత నిరంకుశంగా ప్రవర్తిస్తారనుకోలేదు.

మూర్తి : ఏమిటా నిరంకుశం ?

మాల : కాకపోతే ఇదేమన్నా బొమ్మల పెళ్ళా ?

మూర్తి : బయలుదేరావులే ఈనాటికి, మహా తెలివిగల దానివి.

మాల : తెలివి ఉందో లేదో, నాకు మాత్రం ఈ పెళ్ళి ఇష్టంలేదు.

మూర్తి : (కోపాన్ని అణచుకొని) మాలతీ! ఏమిటామాటలు ? ఇందులో కొత్తేముంది ? చిన్నప్పటినుంచి అనుకునేదేగా ?

మాల : చిన్నప్పుడే మీ రనుకున్నారని, ఇప్పుడు మేం పెళ్ళిచేసు కోవాలన్నమాట. అంతేనా ?

మూర్తి : (లేని నవ్వును తెచ్చిపెట్టుకొని) ఊఁ. చిన్నతనం, ఏముంది లోకానుభవం! కాస్త ఆలోచించమ్మా. మనకున్న తాహతు మాత్రం ఎంత, ఇంతకంటే మంచి సంబంధం తేవడానికి ? కాకపోయినా వాడికేం అమ్మా! యం. బి. బి. యస్. కూడా పాసయ్యాడు.

మాల : ఇంత డిగ్రీ ఉంటే సరి. హృదయం ఉండొద్దూ ?

మూర్తి : (దువ్వుతూ) అవును. 'అతిపరిచయా దవజ్ఞా' అన్నారు. అంతేకాని వాడికి హృదయం లేకపోవడం ఏమిటి ? మేనత్త కొడుకు దగ్గరున్న స్వతంత్రం పరాయివాడి దగ్గరుంటుందా ? పైగా మేనరికం ఉండగా ఇతరుల కివ్వరాదని శాస్త్రాలు ఘోషిస్తూ ఉండె.

మాల : మేనరికం పనికిరాదని సైన్సు చెబుతూవుంది. బి. యన్ రావు, బిల్లుకూడా ప్రవేశపెట్టాడు.

మూర్తి : మాలతీ ! ఏమిటీ మంకుతనం ? రాతలకు చేతలకు, పర్వతానికి పరమాణువుకు వున్నంత భేదం ఉంది. అనుభవజ్ఞుణ్ణి. అనేక దక్కామొక్కీలు తిన్నాను. చదువుకున్నదానివి, ఎందుకు చెబుతున్నానో కాస్త ఆలోచించు.

మాల : నాకు ఏకోశానా ఇష్టంలేందే ఏం ఆలోచించను నాన్నగారూ!

మూర్తి : అదికాదమ్మా ! నేనింతగా శ్రమపడేదెవరికోసం ! నాకు కూతురువైనా నీవే; కొడుకువైనా నీవే. చిన్నప్పటినుంచీ మీ ఇద్దరిని చెరొక కన్ను అనుకున్నాను. మీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. తీరా ఇవాళ కాదంటే నేపడ్డ శ్రమంతా బుండిదలో పోసిన పన్నీరేగా. అందరూ మీ ఇద్దరిని భార్యాభర్తలేఅనుకుంటున్నారు. ఇంతవరకెన్నడూ నీవు నామాట కాదనలేదు. ఆ ధైర్యంతోనే పెద్దత్తయ్యకూడా ముందేరమ్మని ఉత్తరంరాశాను. నలుగురిలో నగుబాట్లుపని అవుతుంది అమ్మా!

మాల : నిజమే, నాకోసం మీరెన్నో కష్టాలుపడ్డారు. మీ ఋణం తీర్చుకోడానికి, నా జీవితమంతా సేవచేయమన్నా చేస్తాను. కాని ఈ పెళ్ళి మాత్రం చేసుకోను. క్షమించండి.

మూర్తి : (కోపంతో) ఎందుకని ?

మాల : అతని తత్వంవేరు. నా తత్వంవేరు. మా ఇద్దరి మనస్సులు కలవడం అసంభవం.

మూర్తి : పోనీ కలిసే వా డెవడో చెప్పు. అదీ చూస్తాను.

మాల : (కొంచెం తలవంచి మెల్లగా) ప్రసాద్.
మూర్తి: (కళ్ళురుముతూ) వాడా ? ఆ నీచుడు ? నీ కేమన్నా మతి పోయిందా ?
మాల : నా కేం మతిపోలా.
మూర్తి: ఛీ ! పశువా, నోరుముయ్. వాడి కులమేమిటి, నీ కుల మేమిటి ? మనిషై పుట్టిన తరువాత జ్ఞానం ఉండాలి.
మాల : గుణంకంటే కులం ప్రధానమా ?
మూర్తి: ఆహా ! ఏమి ధర్మపన్నాలు. ఇంకేం ? కొత్తగా ఇంకో శాస్త్రం తయారు చేయి.
మాల : నేను తయారుచేసే దేముంది ? చిన్నప్పుడు మీరు చెప్పిన రుక్మిణి కల్యాణంలోనే ఉంది.
మూర్తి: నీ బ్రతుక్కి తోడు ఆ మహాతల్లి రుక్మిణితో వంతు బెట్టు కుంటున్నావా ? వాళ్ళు దేవతలూ. నీ దొక తుచ్ఛ నరజన్మ.
మాల : దేవతలు చేసే పనే మనుష్యులు చేస్తే తప్పా ?
మూర్తి: నీ పిచ్చి పిచ్చి కళలు కట్టిపెట్టు. ఆ ప్రసాదుగాడి ముఖం చూసినా పంచమహా పాతకం.
మాల : (వ్యంగ్యంగా) అవును. పైకి శ్రీరంగనీతులు చెబుతూ దొడ్డి దారిని ఎంత అవినీతికి పాల్పడ్డా మహాపుణ్యమే. కాని పర స్పరం ప్రేమించుకున్న స్త్రీ పురుషులిద్దరూ పెళ్ళి చేసుకోవడం మీ దృష్టిలో మహాపాతకం.
మూర్తి: చాలు. కాళ్ళుగట్టి గంగలోనన్నా పారేస్తాగాని, నిన్ను ఆ నీచుడికిచ్చి పెళ్ళిచేయడం మాత్రం అసంభవం. నోరుమూసు కొని ఇంట్లోపడివుండు. గడపదాటితే మర్యాద దక్కదు. జాగ్రత్త.
మాల : ఇష్టంలేని పెళ్ళిచేయడంకూడా అసంభవమే. (కోపంగా వెళ్ళిపోతుంది).
మూర్తి: (బిగ్గరగా) మాలతీ !

[ తెర ]

# 10

## రంగయ్యగారి మేడ

[కుర్చీలు, డ్రాయర్లు ఉంటాయి. పార్వతి కుర్చీలో కూర్చొని బత్తాయికాయ ఒల్చుకుంటూ పాడుతూ ఉంటుంది.]

ఎందుకంతరము సంఘ నియమముల
ఎందుకు ఈ స్వార్థం
ఎందుకు ఈ మోసం ॥ఎందు॥

అందలమెక్కే వాడొకడైతే
పందల బోయీలుంటారు
దనుజుడు మనుజుని చంపి తినును – ఈ
మనుజుడు మనుజునె తింటాడా ! ॥ఎందు॥

జీవచ్ఛవము కలంకరించి స
జీవిని బూడిద జేసెదవా
నీతిగాదు అన్యాయంబిది నీ
జాతికి ద్రోహము గాదా ! ॥ఎందు॥

అరువదేండ్ల వృద్ధుడు విలాసియై
హాయిగ జగతిని బ్రతకాలా
పదహారేడుల బాలిక లేడ్చుచు
ప్రాణాలను విడవాలా ? ॥ఎందు॥

[డాక్టరు భుజంగరావు ప్రవేశం]

పార్వ: (చిరునవ్వుతో) రండి ! (కుర్చీలోనుంచి లేస్తుంది).
భుజం: మీ నాన్నగారు ఇంకా కోర్టునుంచి రాలేదా ?

పార్వ : ఉహుఁ! ఇంకా రాలేదు. వచ్చే వేళయింది. కూర్చోండి. (భుజంగరావు కుర్చీలో కూర్చుంటాడు. పార్వతి తన చేతి లోని బత్తాయి ఒలిచి డ్రాయరుమీద పెడుతుంది.)

భుజం: ఎందుకులెండి. మీరు తినండి. సుస్తీగా ఉందిగా!

పార్వ : నా సుస్తీ కేమొచ్చిందిలెండి. మీరున్నారుగా మందివ్వటానికి.

భుజం: (తొనలు తింటూ) అప్పటినుంచీ ప్రసాదు ఇంటికి రాలేదా? ఎక్కడికి వెళ్ళి ఉంటాడు? ఏమైనా జాడ తెలిసిందా?

పార్వ : ఏమయ్యాడో ఇంతవరకూ అంతూ పంతూలేదు. (విచారంగా) వెళుతూ, వెళుతూ ఇంటికీ నాకూ ఋణం తీరిందన్నాడు.

భుజం : రాక ఎక్కడికి పోతాడులెండి. వాడేవాస్తాడు, కాస్త కోపం చల్లారిన తరువాత.

పార్వ : ఏం వస్తాడో. మా నాన్నగారుకూడా సగం అయిపోయారు బెంగ పెట్టుకొని.

భుజం : మీరు మాత్రం? (చిరునవ్వుతో) మీరుకూడా బెంగబెట్టుకు కూర్చుంటే ఎలా?

పార్వ : నేను ఏమైతే ఏం లెండి. మీ సౌఖ్యం మీరు చూసుకుంటు న్నారుగా.

భుజం : మీరు సౌఖ్యంగాఉంటేనే నాకూ సౌఖ్యం. లేకపోతే ఏముంది?

పార్వ : మాటలకే మొచ్చెలెండి.

భుజం : ఏమిటలా మాట్లాడుతున్నారు?

పార్వ : ఏమీ తెలియనట్టు మాట్లాడుతున్నారే? కొద్దిరోజుల్లో మీ పెళ్ళటగా?

భుజం : (నవ్వి) మీకు తెలియకుండా నా పెళ్లి ఎలా జరుగుతుంది?

పార్వ : నాకేం చెపుతారులెండి. ఎంతదాస్తే మాత్రం తెలియకుండా ఉంటుందా? ఇక మద్రాసులో కాపురం పెడతారు కాబోలు, మీరూ, మాలతి.

భుజం : ఛీ! ఆ దౌర్భాగ్యురాలితోనా, కాపురం!

పార్వ : అయితే అసలు పెళ్ళే చేసుకోరా ఏంటి ?
భుజం : చేసుకునేదీ నిజమే, మద్రాసులో కాపురం పెట్టేదీ నిజమే.
పార్వ : ఎవరితో ?
భుజం : నా హృదయేశ్వరితో. చిన్నప్పుడు పెట్టిన భుజంగభూషణుడు అనే పేరు సార్ధకం చేసుకుంటాను.
పార్వ : అంటే ?
భుజం : ఏముంది భుజంగభూషణుడంటే శివుడు. శివునిభార్య ఎవరు ?
(పార్వతి తలవంచు కుంటుంది. ఇద్దరూ నవ్వుతారు. ఇంతలో రంగయ్యగారు, రామన్నల ప్రవేశం. భుజంగరావు రంగయ్యగారిని చూచి విస్తుబోయి వెంటనే తెప్పరిల్లి)
భుజం : ఇచ్చిన మందు పుచ్చుకోకపోతే డాక్టరేం చేస్తాడు ? సరే, వెళ్ళి వస్తా. (అంటూ పక్కకు తిరుగుతాడు)
రంగ : ఏమిటి ?
భుజం : నిన్న మందిచ్చి వెళ్ళాను. వారు అది వాడనే లేదట.
పార్వ : మందు తాగు పిన్నీ అంటే నాకేం జబ్బులేదంటుంది. మరి రోగం ఎట్లా నయమవుతుందో !
(రంగయ్యగారు కోటు, తలగుడ్డతీసి రామన్నకిచ్చి పంపుతాడు )
భుజం : (రంగయ్యగారితో) మందు ఇష్టంలేకపోతే రేపు ఇంజెక్షన్ వాడి చూద్దాంలెండి. వస్తాను. అర్జెంటుకేసుంది. (వెళ్లును.)

(రామన్న తుండుతో ప్రవేశం)

పార్వ : రోజురోజుకీ పాలిపోతూ వుంది. ఇచ్చిన మందు ఇచ్చినట్లే ఉండె. ఎంతచెప్పినా వినదాయె. తెల్లారి ఇంతవరకు భోజనమన్నా చేయలా.
(రంగయ్య కుర్చీలో కూర్చుంటూ ఉంటాడు. సుశీల కాఫీ తెచ్చి డ్రాయరుమీద పెడుతుంది.)
రామ : (జాలిగా) ఏం అమ్మా ! ఇంతవరదాకా అన్నం తినలా ?
సుశీ : ఆకలిగా లేదు తాతా !

రంగ : (కాఫీ తాగుతూ) ఇచ్చిన మందు పుచ్చుకోకుండా ఉండు. ఆకలేస్తుంది. ఆరోగ్యం బాగుపడుతుంది. ఏం ?
(పార్వతి గబగబా లోపలికి వెళుతుంది.)

రామ : అసలే నీరసంగా ఉండావు. రెండు మెతుకులు ఎంగిలిపడక పోతే ఎట్టా అమ్మా !

పార్వ : (తిరిగి ప్రవేశించి పొట్లాలు టేబుల్ మీద పెడుతూ)నిన్ననగా ఇచ్చారు ఇంతవరకు ఒక్క పొట్లం కూడా విప్పిన పాపాన పోలేదాయె. వచ్చిన జబ్బు మాటలతో పోతుందా, మందువాడ కుండా ?

సుశీ : ఇవాళ కొంచెం బద్ధకంగా ఉండి భోంచేయలా. నా కేం జబ్బుంది అమ్మాయి !

రంగ : జబ్బు ఉంది లేందీ మనిషిని చూస్తే కనపడటల్లా- ఏమిటీ పిచ్చి ?

రామ : అన్నం సయించకపోతే రెండు పళ్ళన్నా తినాలి గాని...

రంగ : ఆహారమూ మాని ఔషధమూ మాని ఎలా జీవించాలని ? వైద్య సౌకర్యంలేక చచ్చేవాళ్ళు చస్తున్నారు ఉన్నవాళ్ళకు ఈ తెగులు. కావలసిన మందులు తెచ్చేవాణ్ణే గాని ప్రాణం పోయగలనా? ఏం చేస్తాను. ఎవళ్ల ఖర్మ వాళ్లది.

రామ : (నిస్పృహగా) ఆఁ. ఏం మందు తీసుకున్నా, ఈయన మంది య్యటం, నయం కావటం ...
[పార్వతి రామన్నవైపు తీవ్రంగా చూస్తూ ఉంటుంది]

రంగ : పోనీ ఆమాట చెప్పగూడదా. అతనే గురువా, డబ్బు పారేసే టప్పుడు ? ఈ డాక్టరు కాకపోతే మరో డాక్టరు.

పార్వ : అసలు మందే తాగంది ఇంకో డాక్టరొచ్చిమాత్రం ఏం చేస్తాడు ?

రామ : పలానాయన మందిచ్చాడు, నయమయిందన్నాడు, నాకొక్కడూ కనపడలా. ఎప్పుడు చూసినా ఆ యానుప త్తిరి కట్టేసే ఉంటదీ. ఏం వైద్దిం చేత్తాడో ఏంటో.

రంగ : పోనీ, డాక్టరు రామారావును పిలుద్దాం.

రామ : ఆఁ! ఆయన సాలా మంచాడు. అస్తవాసికూడా మంచిది.

పార్వ : [అసంతృప్తిని తెలియచేస్తూ] సరే. పిలవండి. మంత్రం పెట్టి నయం చేస్తాడేమో మందివ్వకుండా.

రంగ : [లేస్తూ] చాల్లే. నిన్నేం సలహా అడగలేదు. (రంగయ్య బైటికి వెళుతూ ఉంటాడు. అతని వెనుక రామన్నకూడా వెళతాడు. సుశీల డ్రాయరుమీద కప్పులు తీస్తూ ఉంటుంది.)

పార్వ : (సుశీలవంక కొరకొర జూస్తూ) ఏం నూరిపోసిందో, ఎప్పుడు పల్లెత్తుమాట అనని తండ్రి నానామాటలంటున్నాడు. తమ్ముణ్ణి దేశమ్మకాకిని చేశావు. చాల్లా? ఇక నన్నుకూడా కొంపలో నుంచి వెళ్ళగొడితేనేగాని కళ్లు చల్లబడవు—

(సుశీల గుడ్లప్పగించి చూస్తూ ఉంటుంది. పార్వతి చురచుర చూస్తూ వెళ్ళిపోతుంది. సుశీల ప్రక్కనున్న కుర్చీలో చతికిల బడి, డ్రాయరుమీద చేతులుమోపి, తలవంచి వెక్కి వెక్కి ఏడుస్తుంది తరువాత నెమ్మదిగా తలఎత్తి, కొంచెం ఆలోచించి, గది నాల్గువైపులా పరికించి చూచి, కాగితం, కలం తీసుకొని రాస్తూ మధ్యమధ్య కన్నీళ్ళు తుడుచుకుంటూ ఉంటుంది. అడుగుల చప్పుడు విని రాసే రాసే కాగితం తొందర తొందరగా మడత పెడుతుంది. ఇంతలో మాలతి వస్తుంది. సుశీల లేచి కాగితము గుప్పెట్లో బిగించి చేయి వెనక బెట్టుకుంటుంది.)

మాల : ఏమిటి అక్కా రాస్తున్నావు?

సుశీ : (కంగారుగా) ఏముంది? ఏంలేదు, ఏంలేదు.

మాల : అంత రహస్యమా! నాకుకూడా చెప్పవా?

సుశీ : (గద్గద కంఠంతో) ఏముంది మాలతీ? చెప్పడానికి. (సుశీల కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి.)

మాల : (సుశీల ముఖాన్ని తేరిపారజూచి జాలిగా) ఏం జరిగింది అక్కా! చెప్పవూ? (అంటూ సుశీల కళ్ళ నీళ్ళు తుడువ

బోతుంది. సుశీల రెండడుగులు వెనక్కు వేస్తుంది. మాలతి ఆమె చేతిలోవున్న ఉత్తరం లాక్కుంటుంది. సుశీల తిరిగి లాక్కోబోతుంది. మాలతి ఇవ్వదు. సుశీల కుర్చీలో కూలబడి ఏడుస్తూ వుంటుంది. మాలతి ఉత్తరం చదివి, సుశీల కూర్చున్న కుర్చీ చేతిమీదే కూర్చొని సుశీల తలను పైకెత్తి కళ్లుతుడుస్తూ) అక్కా! (సుశీల మాలతిని కౌగిలించుకొని వెక్కి వెక్కి ఏడుస్తుంది. మాలతికూడా కళ్ల వెంట నీరుపెడుతూ) ఊరుకో అక్కా! ఎందుకింత సాహసం?

సుశీ : ఈ బతుకు బతికేదానికంటే చావే మేలు.

మాల: కష్టాలు ఎప్పుడూ కాపురముంటాయా? అపనింద పోగొట్టుకో డానికి ఆత్మహత్యయేనా మార్గం?

సుశీ : అదిగాదు మాలతీ! నా మూలంగానే ఈ కొంప కిన్ని తిప్పలు వచ్చాయి నేను బ్రతికుండగా ప్రసాదు ఈ ఇంటికి రాడు. నేను పోయిన తరువాతనయినా తండ్రీ కొడుకులు సుఖపడతా రేమో అని...

మాల: ఎంత పొరపాటుపడ్డావు అక్కా! ఈ సంగతి తెలిస్తే అతనెంత బాధపడతాడో కొంచెం ఆలోచించు.

సుశీ : ఎక్కడో చిన్నగది ఒకటి అద్దెకు తీసుకొని నానా బాధలు పడుతున్నాడట.

మాల: ఇకనుంచి ఆ బాధలన్నీ అతనొక్కడే భరించడులే.

సుశీ : ఏం? ఎందుకని?

మాల: నేనూ వెళ్తున్నాగా. ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉంటాం.

సుశీ : అదేమిటి మాలతీ!

మాల: నిర్బంధంలో వుంచి మనస్సును అరికట్ట గల్గురా? మా ఇంటి కిన్ని తులిసినీళ్లు ఒదిలాను. నేనూ ఇవ్వాళిటినుంచి ప్రసాదుతో పాటే.

సుశీ : చాలా కష్టాలు పడాల్సివస్తుంది. సరిగ్గా ఆలోచించు.

మాల: సరిగ్గానే ఆలోచించాను. వేరే గత్యంతరంలేదు. నీవు మాత్రం ధైర్యంగా వుండాలి. చివరకు మా ఇద్దరి మేలు కోరైనా నీవు బతకాలి.

సుశీ : అంతకన్నా నా కింకేం కావాలి మాలతీ! మీ యిద్దరూ సుఖంగావుంటే నాకు అంతే చాలు. చూచి ఆనందిస్తాను. (రామన్న రావడము చూచి) వారేరి తాతా ?

రామ: రామారావుగారింటి కెళ్ళారు.

మాల: ప్రసాదు ఎక్కడున్నాడు తాతా ? క్షేమంగా వున్నాడా ?

రామ: బ్రాగానే ఉండాడమ్మా! "పిన్నీ, మాలతీ బాగుండారా తాతా?" అని ఎప్పుడూ అడుగుతా వుంటాడు.

సుశీ : పాపం ఏం చేస్తాడు. నలుగురు పిల్లలికి చదువుచెప్పుకొని బ్రతుకుతున్నాడట. ఎన్ని ఇబ్బందులు వచ్చినాయి అబ్బాయికి.

రామ: అదిమట్టుకి ఎక్కడ సాగనిత్తాండరమ్మా (మాలతివైపు చూచి) కుదిరిన పిల్లల్నికూడా చెడగొడతండాడు మీ బావ.

మాల: ఎందుకు చెడగొట్టడు. పుర్రెలో పుట్టినబుద్ధి పుడకలతోనే పోయేది ప్రసాదు గది అద్దెకుతీసకున్నాడట ఎక్కడ తాతా?

రామ: అదేనమ్మా ఆ గోరీలదొడ్డి పక్కన.

మాల: నేనుకూడా వస్తాను తీసుకెళతావా ?

రామ: నువ్వెందుకమ్మా అక్కడికి ?

సుశీ : (ఆలోచిస్తూ) మాలతీ! లోకులు కాకులు.

మాల: అలాటి కాకులు అరిస్తేమాత్రం ఏం? న్యాయం అని నమ్మి నపుడు ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కోవలసిందే.

రామ: అమ్మా! పెద్ద ముండాకొడుకుని. నా మాట కాస్త ఇను.

మాల: ఏమిటి తాతా ?

రామ: పెద్దయ్యోరు సాలా మెత్తనాడమ్మా. ఆయన్ని బట్టిన పిచ్చి దెయ్యాలట్టు ఏడిపిత్తాండయి. నాలుగురోజులు తాలితే నిజం బయటపడద్ది.

సుశీ : బయటపడుతుంది ఎప్పుడో.

రామ : అయ్యో తల్లీ ! అట్టా అనుకోకు. ఇట్టా ఉండకాలం ఇట్టాగే ఉంటుందా ? సీకటిపోయి ఎన్నెల రాటల్లా ?

మాల : తప్పకుండా వస్తుంది.

రామ : అప్పుడు మీ ఇద్దరూ మారాజులల్లే పెళ్లి చేసుకోవచ్చు, నోరెత్తేవా డుండడు.

మాల : అందాకా చేతులు ముడుచుకు కూర్చోమంటావా ?

రామ : మనం ఒక లెక్కా ? నలమారాజు దమయంతమ్మని అడవిలో వదిలిపెట్టిపోతే కళ్ళల్లో జోతులేసుకుని కాలుగాలిన పిల్లెలె తిరిగింది. దొరికాడా ? ఆకరికి తండ్రికాడ తలదాసుకుంది. మంచిరోజు లొచ్చినయి. మల్లీ వచ్చి మారాజు తీసికెల్లాడు.

మాల : ఆమెకూడ తండ్రిగారి నౌకర్లతో వెదకించింది గాని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుందా ?

సుశీ : నిజమే మాలతీ ! మన ప్రయత్నం లేనిదే ఏదీ జరగదు. కాని అబ్బాయి కష్టసుఖాలు కూడా విచారించొద్దూ ? (మాలతి ఆలోచిస్తూ తల వంకిస్తుంది) చదువుకున్నదానివి నీకు నే చెప్ప నక్కరలేదనుకో ! అయినా...

మాల : అదేమి టక్కా ! నీకు నాకు భేదం ఏముంది ? సందేహిస్తా వెందుకు చెప్పు.

సుశీ : (విచారంతో) ఇదివరకే ఒక అపనిందతో కుంగిపోతున్నాడా ? పైపెచ్చు నీవు ఇల్లు బయలుదేరితే ఇదికూడా అబ్బాయినెత్తినే రుద్దుతారు.

రామ : నిజమేనమ్మా ! సీమదూరే సందుంటే వదిలిపెడతారా? తెల్లారి లెగిస్తే మన కళ్లెదుట ఎన్ని చూస్తున్నాం – ఇట్టాంటియి.

మాల : మా నాన్న బుద్ధిపూర్వకంగా ఒప్పుకుంటాడనా అక్కా, నీ భ్రమ ? కలలోకూడ అనుకోవద్దు.

సుశీ : ఏం ! ఎందుకు ఒప్పుకోగూడదు ?

రామ : ఆయన దేముందమ్మా ! పాపం, ఎనకటికాలం మనిషి. కన్న బిడ్డను కా దనుకుంటాడా ?

సుశీ : చేయవలసినదంతా చేసిచూద్దాం. అంతగా కాకపోతే అప్పుడే చూసుకోవచ్చు.

రామ : మాటల సందడిని మరిసిపోయా, పంతులుగారింటికాడ ఇయ్యాల ఉపాసమేనేమో ?

సుశీ : ఏం అమ్మా ! (మాలతి మాట్లాడదు) ముందు కాసిని కాఫీ తాగుదువుగాని పద ! (అని మాలతి చేయిపుచ్చుకొని) బజారు కెళ్ళి రెండు బత్తాయిలు పట్టుకురా తాతా ! (రామన్న రెండడుగు లేస్తాడు) తాతా ! రెండు కమలాలు కూడ తీసుకురా ! (వెళ్తాడు.)

[ తెర ]

# 11

## మూర్తి ఇల్లు

[భుజంగరావు ఆలోచిస్తూ కూర్చొని ఉంటాడు. శేషగిరి ప్రవేశం]

శేష : ఏమిత్రా, ఏదో కొత్తపాచిక వేస్తున్నట్టున్నావే ?
భుజం: ఏమీ లేదురా.
శేష : ఆట్టేచూస్తే నీకీ పెళ్ళిపిచ్చి వదలనట్టుందే ?
భుజం: (వ్యంగ్యంగా) అవును. ఈ మాత్రపు భూలోకరంభ దొరకదని.
శేష : మరి లేకపోతే ఎందుకురా ఈ తపస్సు ?
భుజం: (పళ్ళు బిగించి తల ఊపుతూ) ఎందుకా ? శత్రుసంహారానికి.
శేష : వాడెంత. వాడిబ్రతుకెంత ? మొదటిదెబ్బకే గుడ్లు తేలేశాడు. కాని ఎంత తెగించిందిరా మాలతి !
భుజం: (కోపంగా నిట్టూర్పు విడుస్తాడు) కాస్త మీ మామ 'ఊఁ' అనాలిగాని ఆడది చేసిచచ్చేదేంత్రా !
భుజం: నో యూస్. అదంతా ఇదివరకే అయిపోయింది.

[గోపాల్ ప్రవేశం]

గోపా: పోతే పోయింది. మంచి కథావస్తువు దొరికింది. నీవూ ఒక భగ్నజీవి రాయి.
శేష : రాయక అప్పుడే వదిలి పెడతామా ఏమిత్రా ?
గోపా: ఏమిత్రా మీరు రాసేది నేలకేసి. అవతల పుస్తకమే అచ్చవుతూంటే.
శేష : ఏదో కొత్తవార్త తెచ్చాడు మన ఇన్ఫర్మేషన్ బ్యూరో.
గోపా: "వర్ణాంతర వివాహం" అనే పుస్తకమోయ్. మన అపర వీరేశలింగం రాశాడు.

శేష : ఇక దేశమంతా మరిమ్మ త్తైనట్లే.

గోపా: ఆఁ వాడిమొఖం! వాడేంచేస్తాడు. మన డాక్టరు చేయాలిగాని. ఉందిగా డార్లింగ్. ఎక్కించరా బండి. తీర్థం స్వార్థం రెండూ కలిసొస్తాయి. అటు సంస్కారానికి సంస్కారం. ఇటు ప్రసాదు గాడికి శాస్తి. వర్ణాంతర... వితంతు... వివాహం. వాహ్! వాహ్!

శేష : ఆ నామర్దాపని మనాడు చేయకేం!

గోపా: (ఎగతాళిగా) ఆహా, గిరీశాన్ని చంపి పుట్టావురా.

భుజం: ఏడ్చావులే నోరుముయ్.

గోపా: అంతేలే. మనకు మిగిలిందదేగా మరి. (నవ్వుతాడు)

శేష : సరేగాని, ఆ బికాకి ఫకీరుగాడికి డబ్బెక్కడిదిరా పుస్తకం అచ్చు వేయించడానికి?

గోపా: మనలాంటి ఫ్రెండ్స్ వాడికి చాలామంది ఉన్నారు. చందా వేయిస్తున్నారు. అడుక్కుతినేవాడికి అరవైయారూళ్ళు.

శేష : అట్టేచూస్తే నీవుకూడా ఏదో ముడుపు చెల్లించినట్టుందే?

గోపా: ఆఁ మురహరితోపాటు నేనూ చెల్లించుకున్నాను, ఏదో మొగమోటానికి (శేషగిరి గోపాలు వైపు ఆశ్చర్యంగా చూస్తాడు. భుజంగరావు ఆలోచిస్తూ ఉంటాడు).

భుజం: పోవోయ్, నాకేం చెపుతావ్. ఇదంతా నాటకం.

శేష : కాకపోతే కాగితం కరువు రోజుల్లో చందాలతో పుస్తకం అచ్చు గాకేం?

భుజం: ఆ పినతల్లి ఉండగా వాడికేంటిరా! ఉన్నాడుగా వృద్ధ జంబుకం రామన్న చేరవేయడానికి.

గోపా: ఛా, ఛా, పాపం. ఆమె ఏం పంపుతుంది? చాలా సీరియస్‌గా ఉందట.

శేష : ఏం?

గోపా : టి. బి. అట. రామారావు వైద్యం చేస్తున్నాడు.

భుజం : (కోపంతో) ఉహ్హూఁ.

శేష : చివరికి వీడికి ఆ యల్. ఐ. యమ్మె దొరికాడూ? వీడికి స్లీడరు పట్టా ఇచ్చిందెవడురా?

భుజం : వాడికీ బుద్ధి వక్రమార్గాన పడుతోంది.

శేష : వాడట్లా చస్తే ఎవడికి కావాలిగాని కాసేపు పార్కు కెళదాం రండిరా. (శేషగిరితోపాటు గోపాలరావు కూడా లేస్తాడు)

భుజం : మీరు వెళ్లండిరా నాకేమీ హుషారుగా లేదు. తల నొప్పిగా ఉంది. (శేషగిరిరావు, గోపాలరావులు వెళ్ళిపోతారు. భుజంగ రావు విచారంగా కూర్చొని ఆలోచిస్తూ ఉంటాడు. మూర్తి ప్రవేశం)

మూర్తి : మాలతీ !

భుజం : మీరు ఇటు వెళ్ళగానే ఆమె దారిని ఆమె వెళ్ళింది.

మూర్తి : ఛీ ! ఎంతచెప్పినా దీనికి బుద్ధిలేదు. వంశాన్ని ఉద్ధరించే కూతురని ఎంతో గర్వపడ్డాను. నా మాట కెదురు చెపుతుందని కలలోనైనా అనుకోలేదు.

భుజం : ఉద్ధరించేకూతురని ఆ బిడ్డ ఇష్టంవచ్చినట్లు స్వేచ్ఛగా తిరగ నిచ్చారు. దాని ఫలితమే ఇది. హద్దూపద్దూ లేకుండా ఆ నీచు డింటి కెళ్ళడం ఎప్పుడు సాగించిందో అప్పుడే అనుకున్నా నేను ...

[ మాలతి, రామన్నల ప్రవేశం ]

మాల : (పైమాటలు విని కోపంతో) నాకా హద్దూపద్దూ లేనిది, నీకా ? సిగ్గు లేకపోతేసరి. అతను నీచుడట; ఈయన మహా బుద్ధిమంతుడట.

మూర్తి : చాల్లే నోరు మూయ్. (రామన్నను చూచి) ఏమోయ్ ! ఏం పనిమీద వచ్చావ్ ?

రామ : అమ్మాయిగారిని పంపిచ్చల్దామని వచ్చానండీ.

మూర్తి : (కోపంతో) అమ్మాయి పుట్టగానే చచ్చినా ఇంతదుగ్ధ లేకపోను.

భుజం : నీ వొకడవు దొరికావు డాఫరువు. ఎందుకు, ఎళ్ళొచ్చినాయి. బుద్ధిలేదూ ?

రామ : ఆట్టేమాటలు మిగలకండి—మర్యాదగా ఉండదు.

భుజం : ఛీ! వెధవ! నీకు తోడొక మర్యాద. ఏ మొఖం పెట్టుకొచ్చావురా ఇక్కడికి సిగ్గులేక!

మాల : పిచ్చిపిచ్చిగా మాట్లాడకు.

రామ : నువ్వెవరవయ్యా మాట్టాడ్డానికి? నేనొచ్చింది పంతులు గారింటికి.

మూర్తి : భుజంగం! ఊరుకో ఎందుకా ముసలాడితో? అత నేం చేశాడు?

భుజం : చేసిందంతా వీడుకాదూ? టీపార్టీలనీ, డిన్నర్‌పార్టీలనీ ఉత్తరాలు చేరేసిందెవడు? అసలు పినతల్లిని తార్చింది ఈ గాడిద కాదూ?

మాల : నోరుముయ్!

రామ : (ఉగ్రుడై) ఆ తల్లినంటా వెందుకయ్యా? నోట్లో పురుగులు పడతయి. నీదీ ఒక బతుకే అని చెప్పొచ్చావ్? నువ్వు చేసే వైద్దిగం, నువ్వాడే నాటకం అంతా రోజూ చూత్తానేఉండా. అసలా కొంపకి సిచ్చెట్టింది నువ్వుకాదూ? పాపం ఎన్నాళ్లో దాగదు.

భుజం : షటప్ రాస్కెల్ : (మీదకు వెళ్ళబోతాడు)

మూర్తి : (భుజంగాన్ని వారిస్తూ) ఏయ్ రామన్నా!

రామ : మీరు నన్ను పాతికేళ్ళనుంచి సూత్తండారు. ఎవళ్ళతోనూ ఒక్కమాట పడలా. ముసలాణ్ణయ్యాను ఎందుకు చెపుతున్నానో కాత్తాలోచించండి. ఇయ్యాలకాకపోతే రేపయినా ఈ ముసలాడు సెప్పినమాటలు నిజమే అనుకుంటారు. అసలా రంగయ్యగారి కొంపకీ,మీకొంపకీ సేటుదెచ్చిం దీ పెద్దమనిషి. కొడ్తాడూ – కొడ్తాడు. కొడ్తాడు. (అంటూ రామన్న వెళ్తాడు)–

[తెర]

# 12

## జనార్దనరావు ఇల్లు

(జనార్దనరావు కుర్చీలో కూర్చొని ప్రసాదు రాసిన "వర్ణాంతర వివాహం" రాత ప్రతి తీసి చదువుతూ ఉంటాడు. ప్రసాదు, రహీంలు ప్రవేశం)

ప్రసా : నమస్కారమండీ! (నవ్వుతూ) పుస్తకం అప్పుడే పూర్తి చేసి నట్లున్నారే?

జనా : (తల పైకెత్తిచూచి నవ్వుతూ) మొదలు పెట్టినతర్వాత మళ్ళీ మధ్యలో వదిలిపెట్టేటట్టుందా? ఇలాంటి శాస్త్రీయ విషయాన్ని కూడా ఒక నవలలాగా చక్కగా చిత్రించావు. అందరికీ అర్ధ మయ్యే సులభశైలిలో రాశావు. నుంచున్నారేం? కూర్చోండి.

(ప్రసాదు, రహీంలు కూర్చుంటారు)

రహీం : ఈ సబ్జెక్టు అంటే మంచి ఇంటరెస్టుఅండీ ప్రసాదుకి.

జనా : (చిరునవ్వుతో) అవునవును. నాకు తెలుసు. ప్రతివాక్యంలో ప్రసాదు హృదయం ప్రతిబింబిస్తూఉంది. ఎందుకాలశ్యం? ముందు దీన్ని ప్రెస్సుకిచ్చేసెయ్యండి.

ప్రసా : అదే ప్రయత్నంలో ఉన్నాం.

రహీం : చందాలు వేయించాం. కాని, అన్నీ ఇంకా వసూలుకాలేదండి.

జనా : చందాలు వసూలై ఇక మీరు అచ్చువేయించనా? ఇవ్వాళే పుస్తకం ప్రెస్సుకిచ్చేసెయ్. ఆ డబ్బు సంగతేమిటో నేను చూస్తానులే ప్రసాద్. మహాఅయితే నాలుగువందలు అవుతాయి, ఇంతేగా!

ప్రసా : ఎందుకు? రెండు మూడు రోజుల్లో వసూలు అవుతాయిలెండి.

జనా : వసూలయితే కానీయి. ఇప్పుడు వచ్చిన నష్టమేముంది ?
(కొంచెమాగి, చిరునవ్వుతో) ఎంత అమాయకుడవోయ్. డబ్బు తీసుకోడానికి కూడా సందేహిస్తున్నావ్. ఈలాంటి నీమీద కూడా దుష్ప్రచారం చేస్తున్నారంటే, నిజంగా వాళ్ళ నేమను కోవాలి.

రహీం : ఈ బద్మాషీ అంతా భుజంగరావు దేనండీ.

జనా : ఆ బుద్ధిహీనుడు కూశాడే అనుకో. రంగయ్యగా రెలా నమ్మారా అని ?

రహీం : నమ్మకేం చేస్తాడు. అబద్ధమైనా వందసార్లాడితే, అదే నిజం అవుతుంది అన్నాడు గోబెల్సు.

జనా : అబద్ధాలమీదే ఆధారపడితే, ఆ గోబెల్సుకి పట్టిన గతే వీడికీ పడుతుంది. ఈ మధ్యనే నేను రంగయ్యగారితో మాట్లాడాను.

రహీం : అచ్ఛా, ఏం జరిగింది ?

జనా : ఆయన ఏలాగైనా ప్లీడరు. అంత తేలికగా బయటపడతాడా ?

రహీం : ఔనులెండి. బమ్మిని తిమ్మిని, తిమ్మిని బమ్మిని చేయడం వారికి అలవాటేగా !

జనా : (చిరునవ్వుతో) ఎంతసేపూ "కులగోత్రం లేకుండా పెండ్లేమిటి? మీరే చెప్పండి" అంటాడు. మనం చెప్పింది వినిపించుకోడు, అయినా, ఇంకొకసారి కలుసుకుంటాను.

ప్రసా : ఎందుకు అనవసరంగా మీరు శ్రమపడడం ? అయిందేమిటో అయింది. ఈ ఎన్నికల సమయంలో ఈ గొడవ మీ రెందుకు పెట్టుకుంటారు ? (కొంచెమాగి) ఏమండీ ! మున్సిపల్ ఎలక్షన్ ఇక పదిహేనురోజులే ఉంది అనుకుంటాను ?

జనా : ఏప్రిల్ ఫస్టియత్‌న ఎలక్షన్. ఇంకో నెల రోజులు తైముంది.

ప్రసా : ఈ వార్డులో మీతో శంకర్రావు పోటీచేస్తాడటగా ఈసారి ?

జనా : పోటీ ఏమిటి ? అప్పుడే మనకు వ్యతిరేకంగా ప్రచారం కూడా సాగించాడు. ఆయన సనాతన హిందూమతోద్ధారకుడట ! నేను ఊరంతా మాలకూడు చేస్తున్నానట. అందుకే మొన్న ఉప్పెన

గాలి వచ్చిందటు! ఏమేమిటో వాగుతున్నాడు, తలాతోకా లేకుండా నోటికి వచ్చినట్లు.

ప్రసా : మసిపూసి మారేడుకాయ జేసే రోజులు దాటిపోయినై. ప్రజలు అతను అనుకున్నట్లు మూర్ఖులుగారు. తమ మంచీ చెడూ తామే ఆలోచించుకోగలరు.

రహీం : వాడి బతుకూ బండారం అందరికీ తెలుసు. ఎన్ని కొంప లార్చి ఈ మేడగట్టాడో, బంట్రోతు దగ్గరినుంచీ బడిపంతుల వరకూ అందరికీ తెలిసిందే. సిగ్గుండొద్దూ మొఖానికి. మీకే పోటీపెట్టాడూ!

జనా : పెట్టక వాడికేం. బొర్రలు పెంచుకొన్న షాహుకార్లు, జమీం దార్లు క్షేమంగా ఉన్నంతకాలం, వాడి కిదొక లెక్కా? దేని కయినా సిద్ధమే.

ప్రసా : మేకతోలు గప్పుకున్న ఈ తోడేళ్ళను నమ్మి మోసపోవడానికి ఇది పంధొమ్మిదో శతాబ్దం కాదు. ప్రజలంతా కళ్ళుతెరిచారు. ఈ బురఖా సంఘోద్ధారకులకు తగినబుద్ధి చెప్తుతారు. మీ బోటి సంఘసేవకుల్ని గెలిపించుకోవడం మా విధి. సెలవు, వస్తాం.

జనా : (నవ్వుతూ) ముందీ పుస్తకంపని పూర్తికానీయ్.

(పుస్తకం ప్రసాదు చేతికిస్తాడు.)

ప్రసా : (పుస్తకం తీసుకొని లేచి) థాంక్స్.

(జనార్దనరావు కూడా లేచి నుంచుంటాడు. ప్రసాదు, రహీంలు నాలుగడుగులు వేసి)

ప్రసా : ఒకవేళ మధు ఇక్కడికి వస్తాడేమో, ప్రెస్సులో వుంటాం రమ్మని చెప్పండి.

జనా : అలాగే.

(ప్రసాదు, రహీంలు వెళుతూఉంటారు. భుజంగరావు ఎదురై, ప్రసాదు రహీంలవైపు కొరకొరా చూస్తూ లోపలికి వచ్చి)

భుజం : గుడ్‌మార్నింగ్ జనార్దనరావుగారూ.

జనా : ఒహెూ! భుజంగరావుగారా! రండి కూర్చోండి. (కుర్చీ చూపుతాడు. భుజంగరావు కూర్చుంటూ ఉంటాడు) ఏమి టివ్వాళ దారితప్పి వచ్చారు?

భుజం : ఇంకా మీరు మీనమేషాలు లెక్కబెడుతూ కూర్చున్నారే? అవతల శంకరరావు నిద్రాహారాలు మాని బ్రహ్మాండంగా ప్రచారం సాగిస్తూఉంటే.

జనా : అలాగా!

భుజం : అలాగా ఏమిటి? ఊరంతా మోత మోగిపోతూఉంటే... నిన్న నా దగ్గరకు కూడా వచ్చాడు. ఎంత టాక్ట్‌ఫుల్‌గా మాట్లాడాడు. తన తరఫున చేస్తేనేగాని వీల్లేదంటూ ఇంటి ముందు పికెటింగు చేశాడనుకోండి.

జనా : ఓహెూ!

భుజం : నా దగ్గిరా ఈ డబ్బా వాయించడం? ఎవళ్ళు యోగ్యులో, ఎవళ్లు అయోగ్యులో మనకు వేరే చెప్పాల్నా? కాని మిమ్మల్ని దెబ్బగొట్టడానికి వాడి కొక చక్కని అవకాశం దొరికింది.

జనా : అదేమిటండోయ్!

భుజం : అదే... ఆ ప్రసాదుకు మీరు ఆశ్రయం ఇవ్వడం. ఎలెక్ష న్సులో ఇది కొంత దెబ్బకొడుతుందనుకుంటాను.

జనా : ఇందులో నే నిచ్చిన ఆశ్రయం ఏముంది? ఇదివరకు అందరికీ ఇస్తున్నట్లే, అతనికి కూడా ఇల్లు అద్దెకిచ్చాను.

భుజం : అసలు విషయం అంతేఅనుకోండి. కాని ఈ రోజుల్లో నిజా నిజాలు ఎవడికి కావాలి?

జనా : నీచు లెంత దుష్ప్రచారమైనా చేస్తారు. అంతమాత్రాన నమ్మే దెవడు?

భుజం : ఇదిగో పూవు పూసింది అంటే అదిగో కాయ కాసింది అంటారు. గోరంత ఉంటే కొండంత చేస్తారు.

జనా : అసలున్నదేమిటి? చేసేదేమిటి?

భుజం : ఏముంది, ఇంతకు పూర్వమే చెప్పానుగా. ప్రసాదుకు ఇల్లు ఇవ్వడాన్ని గురించి. రెండోది ప్రసాదు ఏదో 'వర్ణాంతర వివాహం' అనే పుస్తకం రాశాడట; దానికి మీ ప్రోత్సాహం ఉంది అని అనుకుంటున్నారు.

జనా : అవును. రాశాడు. చాలా బాగుంది. నేనే ప్రింటుచేయిస్తున్నా.

భుజం : అయితే ఇకనేం? దీన్ని అవకాశంగా తీసుకొని, శంకర్రావు కావలిసినంత విషప్రచారం సాగిస్తాడు.

జనా : ఈ మాత్రం సంస్కారానికి కూడా మనం సాహసించలేక పోతే ఎలాగండీ?

భుజం : నిజమే. మనలాంటి ఎడ్యుకేటెడ్ పీపుల్ కేమీ ఉండదను కోండి. కాని ప్రజాసామాన్యంలో కొంత దెబ్బకొడుతుంది.

జనా : అఫ్‌కోర్స్.

భుజం : ఏమండోయ్ జనార్దనరావుగారూ, ఎలెక్షన్ అంటే ఏమను కుంటున్నారు! గొప్ప చదరంగపుటెత్తులు, ముక్కుకు సూటిగా పోదాం అంటే సాగదండీ. ఏ ఎండ కా గొడుగు పట్టాలి.

జనా : అసంభవం.

(ఇంతలో మధు, మురహరి ప్రవేశించి
ఒక ప్రక్కన నుంచుని వింటూఉంటారు)

భుజం : అయితే మీరు ఎలెక్షనులో గెలవడం కూడా అసంభవమే.

జనా : ఎలెక్షనులో గెలుపుకాశించి ఇలాంటి తప్పుడుపనులు చేయడం నా పనిగాదు. ప్రసాదులాంటి ఆదర్శజీవికి సహాయం చేయడం నా ధర్మం. నమ్మిన సిద్ధాంతాన్ని ఖూనీచేసి గెలిచేదానికన్నా, ఓడిపోవడమే మంచిది.

భుజం : (విషపు నవ్వు నవ్వి) ఈ నాటికి మీ నోటివెంట ప్రసాదు కూడా ఒక ఆదర్శజీవి అని వింటున్నాను.

మురః : (ముందుకు వచ్చి) అవును, కామెర్లరోగికి ప్రపంచం అంతా పచ్చగానే కనపడుతుంది. నీ జన్మ తగలెయ్య, సిగ్గులేక ఇంకా

ప్రసాదుకు వంకబెట్టబోతున్నావా. వెయ్యేండ్లు తలకిందుగా తపస్సు చేసినా, నీవు వాడి కాలిగోటి ఖరీదు చేస్తావురా ? ఇది వరకు చేసింది చాలక మళ్ళీ ఇక్కడికికూడా తయారయ్యావ్ ?

మధు : నీవు గాదటురా ఈ నాటకంఅంతా ఆడింది. పినతల్లికీ, కొడుక్కీ అంటుగట్టిన పరమఛండాలుడివి.

భుజం : (లేస్తూ) ఖబడ్ దార్.

(జనార్దనరావుకూడా లేచి నుంచుంటాడు)

మధు : షటప్ (అని చేయి ఎత్తుతాడు)

(తెర)

# 13

## మూర్తి ఇల్లు

[భుజంగరావు, శేషగిరిరావు మాట్లాడుకుంటూ ప్రవేశం]

శేష : ఏమోరా, నీ విప్పుడు మెడ్రాసు వెళ్ళడం నా కేమంత నచ్చలా.

భుజం : (విసుగ్గా) ఈ ఊళ్ళో ఉండడమే అనవసరంరా.

శేష : అక్కడమాత్రం ఏముంది? అర్థరుపద్ద ఉద్యోగంకాస్తా చేతులారా పోగొట్టుకొంటివి.

భుజం : ఆ ఉద్యోగం పోతే దాని తాత ఇంకొకటి. చదువుకున్నవాడికి మెడ్రాసులో ఏం తక్కువరా ? లక్ష అవకాశాలు.

శేష : కూతురు మాట వినలేదని ఇప్పటికే కుళ్ళికుళ్ళి చస్తున్నాడు. నీవుకూడా వదిలేస్తే, ఇక మీ మామయ్య గతి ?

భుజం : ఎవడి ఖర్మ వాడిది. ఎవరు తప్పించగలరు ?

శేష : ఇంతబతుకు బతికి ఆ ప్రసాదుగాణ్ణి సాధించకుండా ఏమని వెళ తావురా? అసలు సూత్రధారుడివి నీవే వెళ్ళిపోతే, ఇంకా వాణ్ణి పట్టుపగ్గాలుంటాయా ? ఇక మా పైకి ఒంటికాలిమీదే దూకు తాడు.

భుజం : (నవ్వుతూ) నీవుమాత్రం ఇక్కడుంటావురా ? నీకూ్కడా అక్కడే ఉద్యోగం చూస్తాను నెల రోజుల్లో.

గోపా : (ప్రవేశిస్తూ) ఎక్కడరా ? కాఫీ హెూటల్లోనా ?

భుజం : ఏడ్చావులేవోయ్, ఏమిటి కబుర్లు ?

గోపా : ఏమున్నాయి. పుస్తకం రాశాడు. అయిదువందలు బహుమానం కొట్టాడు. దెబ్బంతే వాడిది నీదీ నాదీ ఏముందిరా చావల్ ఖరాబుగాళ్ళం.

శేష : వాడికి బహుమానం వస్తే నీవు అదిరిపడి చస్తున్నా వెందుకురా? నీ కేం వచ్చింది ?

గోపా : ఏముంది ? వాడికి బహుమానం, మన కవమానం.

భుజం : అయితే కూర్చొని ఏడువ్.

గోపా : అందుకే వచ్చా కలిసి ఏడుద్దామని.

శేష : అట్లే చూస్తే నిన్ను వైజాగ్ పంపించాలిసొచ్చేటట్టుందే ?

గోపా : ఎందుకు ?

శేష : ఎందుకా ? పిచ్చాసుపత్రికి.

గోపా : మెడ్రాసుకూలోడా ఉందిగా పిచ్చాసుపత్రి.

శేష : సరేగాని అసలు ఎవడురా ఆ తిక్క శంకరయ్యకు బహుమానం ఇచ్చింది ?

గోపా : ఆంధ్ర సాహితీ సమితి. మొత్తం మీద పుస్తకం చాలా బాగుందిరా. పుస్తకం పూర్తిగా చదివితే, ఎంత మడిగట్టుకున్న సోమయాజులుగారైనా మారిపోవలసిందే.

భుజం : నా కేం చెప్తావులేరా ఫూల్, ఎలక్షన్ దగ్గరకొచ్చిందికదోయ్. ప్రసాదు ముఠాను కూడగట్టుకోడానికి, ఇదంతా జనార్దనరావు వేసిన ఎత్తు.

గోపా : (వ్యంగ్యంగా) వారెవా ! ఎంత సూక్ష్మగ్రాహివిరా. కథ అడ్డం తిరిగిందిగాని, ఛీఫ్ మినిష్టర్ కావలిసిందిరా నీవు.

శేష : అసలు నీ కేమన్నా తలకాయ ఉందా ?

గోపా : తలకాయ అందరికీ ఉంటుంది, కాస్త పదార్థంకూడా ఉండాలి.

శేష : ఏం ఇలా ప్లేటు మార్చావు ?

గోపా : ఆ పుస్తకం ఒక్కసారి చదివితే మీ ప్లేటుకూడా మారుతుంది.

శేష : ఆ ప్రసాదుగాడి బుర్ర రామకీర్తన పాడించిననాడే మా ప్లేటు మారేది.

గోపా : ఇప్పటికైనా బుర్ర తిరక్కపోతే, అంతపనీ మనకే జరుగుతుంది.

భుజం : ఇంకో జన్మ యెత్తాలి. ఏమి టీ వెధవసోది. పోవోయ్ !

గోపా : పోవడానికేం, సిద్ధంగా వున్నా. ఇన్నాళ్ళనుంచీ స్నేహం చేసినందుకు మీకుకూడా ఒకసారి చెప్పిచూద్దాం అని వచ్చాను. మనుషు లనిపించుకోవాలంటే ఈ బుద్ధితక్కువ పనులు మానడం మంచిది. శంకర్రావు చంకకింద దూరి మీ రెంత నీచానికి పాల్పడుతున్నారో నాకు తెలుసు. రౌడీలతో ప్రసాదును కొట్టించాలని చూస్తున్నారంటే, చేతులారా మీ గోతిని మీరు తవ్వుకోవడం అన్నమాట – ముందైనా జాగ్రత్తపడటం మంచిది (గోపాల్ వెళ్ళిపోతాడు. భుజంగరావు, శేషగిరిరావులు కొంచెంసేపు నిశ్శబ్దంగా నుంచుంటారు).

శేష : నేను మొదటినుంచీ నీతో చెబుతూనేవున్నా – వీడూ, మురహరీ ఎప్పుడో కొంపదీస్తారని.

భుజం : ఈ స్కౌండ్రల్సును నరికినా పాపం లేదు.

శేష : ఈ వెధవలుంటే ఎంత? ఊడితే ఎంత? నే నిప్పుడే శంకర్రావుగారి దగ్గరకు వెళ్తాస్తా.

[శేషగిరి వెళ్ళిపోతాడు. భుజంగరావు నిప్పుత్రొక్కిన కోతిలాగా అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. పార్వతి ప్రవేశం]

భుజం : (విస్మయంగా) ఏమి టిలా వచ్చావు, పార్వతీ?

పార్వ : ఏంజేస్తాను రాక!

భుజం : ఏమి టలా విచారంగా వున్నావు? మీ నాన్న ఏమన్నా అన్నాడా?

పార్వ : ఎందు కనరు? అంతా అంటారు. మీ కేం మొగాళ్ళు. మా కష్టాలు మీ కేం తెలుస్తాయి?

భుజం : ఏమి టీ సోది. అసలు విషయ మేమిటో చెప్పరాదూ?

పార్వ : మద్రాసు వెళతారటగా? ఎప్పుడు?

భుజం : ఏమో! ఎప్పు డవుతుందో చెప్పలేను.

పార్వ : ఎందుకీ అబద్ధాలు! ఒక పక్కన మూటాముల్లే సర్దుకుంటూ—

భుజం : (విసుగ్గా) అయితే ఏ మంటావ్?

పార్వ : ఇంతకూ నన్నేంచేసిపోతారు ? ఇక నే నా యింట్లో ఒక్క ఘడియకూడా ఉండటానికి వీల్లేదు.

భుజం : ఊఁ ... అయితే ?

పార్వ : నేనూ మీతోపాటు రావలసిందే !

భుజం : వచ్చిన ఉద్యోగమూ మా మామ పుణ్యమాఅంటూ పోయింది. ఇప్పుడు నిన్నుకూడా అక్కడికి తీసికెళ్లి ఏం చెయ్యను ?

పార్వ : మరి నా గతి ఏవిఁటి ?

భుజం : ఏం జేస్తాం ? నాలుగురోజులు ఓపికపట్టాలి ! ఏదో ఉద్యోగం చూచుకొని నెమ్మదిగా తీసుకెళతాను.

పార్వ : అట్లా వీల్లేదు. ఈ నెలకూడా గడిచిందంటే, నా బ్రతుకుకాస్తా బైట బడుతుంది.

భుజం : ఓహో ! అదా సంగతి. (కొంచెం ఆలోచించి) సరే ! తీసుకెళదామా అంటే నీ దగ్గరా డబ్బు లేదాయె ! నా దగ్గరా డబ్బు లేదాయె.

పార్వ : (విచారంగా) ఇదివరకున్న దేదో మీకే యిచ్చానుగా. ఇప్పుడు నా దగ్గర ఏం ఉంది.

భుజం : సరే వెళ్లు. మా మామకూడా వచ్చే వేళయింది. తర్వాత ఆలోచిద్దాం.

పార్వ : (కోపంగా) నీవు చెప్పిన తియ్యతియ్యని కబుర్లన్నీ చివరికీ మాటలు చెప్పడానికేనా ?

భుజం : అనుకో ! నీ యిష్టంవచ్చినట్లు అనుకో !

పార్వ : ఇట్లా నమ్మించి గొంతుకోస్తావని కల్లోకూడా అనుకోలా.

[మూర్తి ప్రవేశించి, ప్రక్కన నుంచొని వింటూవుంటాడు]

భుజం : ఇదివరకు నేను బయలుదేర మన్నప్పుడు బయలుదేరావా ? ఇప్పుడు ఎవళ్ళ నేం చెయ్యమంటావ్. అనుభవించు, కాకపోతే నా చేతనైనపని మం దివ్వమంటే యిస్తా.

పార్వ : (నిరాశతో కోపంగా) ఏమిటీ ! మందా ? ఇంత చేతగాని వాడివి, మొదట అన్ని మాయమాటలు చెప్పడం ఎందుకు ?

నీ వేదో పెద్ద ఉద్ధరిస్తావని చెప్పినట్లల్లా చేశాను. చిన్నప్పటి నుంచి ఎంతో గారాబంగా పెంచిన కన్నతండ్రి పేరు కాస్తా గంగలో కలిపాను. అన్నెం పున్నెం ఎరుగని బంగారంలాంటి తమ్ముణ్ణికూడా ఇంట్లోనుంచి వెళ్ళగొట్టించాను.

[మాలతి ప్రవేశించి మూర్తి ప్రక్కనే నుంచుంటుంది.]

భుజం: (కోపంగా) నోర్మూయ్. నీ తమ్ముడి బ్రతుకూ, నీ బ్రతుకూ నా దగ్గిర చెప్పొస్తున్నావా? వాడు అంత బంగారమైతే, పోయి వాడిదగ్గరే పడివుండు. ఇక్కడ కెందుకు చచ్చావ్?

పార్వ: నాకు చావెట్లాగూ తప్పదు. ఇట్లా కొంపలు తీసేవాడివి కాబట్టే, మాలతి నిన్ను కుక్కలాగా చూసింది. ఇంతకంటే ఇంకేం చేస్తావ్? నా దారి ఏదో నాకు ఉండనే వుంది.

(చరచరా వెళ్ళిపోతుంది.)

మాల: పార్వతీ, పార్వతీ (మాలతి మాటలు విని పార్వతి యింకా త్వరగా పరుగెత్తుతుంది. మాలతి పింగులోకి పోతుంది)

మూర్తి: (రోషంతో మండిపోతూ) ఇలా ఎన్ని కొంపలార్పావురా భ్రష్టుడా! నీకోసం నాజీవితమంతా ధారపోశా. దున్నపోతువై పుట్టాలిసింది. వెధవ! మనిషివై పుట్టావు. ఛీ, నీ ముఖం చూచినా గతులుండవు. నడువు బైటికి. ఒక్కక్షణం గూడా నా ఇంట్లో ఉంటానికి వీల్లేదు. ఊం. గెటౌట్ రాస్కెల్.

(భుజంగరావు వెళ్ళిపోతాడు.)

మాల: (మూర్తి చీవాట్లు పెడుతుండగా మళ్ళీ ప్రవేశించి) నాన్నగారూ.... ... ... ...

మూర్తి: (గాద్గదికంగా, ఆదుర్దాతో) పదమ్మా, పద. పార్వతీ ... ప్రమాదం ... ప్రమాదం. (అంటూ తొందరతొందరగా తండ్రీ, కూతురూ పరుగెత్తుతారు.)

[ తెర ]

# 14

## ప్రసాదు గది

[ ప్రసాదు పాట వ్రాసి పాడుకుంటూ ఉంటాడు ]

టీన్ తాల్ – భాగేశ్వరి

సంఘ దురాచారానికి బలి...
జాతికి బాధలు పోవా – స్త్రీ
జాతికి మోక్షము లేదా॥ ॥సంఘ॥

భారత మహిళామణి నొకనాడు
గౌరవించె నీ జాతీ – ఆ
బంగరు తల్లిని మురికికూపమున
పడదోయుదువా నేడు॥ ॥సంఘ॥

స్వార్థానికి నీ సాధ్వీమణి నొక
బానిసగా బంధించితివా
నీతి నియమములు సడలిపోయి నీ
జాతి పతన మౌనోయీ॥ ॥సంఘ॥

[ రామన్న నీళ్ళకుండ భుజాన పెట్టుకొని వస్తాడు. ప్రసాదు రామన్న భుజంమీద కుండ దింపుతూ ]

ప్రసా: ఎన్ని కష్టాలు పెడుతున్నాను తాతా నిన్ను.

రామ : నా కష్టాల కేమొచ్చెలే బాబూ! పుట్టిన్నాటనుండీ ఉండయ్యే. ఇయ్యాల కొత్తేముంది ?

ప్రసా : తల్లిపోయిననాటినుంచీ ఏ లోటూ రాకుండా ఎంతో, గారా

బంగా పెంచావు. ఇప్పుడు కూడా నీవే ఆధారం అయ్యావు. నీ రుణంఎలా తీర్చుకోగలను తాతా!

రామ : దాని కేమొచ్చెలే బాబూ! ఇంటికాడ మీ పిన్నమ్మ సూడ బోతే మూసిన కన్ను తెరవటంలా. మంచా నంటుకుపోయింది. నాన్న నూడబోతే కుమిలిపోతండాడు. ఏం గానుందో!

ప్రసా : ఏమయితే మాత్రం నే నేమి చేయగలను తాతా!

రామ : అదేంటి బాబూ! కష్టకాలంలో ఒకళ్ళకొకళ్ళు తోడుగా ఉంటే కాత్తిదిగా ఉంటది.

ప్రసా : నా కా యోగం లేదు.

రామ : ఏదో ఆ కోపంమీద అట్టా అన్నాడేగాని, ఆ మాటెత్తినప్పుడల్లా అవురుమంటాడు. ఇప్పుడు నువ్వొత్తే కళ్ళ కద్దుకుంటాడు. బాబూ! ఎల్దాం పద. నా మాటిను. (గడ్డం పట్టుకుంటాడు)

ప్రసా : (విచారంగా) ఏమో తాతా!

రామ : మనిసికి పట్టూ ఇడుపూ ఉండాలి బాబూ! లే. ఎల్దాం.

ప్రసా : (ఆలోచిస్తూ పైపంచేసుకొని రెండడుగులు వేసి) నా కేం పాలుపోవడంలా, నీవు వెళ్ళిరా!

[రామన్న వెళ్తాడు. ప్రసాదు విచారంగా కూర్చొని ఉంటాడు. గోపాల్, రహీంల ప్రవేశం]

రహీం : ప్రసాద్! మన కఖండవిజయంరా!

గోపా : థంపింగ్ మెజారిటీ.

ప్రసా : అసలు డిపోజిట్ పోవాలిసిందిరా వాళ్ళకి. కనకవర్షం కురిపించబట్టి ఆమాత్రమైనా వచ్చాయి.

రహీం : ముస్లింలంతా సాలిడ్‌గా మన్నే సపోర్టుచేశార్రా.

[జనార్దనరావు, మధు, మురహరిరావుల ప్రవేశం]

జనా : థాంక్యూ, రహీం! ట్రెమెండస్‌గా వర్కు చేశావు.

ప్రసా : ఓ! జనార్దనరావుగారా! రండి! కూర్చోండి.

మురః వా ళ్ళెంత దుష్ప్రచారం చేస్తేమాత్రమేం? ఎప్పటికైనా న్యాయం గెల్చితీరుతుంది.

గోపాః నేను వెళ్ళి శంకర్రావుగారిని చూసొస్తారా.

రహీంః ఎందుకు నీ మొహం?

గోపాః నా మొహం నీ మొహం ఎదురుబడే ఉండె. ఇవ్వాళ ఆయన మొహం ఎలాఉందో చూద్దామని.

(అందరూ నవ్వుతారు)

జనాః ఇవ్వాళ మా ఇంటిదగ్గర డిన్నరు. ఫ్రండ్సు అందర్నీ ఆహ్వానించాను. రాత్రి ఎనిమిదిగంటలకు మీరంతా తప్పకుండా రావాలి.

రహీంః ఓ యస్, అలాగే.

మధుః సరేగాని, మూర్తిగారుకూడా మనకే వోటుచేశాడు ఏమిట్రా?

మురః ఎలాగైనా ఎడ్యుకేటెడ్ గాదురా. ప్రసాదు రాసిన పుస్తకం చదివేటప్పటికి, మారిపోయాడురా మనిషి.

ప్రసాః ఇవన్నీ పైపై మెరుగులే కాని, జనార్దనరావుగారి యోగ్యతే ప్రధాన కారణం.

జనాః ఈ విజయం మనకు కాదు. మన సిద్ధాంతానికి.

మూర్తిః (ప్రవేశిస్తూ) అవును. విజయం మీ సిద్ధాంతానికే. నేను కూడా మీ సిద్ధాంతానికే వోటుచేశాను.

ప్రసాః నమస్కారమండీ, మాష్టరుగారూ.

(గోపాల్, రహీంలు ఒకళ్ళ ముఖంవంక ఒకళ్లు చూసి నవ్వుకుంటారు.)

మూర్తిః నాయనా, ప్రసాద్! చిన్నప్పటినుంచీ నీ స్వభావం తెలిసిఉండి కూడా చివరకు పొరపడ్డాను. నీమీద జరిగిన దుష్ప్రచారంలో నేనూ భాగస్వామి నయ్యాను. (చేతులు పట్టుకుంటూ) క్షమించు.

ప్రసాః పెద్దవారు, అంతమాటనకండి. ఇందులో బుద్ధిపూర్వకంగా మీరు చేసిన అపరాధం ఏమీ లేదు.

జనా : గతించినదానికి ఇప్పు డెందుకులెండి మూర్తిగారూ !

మూర్తి: అవును. (ప్రసాదుతో) ఒంటరిగా ఇక్క డేమవస్థపడతావు, రా, మనింటికి వెళదాం.

ప్రసా: ఎందుకులెండి. నానుంచి సంఘంలో మళ్ళీ మీకు కొన్ని చిక్కులు రావచ్చు.

మూర్తి: ఇన్నాళ్ళనుంచీ నేను ఈ పిచ్చిభ్రమలోనే పడివున్నాను. ఈ జాత్యహంకారమే నన్నింతవరకు తెచ్చింది. దేవుడు మేలు చేస్తే, ఈ కులగోత్రాల నిజస్వరూపం ఇప్పుడు గుర్తించాను. గుణం ప్రధానంగాని, కులం ప్రధానంగాదు.

జనా : ఇప్పు డెందుకులెండి మూర్తిగారూ. ఇవాళ మా ఇంటిదగ్గర మీ అందరికీ విందు. ఈ రెండు రోజులూ ప్రసాదు మా ఇంట్లోనే ఉంటాడు. రేపు నేను రంగయ్యగారినికూడా కలుసుకొని మాట్లాడతాను.

[రామన్న విచారంగా ప్రవేశం]

ప్రసా: (ఆదుర్దాగా) ఏమిటి తాతా ! అలా ఉన్నావ్ ?

రామ: ఏం చెప్పను. నిన్నపైటేళ రొండు మెతుకులు తిని ఎక్కడికో పోయిందట పాంరొవతమ్మ. ఏఁవయిందో ఇంతవరకు అజలేదు.

ప్రసా: (నిశ్చేష్టుడై) ఆఁ...

మధు : ఏమయిందో పాపం.

ముర : ఎక్కడికి వెళ్ళి ఉంటుంది !

రామ: ఏఁవో నాయనా ! మళ్ళీ నూత్తావఁనే ఆశలేదు. పండంటి సంసారానికి సివర కీగతి పట్టింది.

మూర్తి: ఏముంది, అనుకున్నంతా జరిగింది. ఆత్మహత్య చేసుకొని ఉంటుంది.

జనా : ఇక్కడ కూర్చొని ఆలోచిస్తే ఏం లాభం ! తొందరగా వెదకడం మంచిది.

మధు: పదండిరా ముందు. తలా ఒక వైపు వెళదాం.

ముర<br>గోపా<br>రహీం } ఊc. పదండి. త్వరగా.

(అందరూ వెళ్ళిపోతూ ఉంటారు)

జనా : వెళ్ళండి నాయనా. వెళ్ళండి. నేనూ రంగయ్యగా రింటికి వెళ్ళి వస్తాను.

మూర్తి: (జనార్దనరావుతో) నేనుకూడా వస్తా. పదండి.

(జనార్దనరావు, మూర్తిగార్లు మరోవైపు వెళతారు)

[ తెర ]

## 15

## రంగయ్యగారి మేడ

[సుశీల మంచంమీద పండుకొని వగ్గుతూ ఉంటుంది. రంగయ్య విచారంగా నిలబడి చూస్తూ ఉంటాడు. మూర్తి, జనార్దనరావుగార్లు ప్రవేశిస్తారు. రంగయ్య కూర్చోమని వారిని సైగజేస్తాడు.]

మూర్తి : (ముక్కుమీద వేలు వేసుకొని) అరరె! ఎంత క్షీణించి పోయింది. గుర్తుపట్టడం కూడా కష్టంగా ఉంది.

జనా : పిలిస్తే ఏమయినా మాట్లాడుతుందా అండీ!

రంగ : అదే మాట్లాడడం. పిలవగా పిలవగా ఎప్పుడో కాస్త ఊం అంటుంది.

మూర్తి : ఏం చేస్తాంలెండి. అంతా భగవదాయత్తం.

జనా : శక్తికొలదీ చేయాలిసిందేమిటో చేస్తున్నారు. మనమేమీ కర్తలం కాదుగా.

(డాక్టరు రామారావుని తీసుకొని రామన్న ప్రవేశం. మూర్తి, జనార్దనరావులు లేచినుంచుంటారు. రామరావు రోగిదగ్గరకు వెళ్ళి నాడి పరీక్షచేస్తూఉంటాడు. రంగయ్య మంచందగ్గర నుంచుని దీనంగా చూస్తూవుంటాడు. రామన్న తుండు, నీళ్ళ చెంబు, సబ్బు పట్టుకొని బిక్కమొగంతో డాక్టరు పక్కన నుంచుని, సుశీలవైపు చూస్తూవుంటాడు. డాక్టరు ఇంజక్షన్ ఇచ్చి కొంచెందూరంగా వున్న కుర్చీలో కూర్చుంటాడు. రామన్న రోగి మంచందగ్గర కూర్చొని విసురుతూ ఉంటాడు)

జనా : ఎలా ఉందండీ డాక్టరుగారూ?

డాక్టర్ : (జనార్దనరావుతో ముందుకు రెండు అడుగులువేసి మెల్లగా) ఉన్న స్థితి ఏమిటో చూస్తూనే ఉన్నారుగా. మొదట్లోనే టి. బి. అని తెలుసుకుంటే, ప్రమాదం ఉండేదికాదు. తీరా ముదిరినతర్వాత కేసు నా చేతికి వచ్చింది. వస్తానండీ రంగయ్యగారూ.

రంగ : ఇంతకూ నా ఖర్మకు మీ రేంచేస్తారులెండి. నా తెలివి తక్కువవల్లనే కూతుర్ని చంపుకున్నాను. కన్నకొడుకునా ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాను. చేసుకున్న భార్యను చేతులారా ఈ స్థితికి తెచ్చాను.

(తలవంచుకొని కన్నీరుగారుస్తూ ఉంటాడు)

మూర్తి : అనేకమంది స్త్రీలని చూశాను కాని, ఇంత యోగ్యురాల్ని ఎక్కడా చూడలేదు. ఎంత ఓర్పు! ఎంత నిదానం!

(రంగయ్యగారు వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంటాడు.)

జనా : రంగయ్యగారూ! తెలిసినవారు మీరే ఇలా గుండె చెదితే ఎలా? ధైర్యంగావుండాలిగాని. ఇప్పటికైనా ప్రసాదును తీసుకు రండి. బ్రతికుండగా పినతల్లిని కడసారైనా చూసుకుంటాడు.

రంగ : (తలపైకెత్తి) ఇంతద్రోహంచేసి వాడి కేమని మొఖం చూపెట్టను. ఇంకా వాడీ పాపఖర్మది గడప తొక్కుతాడా?

జనా : మీరు అలా అనుకోవద్దు. ప్రసాదు చాలా మంచివాడు. రామన్నా! నీవు త్వరగా జట్కా చేసుకెళ్ళి, ఈ సంగతి చెప్పి ప్రసాదును తీసుకురా. వెళ్లు. త్వరగా రావాలి. మేంకూడా ఇక్కడున్నాం అని చెప్పు.

[రామన్న రంగయ్యగారివైపు చూసి, త్వరగా వెళ్ళిపోతాడు. కొంచెంసేపు నిశ్శబ్దంగా వుంటుంది. సుశీల దగ్గుతుంది. మాలతి ప్రవేశం.]

మాల: (సుశీల తలప్రక్కన మంచంమీద కూర్చొని) అక్కా! అక్కా! (సుశీల మూలుగుతూ వుంటుంది. సుశీల ఒకప్రక్కకు పొర్లి తనలో తాను మా...ల...తీ... అనుకుంటుంది. మూర్తి,

జనార్దనరావులు మంచందగ్గరకు వచ్చి నుంచుంటారు. సుశీల మళ్ళీ మా...ల...తీ...అంటుంది. మాలతి కన్నీళ్ళు తుడుచు కుంటూ ఉంటుంది.)

మూర్తి : ఏమిటమ్మా! మాలతీ అంటున్నావు? ఎందుకమ్మా? చూడు అదిగో (కన్నీరు తుడుచుకుంటూ జనార్దనరావుతో) ఎప్పుడూ ఒక తల్లిబిడ్డల్లాగా ఉండేవాళ్ళు. మాలతి ఒక్కపూట కనపడక పోతే, రామన్నను పంపేది.

జనా : (జాలిగా) కనపడుతూనే ఉందిగా పాపం, మాలతీ, మాలతీ అని కలవరించడం.

మాల : అక్కా! అక్కా! మాలతిని.

సుశీ : (కళ్ళెత్తి చూచి క్షీణ స్వరంతో) మాలతీ, వచ్చావా! మాలతీ (అంటూ తలమీద చెయ్యివేసి కళ్ళవెంట నీళ్ళు గారుస్తూ ఉంటుంది. ప్రసాదుతో రామన్న ప్రవేశం)

ప్రసా : (సుశీల మంచంప్రక్కన నుంచొని) పిన్నీ, పిన్నీ, నేను ప్రసాదును

సుశీ : వచ్చావు నాయనా! (ప్రసాదు చెయ్యి పట్టుకొని రంగయ్యగారిని, మూర్తిగారిని చేసైగతో దగ్గరకు పిల్చి,) నేను పోతున్నాను... ఇకనైనా.. మాలతీ, ప్రసాదుల పెళ్ళిచేయండి. ఇదే ... నా ఆఖరు కోరిక.

[అందరూ కళ్ళు తుడుచుకుంటూ వుంటారు]

సుశీ : తా...తా... ...

రామ : ఏంటమ్మా,

సుశీ : (దగ్గి) నీ రుణం... తీర్చుకో... లేక పో... యా... ను.

[మళ్ళీ దగ్గుతెర వస్తుంది. కళ్ళు మూసుకుపోతాయి]

మాల : అక్కా! అక్కా!

ప్రసా : ఇంకెక్కడి అక్క ...

సమాప్తం

★